mahabubabad జిల్లా నర్సింహులపేటలో గ్యాస్ గోదాము వద్ద సిలిండర్లు లైన్‌లో పెట్టి, అక్కడే నిద్రిస్తున్న వినియోగదారులు



ఇది మోదీ పాపం
ఇది రేవంత్ శాపం..

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

సోమవారం MONDAY 4.5.2026

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline


NAMASTE TELANGANA

హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 15 సంచిక (Issue): 329

వెల (Price) రూ.6.50

సోమవారం, సూర్యోదయం: 5-49, సూర్యాస్తమయం: 6-37. శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు వైశాఖ మాసం కృష్ణ పక్షం తిథి: తదియ తెల్లవారుజామున 5-25 వరకు. నక్షత్రం: అనూరాధ ఉదయం 9-58 వరకు, తదుపరి జ్యేష్ఠ. వర్జ్యం: సాయంత్రం 4-14 నుంచి సాయంత్రం 6-02 వరకు. రాహుకాలం: ఉదయం 7-25 నుంచి ఉదయం 9-01 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-38 నుంచి పగలు 1-29 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 3-11 నుంచి సాయంత్రం 4-02 వరకు. అమృతకాలం: రాత్రి 3-01 నుంచి తెల్లవారుజామున 4-49 వరకు. వాస్తు కర్తరీ ప్రారంభం.





రైతులు మళ్లా ఆగమైండ్రు!

కాంగ్రెస్ పాలనలో అన్నదాతలు అన్యాయమైపోతున్నరు

వ్యవసాయంలో తెలంగాణను దేశంలోనే ఆదర్శంగా మనం నిలిపినం

ఇప్పుడదంతా అతలాకుతలమైంది!

వరంగల్ సదస్సుకు భారీగా వచ్చేలా చూడండి.. రైతులతోనే మాట్లాడించండి

మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో ఫోన్‌లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

రాష్ట్రంలో పరిస్థితులపై తీవ్ర ఆవేదన



దేవరుప్పుల, మే 3 : 'ఉమ్మడి రాష్ట్రంలో అష్టకష్టాలు పడ్డ తెలంగాణ రైతాంగాన్ని స్వరాష్ట్రంలో తలెత్తుకొని తిరిగేలా చేసినం. నేడు కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాత రోజుల నాటి దుస్థితి దాపురించింది. రైతులు అన్యాయమైపోతుండ్రు దయాకర్' అంటూ ఎర్రబెల్లి దయాకర్‌రావుతో ఫోన్‌లో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వాపోయారు. శనివారం రాత్రి ఎర్రబెల్లికి ఫోన్ చేసిన > 5వ పేజీలో

• వడదెబ్బ: చివరి మజిలీ

• చీకటి బతుకు.. చిందరవందర

ఖమ్మంలో ఆదివారం రాత్రి చుట్టూ చేరిన వర్షపు నీళ్ల నడుమ ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నంలో రైతు



కొనుగోళ్ల కోసం పడిగాపుల్లో రైతు ఒడిపోతున్నడు. వడ్లో, మక్కలో, జొన్నలో రాశి పోసుకొని ప్రభుత్వం కొనకపో తుందా? అన్న నిరీక్షణలోనే విగత జీవిగా మారుతున్నడు. రైతుల ప్రాణాలు పోతున్నా పంట కొనుగోళ్లను పట్టించుకునే నాథుడే లేడు.

కాడి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం..
కాంటా కూడా వదిలేసింది!

ప్రాణాలు తీస్తున్న ఎండలు ఒకవైపు! పంటల్ని ముంచుతున్న వర్షాలు మరోవైపు! నడిమిట్ల ప్రాణాలు పణంగా పెట్టి పడిగాపులు పడుతున్నారు రైతులు. స్పందించని సర్కార్‌ను నమ్ముకొని, కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. చినుకుపడితే వడ్లు తడవకుండా తండ్లాడుతున్నరు. మండుటెండల్లో వడ్లు ఆరబోసుకొని అవస్థలు పడుతున్నరు. పిడుగుపడితే ఒక్కజీవి ఒక్కసారిగా కుప్పకూలుడే! వడగాలి తగిలితే విగతజీవిగా మారుడే! ఆదిలాబాద్ నుంచి ఖమ్మం దాకా ఒకే వెత!

అన్నంపెట్టే రైతన్నకు ఎంతటి దురవస్థ?
ఏమి దరిద్రమిది? ఎవరి శాపమిది?

ఆదివారం ఒక్కరోజే రాష్ట్రంలో ఇద్దరు రైతులు వరికుప్పలపైనే తనువు చాలించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్‌లో ధాన్యం కొనుగోలు కోసం నాలుగు రోజులుగా నిరీక్షిస్తున్న గౌరయ్య.. వడగాలికి వడ్ల కుప్పపైనే ప్రాణంవదిలాడు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లి కొనుగోలు కేంద్రంలో నెలరోజుల క్రితం వడ్లు తెచ్చి పోసిన రైతు నీలం వెంకన్న.. కాంటా వేస్తున్న సమయంలో పిడుగుపాటుకు గురై మృత్యువాతపడ్డాడు.

రాష్ట్రంలో కొత్త పథకం.. కల్లాల్లో మరణమృదంగం!
బక్కరైతును బలిపీఠం ఎక్కిస్తున్నది ప్రభుత్వం!

కాడి పారేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

కుప్పకూలిన రైతులు!

• వానదెబ్బ: పిడుగుకు బలి



మహబూబాబాద్ జిల్లా సూదనపల్లి కొనుగోలు కేంద్రంలో పిడుగుపాటుతో మృతిచెందిన రైతు నీలం వెంకన్న

ప్రాణాలు పోతుంటే ఉత్సవాలా?

పంటకొనే దిక్కులేక నెలల తరబడి రైతుల అరిగోస

అకాల వర్షాలు, మండుటెండల్లోనూ పడిగాపులు

కొనుగోళ్లను పక్కనబెట్టి.. నేటి నుంచి రైతు వారోత్సవాలు.. రేవంత్ సర్కార్ క్రూర పరిహాసం > 4

కొనుగోళ్ల పడిగాపుల్లో గాల్లోకి ప్రాణాలు

రంగారెడ్డి జిల్లా రాయపోల్‌లో నేలకొరిగిన వరి రైతు

కాంటా కోసం 4 రోజులుగా ఎదురుచూసిన గౌరయ్య

తేమ సాకుతో కొనుగోలుకు నిరాకరించిన అధికారులు

ఆరబెట్టిన వడ్లను కుప్పగా పోస్తూ అక్కడే కన్నుమూత

మానుకోట జిల్లాలో పిడుగుపాటుకు రైతు వెంకన్న బలి

ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే నెలరోజులుగా నిరీక్షణ

వడ్లు, మక్కలు, జొన్నలు కొనకుండా సర్కార్ చెలగాటం

పంట కొనని ప్రభుత్వానికి తోడు వడదెబ్బ, వానదెబ్బ

ప్రాణాలు పణంగా పెట్టి పడిగాపులు పడుతున్న రైతులు

రంగారెడ్డి, మే 3 (నమస్తే తెలంగాణ)/కురవి : ఆరుగాలం కష్టపడి పండించిన పంటను సర్కార్ కొనుగోలు చేయకపోవడం రైతుల ప్రాణాల మీదికి తెచ్చింది. నాలుగు రోజులుగా మండుటెండలో నిరీక్షించి ఓ రైతు వడ దెబ్బతో వడ్లకుప్పపైనే నేలకొరగగా, నెలరోజులకు ప్రారంభమైన సెంటర్‌లో కాంటా వేస్తున్న సమయంలో పిడుగుపడి మరో రైతు మృత్యువాత పడ్డాడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్, మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లి > 4వ పేజీలో



కొర్రీలతో ధాన్యం కొనుగోలుకు నిరాకరిస్తున్న అధికారుల తీరును నిరసిస్తూ సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిరలో ఆందోళన చేస్తున్న రైతులు

సన్నాలు ఇక ఎనిమిది రకాలే!

జాబితా నుంచి 29 రకాల సన్నాలు ఔట్?

ఇకనుంచి 8 రకాల సన్నాలే సాగుచేయాల్నట

ధాన్యం రకాల కుదింపునకు సర్కార్ కుట్రలు

గతంలో 37 రకాల ధాన్యం జాబితా విడుదల

తాజాగా 8 రకాలేనని మంత్రి తుమ్మల వెల్లడి

మిగతావాటికి బోనస్ ఇస్తరా? ఎగవేస్తరా?

రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొరవడిన స్పష్టత

బోనస్ భారం తప్పించుకునేందుకే నిర్ణయం

సర్కార్ తీరుపై రైతుల్లో అనుమానాలు > 5

చీకటి జీవోను వెనక్కి తీసుకోవాలి



ఆరేండ్ల క్రితం కేటీఆర్ చేసిన సాయంతో బ్రెయిన్ ట్యూమర్ నుంచి కోలుకొన్న చిన్నారి.. ఇటీవల పదోతరగతి పాసైంది. ఈ సందర్భంగా ఆదివారం కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన శరణ్య

ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు సర్కార్ కుట్ర

ఇది 14 లక్షల మంది విద్యార్థులకు వెన్నుపోటు

కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర విద్యావ్యవస్థ ధ్వంసం

ప్రశ్నార్థకంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ బిడ్డల భవిష్యత్తు

కేసీఆర్ స్కీమ్‌లే కాదు.. వైఎస్ పథకాలకూ పాతర

ఫీజు బకాయిలపై విద్యార్థులతో కలిసి పోరాడుతం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేటీఆర్ ఘాటు లేఖ

"మీ కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన జీవో 7 ముమ్మాటికీ ఫీజుల పథకానికి పాతరేసేందుకు చేస్తున్న కుటిల ఎత్తుగడ అని తెలంగాణ సమాజానికి అర్థమైపోయింది. ఈ ఉత్తర్వులు వచ్చినప్పటి నుంచీ లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కంటిమీద కునుకు కరువైంది. పిల్లల ఉజ్వల భవిష్యత్తుపై వారి తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలపై కాంగ్రెస్ సర్కార్ నీళ్లు చల్లింది. -కేటీఆర్

> 2

యువత కలలపై కాంగ్రెస్ కాటు!

సర్కార్ రీయింబర్స్‌మెంట్ షరతులతో తిరోగమనమే..

నూతన సాంకేతిక విద్యకు బలహీనవర్గాలు మళ్లీ దూరం

సంప్రదాయ కోర్సులకే పరిమితమయ్యే ప్రమాదం

ఫీజులు కట్టలేక ఆశయాలతో రాజీ పడాల్సిన దైన్యం > 2

జీవో-7ను తక్షణమే ఉపసంహరించుకోవాలి: రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు

బడుగులపై సర్కార్ కుట్ర: కేయూ మాజీ వీసీ రమేశ్‌బాబు



కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీ స్టోర్‌లో సిబ్బందిని బెదిరిస్తున్న దుండగులు (సీసీ కెమెరా దృశ్యం)

నగల దుకాణంలో పట్టపగలే లూటీ

కరీంనగర్ పీఎంజే జ్యువెల్లర్స్‌లో దొంగల బీభత్సం

సిబ్బందిపై కాల్పులు.. నలుగురికి తీవ్ర గాయాలు

కేంద్ర మంత్రి ఆఫీసుకు కూతవేటు దూరంలో ఘటన

ఉదయం 11 గంటలకే దోపిడీ.. 12 నిమిషాల్లో పూర్తి

సిబ్బంది చేతులు కట్టేసి.. మోకాళ్లపై కూర్చోబెట్టి..

మాస్కులు లేకుండానే దర్జాగా పనికానిచ్చేసిన ముఠా

తుపాకులతో బెదిరించి నగల మూటలతో పరార్

కాంగ్రెస్ పాలనలో శాంతిభద్రతలు చట్టుబండలు > 3

రాష్ట్రంలో యథేచ్ఛగా దోపిడీ ముఠాల స్వైరవిహారం

రెండున్నరేండ్లలో ఆరుచోట్ల భారీ చోరీ ఘటనలు

కరీంనగర్‌లో కేంద్ర హోంమంత్రి నివాసానికి కూతవేటు దూరం! పోలీసుల నాకాబందీ జరిగి 24 గంటలైనా కాలేదు! జనసంచారం ఎక్కువగా ఉండే రహదారి! అయినా దోపిడీ ముఠా దేన్నీ లెక్కచేయలేదు. మాస్కులు లేకుండానే వచ్చి, కాల్పులు జరుపుతూ నగల దుకాణాన్ని లూటీచేసింది. 12 నిమిషాల్లోనే పని ముగించుకొని దర్జాగా వెళ్లిపోయింది.

ప్రజల భద్రతపై ఎందుకింత నిర్లక్ష్యం?



దొంగలు సవాల్ విసురుతుంటే పోలీసులు ఏం చేస్తున్నట్టు?

నాకాబందీ చేపట్టినా.. ఆయుధాలెలా వచ్చాయి?:గంగుల

సీఎం, బండి సంజయ్ రాజీనామా చేయాలి: కౌశిక్‌రెడ్డి > 3

ఓటరు తీర్పు నేడే!

4 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతం ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ > 7

లేట్‌గా వస్తే సీఎల్ కట్



పాఠశాల విద్యాశాఖలో కొత్త నిబంధన

తొలుత డైరెక్టరేట్ ఉద్యోగులకు వర్తింపు

ఉదయం 10.40 గంటల వరకే ఎంట్రీ

ఆ తర్వాత వస్తే సెలవు కింద పరిగణన

ముందుముందు టీచర్లకూ ఇదే వర్తింపు?

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల హాజరు విషయంలో సీరియస్‌గా ఉంటామని పాఠశాల విద్యాశాఖ హెచ్చరించింది. లేట్‌గా వస్తే క్యాజువల్ లీవ్స్, ఆర్జిత సెలవులకు కోత పెడుతామని స్పష్టంచేసింది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ లోని ఉద్యోగులంతా ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ (ఎఫ్‌ఆర్‌ఎస్)ను నమోదుచేయాలని తాజాగా జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నది. నెలవారీ హాజరు లెక్కింపు విషయంలోఎఫ్‌ఆర్‌ఎస్‌ను పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టంచేసింది. ఉద్యోగులకు ఏడాదిలో 15 సాధారణ సెలవులు (సీఎల్స్), 30 ఆర్జిత సెలవులు (ఈఎల్స్) ఉంటాయి. విధులకు ఆలస్యంగా వస్తే ముందుగా > 9వ పేజీలో

సాధించిందేంది? సంబురాలెందుకు?

రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొత్తగా ఏ హామీని పొందారు?

ఉన్నపళంగా ఆందోళన ఎందుకు వాయిదా వేశారు?

ఆర్టీసీ కార్మికుల తరహాలో ఎందుకు ఉద్యమించలేదు?

జేఏసీపై ఉద్యోగుల గుస్సా.. సోషల్ మీడియాలో రచ్చ

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : 'పెండింగ్ డీఏల ఊసే లేదు.. పీఆర్సీపై ఆశే లేదు. సీపీఎస్ రద్దు.. పాత పింఛన్ అమలుపై నిర్దిష్టమైన హామీలు లేవు.. వారం రోజుల్లో ఇస్తామన్న హెల్త్‌కార్డులు జూన్ 1న ఇస్తామంటున్నారు.. ఇంతకు ఏం సాధించారు? కొత్తగా > 8వ పేజీలో

క్రిశాంక్‌కు నేడు కేటీఆర్ పరామర్శ

హైదరాబాద్, మే 3 (నమస్తేతెలంగాణ)/కరీంనగర్ కార్పొరేషన్: అక్రమ కేసులో అరెస్ట్‌పై సంగారెడ్డి జైలులో ఉన్న కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను సోమవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించనున్నారు. ఆయన యోగక్షేమాలు తెలుసుకున్న తర్వాత అక్కడే మీడియాతో మాట్లాడుతారు. అనంతరం కరీంనగర్ పీఎంజే నగల షాపు దోపిడీ ఘటనలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తారని బీఆర్ఎస్ కరీంనగర్ అధ్యక్షుడు చల్లా హరిశంకర్ తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయానికి కేటీఆర్ చేరుకుంటారని, అనంతరం 3 గంటలకు బాధితులను పరామర్శిస్తారని, 3.30 గంటలకు పీఎంజే నగలషాపును పరిశీలిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతారని తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేతకు కుట్ర

ఏఐఎస్ఎఫ్ నేతలు కసిరెడ్డి లక్ష్మణ్

హైదరాబాద్, మే 3 (నమస్తేతెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎత్తివేతకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఆదివారం వారు మీడియాతో మాట్లాడారు. పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఫీజు పథకంపై, స్కాలర్‌షిప్ బకాయిలపై ప్రభుత్వం పూటకో తీరుగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఫీజు బకాయిలను సర్కార్ ఎప్పుడు విడుదల చేస్తుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జీవో 7 ద్వారా డీబీటీ పద్ధతిలో విద్యార్థుల ఖాతాల్లో ఫీజును ఏఏ విడతల్లో విడుదల చేస్తుందో చెప్పాలని కోరారు. కళాశాలలకు ఫీజులను సకాలంలో వేయని సర్కార్.. విద్యార్థుల ఖాతాల్లో వేస్తుందన్న నమ్మకం లేదని తెలిపారు.

చీకటి జీవో 7ను వెనక్కి తీసుకోవాలి

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రద్దుకు కుట్ర
- 14 లక్షల మంది విద్యార్థులకు వెన్నుపోటు

రేవంత్ పాలనలో విద్యావ్యవస్థ విధ్వంసం

బీసీ, ఎస్సీ, ఎస్టీ బిడ్డల భవిష్యత్తు ప్రశ్నార్థకం

- కేసీఆర్ స్కీమ్‌లే కాదు..వైఎస్ పథకాలకూ పాతర
- రూ.10 వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాలి
- లేదంటే విద్యార్థులతో కలిసి బీఆర్ఎస్ పోరాటం
- విద్యార్థిలోకం గర్జిస్తే రోడ్లపై తిరుగలేరు
- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ ఘాటు లేఖ

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ జీవో 7ను జారీ చేసి 14 లక్షల మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు వెన్నుపోటు పొడిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రెండున్నరేండ్ల రేవంత్ అసమర్థ పాలన.. విద్యావ్యవస్థను కుప్పకూల్చడమే గాక, ఇప్పుడు నిరుపేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే కుటిల యత్నాలకు తెరలేపిందని విరుచుకుపడ్డారు. ఇందులో భాగంగా కొన్నేండ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు కొండంత అండగా నిలుస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీమ్‌ను రద్దుచేసేందుకు రేవంత్ ప్రభుత్వం భయంకరమైన కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దని, జీవోను వెనక్కి తీసుకొని వెంటనే విద్యార్థిలోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

> ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ సీఎం వైఎస్సార్ సదుద్దేశంతో అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రాజకీయాలకతీతంగా తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ కొనసాగించారు. కరోనా కాలంలోనూ నిరంతరాయంగా నిధులు విడుదల చేసిన ఘనత ఆయనకే దక్కింది. కానీ రేవంత్ గద్దె నెక్కిన వెంటనే ఈ బృహత్తర పథకానికి గ్రహణం పట్టింది. సొంత పార్టీ ప్రభుత్వం తెచ్చిన స్కీమ్‌కే తూట్లు పొడుస్తున్నవ్.. సిగ్గనిపిస్తలేదా?
>
> -కేటీఆర్

సొంత పార్టీ పథకానికే తూట్లు

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ సీఎం వైఎస్సార్ సదుద్దేశంతో అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రాజకీయాలకతీతంగా తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ కొనసాగించారని కేటీఆర్ గుర్తుచేశారు. విద్యార్థుల ఉన్నత చదువులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారని చెప్పారు. కరోనా కాలంలోనూ నిరంతరాయంగా నిధులు విడుదల చేసిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. కానీ రేవంత్ గద్దెనెక్కిన వెంటనే ఈ బృహత్తర పథకానికి గ్రహణం పట్టిందని దుమ్మెత్తిపోశారు. ఈ చేతగాని సర్కార్ సొంత పార్టీ ప్రభుత్వం తీసుకొచ్చిన స్కీమ్‌కే తూట్లు పొడుస్తున్నదని దుయ్యబట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు ఘోరీ కట్టిన కాంగ్రెస్, జీవో 7 ద్వారా ఫీజుల పథకాన్ని సమాధి చేసేందుకు కంకణం కట్టుకున్నదని నిప్పులుచెరిగారు. విద్యకోసం చేసే ఖర్చును ప్రభుత్వాలు విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టే పెట్టుబడిగా చూడాలి తప్ప, భారంగా భావించి చేతులు దులుపుకోవడం దుర్మార్గమని తూర్పారబట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేస్తే ఎక్కువగా నష్టపోయేది సమాజంలోని అట్టడుగు, బలహీనవర్గాల పిల్లలేనని గుర్తుచేశారు.

టోకెన్లు, కమిటీల పేరిట మభ్యపెట్టారు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ రీయింబర్స్‌మెంట్ స్కీమ్‌పై కత్తిగట్టిందని కేటీఆర్ విమర్శించారు. ఈ పథకం ఆధారంగా నడుస్తున్న రాష్ట్రంలోని 2,500 పైగా ఉన్నత విద్యాసంస్థలకు ఫీజు బకాయిలు చెల్లించకుండా వేధింపులకు గురిచేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరిట కొంతకాలం, ట్రస్ట్, టోకెన్ల ముసుగులో ఇంకొంత కాలం, కమిటీల పేరిట మరికొన్ని రోజులు మభ్యపెట్టిందని మండిపడ్డారు. చీకటి జీవో జారీ చేసి చివరికీ అసలుకే ఎసరు తెచ్చిందని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివాలాకోరు విధానాలను చూసి విద్యార్థి లోకం అసహ్యించుకుంటున్నదని తెలిపారు. పెద్దమొత్తంలో ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో గత్యంతరంలేక కాలేజీలు బంద్‌పెట్టి ఆందోళనకు దిగిన యాజమాన్యాలపై విజిలెన్స్ దాడులు చేసి వేధించారని విమర్శించారు. చివరికి రూ. 1,207 కోట్ల విలువతో ఇచ్చిన టోకెన్లకు నేటికీ దిక్కులేకుండా పోయిందని, వాయిదాల పద్ధతిలో చెల్లించాల్సిన నిధులకు రెండున్నరేండ్లుగా బ్రేకులు వేయడం వెనుక ఉన్న అసలు కుట్ర ఇప్పుడు బట్టబయలైందని ధ్వజమెత్తారు.

ఫీజులు జమచేస్తామంటే నమ్మేదెవరు?

30 నెలలుగా మూడు పైసలు కూడా విడుదల చేయని ప్రభుత్వం, ఇప్పుడు విద్యార్థుల ఖాతాలో నేరుగా ఫీజులు జమచేస్తామని నమ్మబలుకుతూ మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నదని కేటీఆర్ విమర్శించారు. 'అయినా విశ్వసనీయత కోల్పోయిన మీ సర్కార్ చెప్పే బూటకపు మాటలను నమ్మేదెవరు? మీ చేతలకు తెలంగాణ ప్రజాక్షేత్రంలో జీరో వాల్యూ.. 2026-27 విద్యా సంవత్సరానికి తెచ్చిన మార్గదర్శకాలు ఫీజు పథకాన్ని శాశ్వతంగా సమాధి చేసే మరణ శాసనాలుగా కనిపిస్తున్నయ్..ఇలాంటి కొర్రీలతో తమ పిల్లలకు కాలేజీల్లో కనీసం అడ్మిషన్లు దొరుకుతాయా? లేదా? అనే భయం పేద తల్లిదండ్రులను వెంటాడుతున్నది'అంటూ లేఖలో విమర్శనాస్త్రాలు సంధించారు. 'విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజు భారాన్ని మోపి, వారిని అప్పులపాల్జేసే కుట్రలను తెలంగాణ సమాజం సహించబోదు..బీఆర్ఎస్ ఉపేక్షించబోదు' అని హెచ్చరించారు. రూ.10 వేల కోట్ల బకాయిలు విడుదల చేసేదాకా వదలబోమని తేల్చిచెప్పారు.

అప్పులు తెచ్చి ఉద్ధరించిందేంటి?

అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలను గాలికొదిలేసిన చేతగాని సర్కార్ చివరికి ఉన్న పథకాలను ఊడగొట్టడం దుర్మార్గమని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓవైపు 30 నెలల్లో రూ.3.75 లక్షల కోట్ల అప్పులు చేసి మరోవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీమ్‌కు నయాపైసా కూడా విడుదల చేయకపోవడం అన్యాయమని మండిపడ్డారు. 'ఇప్పటివరకు ఒక్క ఇటుక పేర్చలేదు..ఒక్క గ్యారెంటీ కూడా అమలు చేయలేదు..మరి అప్పులు తెచ్చిన లక్షల కోట్లు ఎటు పోతున్నట్టో? ఎవరి జేబుల్లోకి వెళ్తున్నట్లో తెలంగాణ సమాజానికి సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు. 'ఇంత అసమర్థ ప్రభుత్వాన్ని ప్రజలు చరిత్రలో ఏనాడూ చూడలేదు. రైతుబంధు, రుణమాఫీ పథకాలను ఎగ్గొట్టేందుకు పూటకో అడ్డదారులు తొక్కినట్టే, యూరియా సంక్షోభం నుంచి తప్పించుకొనేందుకు యాప్ పేరిట నయా నాటకానికి తెరతీసినట్టే..ఫీజుల స్కీమ్‌కు మంగళం పాడేందుకు రేవంత్ సర్కార్ రకరకాల దొడ్డిదారులు తొక్కుతూ పేద విద్యార్థులను దగా చేస్తున్నది' అని విరుచుకుపడ్డారు. 'ఇప్పటికే మీ దద్దమ్మ పాలనలో సకల సంక్షోభాలు చుట్టుముట్టి ఆర్థికంగా చితికిపోతున్న పేద కుటుంబాలు తమ పిల్లల ఫీజుల భారాన్ని ఎలా మోస్తాయి? ఫీజుల పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు చీకటి జీవో ముసుగులో ఇంతటి నీచానికి ఒడిగట్టిన మీరు శాశ్వతంగా విద్యార్థులు, తల్లిదండ్రుల దృష్టిలో ద్రోహులుగానే మిగిలిపోతారు' అని లేఖలో ప్రస్తావించారు.

దండుకట్టి సమర శంఖం పూరిస్తాం

ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఫీజు పథకానికి ఉరిపెట్టే ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 'అప్పటివరకు మీ సర్కార్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదు' అని స్పష్టంచేశారు. 'రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలో ఉన్న 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులతో దండుకట్టి ద్రోహం చేసిన కాంగ్రెస్ సర్కార్‌పై సమరశంఖం పూరిస్తాం. ఇప్పటికే అన్నదాతల ఆందోళనలతో అట్టుడుకుతున్న తెలంగాణలో దగాపడ్డా విద్యార్థులు గర్జిస్తే మీరు, మీ మంత్రులు రోడ్లపై తిరుగలేరనే విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని హెచ్చరించారు.

కుప్పకూలిన గురుకుల వ్యవస్థ

రెండున్నరేండ్లుగా రేవంత్ ప్రభుత్వం అనుసరిస్తున్న అస్తవ్యస్త విధానాలతో గురుకుల వ్యవస్థ కుప్పకూలిందని కేటీఆర్ వాపోయారు. సర్కార్ దుర్మార్గపు చర్యలతో 142 మంది చందమామల్లాంటి పిల్లలు తనువు చాలించారని ఆవేదన వ్యక్తంచేశారు. కనీసం నాణ్యమైన భోజనం పెట్టించలేని దయనీయ పరిస్థితుల్లో ఇప్పటికీ వేలాదిమంది విద్యార్థులు దవాఖానల పాలవుతున్నారని, రాష్ట్రంలో నిత్యం ఏదో ఒకచోట కల్తీ ఆహార ఘటనలు కలచివేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.



నందినగర్‌లోని నివాసంలో భావోద్వేగానికి గురైన శరణ్యను ఓదార్చుతున్న కేటీఆర్

కేటీఆర్ ఆపన్నహస్తం.. శరణ్యకు కొత్త జీవితం

- ఆరేండ్ల కింద చేసిన సాయాన్ని మరువని బాలిక
- 'పది'లో పాసై కేటీఆర్‌ను కలిసి భావోద్వేగం
- 'గాడ్ బ్లెస్‌యూ' అంటూ రామన్న దీవెనలు

హైదరాబాద్, మే 3 (నమస్తేతెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరేండ్ల క్రితం అందించిన ఆపన్న హస్తం.. శరణ్య జీవితంలో కొత్త వెలుగులు నింపింది.. బ్రెయిన్ ట్యూమర్‌తో ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న బాలిక కేటీఆర్ అండతో బతికి బయటపడింది. క్లిష్ట పరిస్థితుల నుంచి గట్టెక్కిన నాటి చిన్నారి ఇటీవల పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. నాడు సాయం చేసిన కేటీఆర్‌ను హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలో కలిసి భావోద్వేగానికి గురైంది.. ఉబికి వస్తున్న కన్నీళ్లను దిగమింగకుంటూ మనసున్న మారాజుకు మనసారా కృతజ్ఞతలు తెలిపింది. కేటీఆర్ ఆమెను దగ్గరకు తీసుకొని 'గాడ్ బ్లెస్‌యూ శరణ్య'అంటూ అభినందించడంతో మురిసిపోయింది. హైదరాబాద్‌లోని ప్యారడైజ్ బాలంరాయికి చెందిన కే నారాయణ, రాజేశ్వరి దంపతుల కుమార్తె శరణ్య 2019 లో బ్రెయిన్ ట్యూమర్ బారినపడ్డది. తమ బిడ్డ దయనీయస్థితిని చూసి తల్లిదండ్రులు కలతచెందారు..ప్రైవేట్ ఉద్యోగులైన వీరు ఆర్థిక శక్తిమేరకు పలు దవాఖానల్లో చికిత్స చేయించారు. అయితే శరణ్య ప్రాణాలకు ముప్పు ఉన్నదని చికిత్సకు రూ. 20 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. ఆరోగ్యశ్రీలో చిన్నారి పేరులేకపోవడంతో హైదరాబాద్ బసవతారకం హాస్పిటల్‌లో చేర్పించేందుకు వారం పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ట్వీట్‌కు చలించి..చికిత్సకు అభయమిచ్చి..

శరణ్య ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో ఆమె చిన్నమ్మ పూజిత ఎక్స్ వేదికగా ఆదుకోవాలని కేటీఆర్‌కు విజ్ఞప్తిచేశారు. వారి విజ్ఞప్తికి ఆయన చలించిపోయారు. అరగంటలోనే తన బృందాన్ని రంగంలోకి దింపారు. ట్వీట్ చేసిన రోజు ఆదివారం సెలవుదినమైనప్పటికీ కేటీఆర్ ఆదేశాలతో కలెక్టర్ కార్యాలయ సిబ్బంది హుటాహుటిన దవాఖానలో చేర్పించారు. శరణ్యకు వైద్యులు స్టంట్ వేయడంతో పాటు మేజర్ సర్జరీ నిర్వహించారు. అలాగే రూ. 3లక్షల ఖరీదైన రేడియేషన్ థెరపీని స్వయంగా పర్యవేక్షించి చేయించారు. సర్జరీ నుంచి డిశ్చార్జి వరకు ఆర్థికంగా అండగా నిలిచారు. మొత్తంగా రూ. 20 లక్షల విలువైన చికిత్సను నయాపైసా ఖర్చులేకుండా అందించారు. ఆదివారం కేటీఆర్‌ను కలిసిన సందర్భంగానే తాము దవాఖానలో ఒక్క రూపాయి ఖర్చుపెట్టలేదని శరణ్య తల్లి భావోద్వేగంతో చెప్పారు.

నాటి సాయం మరువం

ప్రాణాపాయస్థితి నుంచి గట్టెక్కిన శరణ్య చదువును కొనసాగించింది. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 384 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. పాసైన సంతోషాన్ని తనకు సాయం చేసిన కేటీఆర్‌తో కలిసి పంచుకోవాలని తలచింది. ఈ క్రమంలో ఆదివారం తన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో కలిసి నందినగర్‌లోని నివాసంలో ఆయనను కలిసింది.



హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పక్కన మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

'ఫీజు' పథకం ఎత్తివేసేందుకు కుట్ర

- విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో సర్కార్ చెలగాటం
- జీవో -7ను వెంటనే ఉపసంహరించుకోవాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హనుమకొండ, మే 3 : ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రపనున్నతున్నదని, అందులో భాగంగానే జీవో 7 తీసుకొచ్చిందని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి మాట్లాడారు. మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్‌లు ఇవ్వకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్నదని మండిపడ్డారు. ఈ నెల 6న వరంగల్ వేదికగా జరుగుతున్న రైతు సంగ్రామ సదస్సు తర్వాత కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లాంటి మిగతా డిక్లరేషన్లపై పోరాడుతామని చెప్పారు. రూ. 13వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలున్నాయని, ప్రభుత్వం విద్యార్థుల నుంచే ఫీజులు వసూలు చేసుకోమని చెప్తూ దాన్ని ఎత్తివేసే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. ఫీజుల వసూలు కోసం తెచ్చిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తంచేస్తున్న వేముల రామకృష్ణ, తదితరులు

సీఎం ఇంటిని ముట్టడిస్తాం

- ఫీజుల భారం మోపొద్దు
- జీవో7ను రద్దు చేయాలి
- విద్యార్థి జేఏసీ డిమాండ్

హైదరాబాద్, మే3 (నమస్తే తెలంగాణ): విద్యార్థులపై ఫీజుల భారంమోపే జీవో 7ను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే త్వరలో సీఎం నివాసాన్ని ముట్టడిస్తామని తెలంగాణ విద్యార్థి జేఏసీ హెచ్చరించింది. జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ నేతృత్వంలో విద్యార్థులు జీవో 7 ప్రతులను చేతబట్టుకొని మోకాళ్లపై నిల్చొని వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేముల రామకృష్ణ మాట్లాడారు. ఫీజులను తాము కట్టలేమని, ఆ భారం తమపై మోపొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు అశోక్, బాలకృష్ణ, చరణ్, ఓంకార్, ప్రవీణ్, అమన్, నవీన్ పాల్గొన్నారు.

యువత కలలపై కాంగ్రెస్ కాటు!

- రేవంత్ సర్కార్ నూతన షరతులతో తిరోగమనంలో తెలంగాణ యువత
- 'ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఉసురుతీస్తున్న నేటి ప్రభుత్వం
- సాంకేతిక విద్యకు బడుగులు దూరం
- జీవో 7 ఉపసంహరించుకోవాలి: బీసీ నేత చిరంజీవులు డిమాండ్
- బడుగులపై కుట్ర:మాజీ వీసీ రమేశ్





హైదరాబాద్, మే3 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో రేవంత్ సర్కార్ తీసుకొచ్చిన నూతన మార్పులు తెలంగాణ యువత కలలను కల్లలు చేయనున్నాయి. నూతన సాంకేతిక విద్యావకాశాలకు బడుగు విద్యార్థులను దూరం చేయనున్నాయి. సంప్రదాయ కోర్సులకే వారు మళ్లీ పరిమితం కానున్నారు. ఈనాటి నిరుపేద విద్యార్థులు కూడా మళ్లీ దశాబ్దన్నర క్రితం నాటి దుర్భర పరిస్థితులను అనుభవించనున్నారు. విద్యా అసమానతలు పెరుగనున్నాయి. సూటిగా చెప్పాలంటే పురోగమన మార్గం నుంచి తిరోగమనం వైపునకు ఈనాటి యువతను నడిపించే పరిస్థితులే కనిపిస్తున్నాయి. తెలంగాణ విద్యావేత్తల్లో సర్వత్రా ఇవే భయాందోళనలు నెలకొన్నాయి. నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో వేసిన పునాదులపై కేసీఆర్ ఆశల సౌధాలను నిర్మిస్తే.. నేడు రేవంత్ సర్కార్ అందుకు భిన్నంగా ఉన్న ఆయువునే తీసే చర్యలకు పూనుకొన్నదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 7 ద్వారా డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిని ప్రవేశపెట్టాలని నిర్ణయించడంతో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు తీరని నష్టం చేకూరనున్నది. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధన వల్ల ఉన్నత విద్యావకాశాలు ఇకపై కొన్ని పట్టణాలకే పరిమితమయ్యే అవకాశమున్నది. ఫీజుల భారాన్ని భరించలేక బడుగు విద్యార్థులు కాలేజీల్లో చేరకుంటే సీట్లు నిండక ప్రస్తుతమున్న అరకొర కాలేజీలను సైతం ప్రైవేట్ యాజమాన్యాలు ఎత్తివేయక తప్పని పరిస్థితులు ఎదురవనున్నాయి. గ్రామీణ విద్యార్థులు, తల్లిదండ్రులపై అదనపు భారం కూడా పడనున్నది. అంతిమంగా ఉన్నత విద్య మళ్లీ మిథ్యగానే మిగిలిపోయే పరిస్థితులు దాపురించనున్నాయి.

వైఎస్సార్ నాంది.. వన్నెతెచ్చిన కేసీఆర్

ఉమ్మడి రాష్ట్రంలో 2008-09 విద్యాసంవత్సరంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకంలో బడుగు బలహీన వర్గాలకు ఉన్నత, సాంకేతిక విద్య చేరువైంది. ఇది సామాజిక విప్లవానికి నాంది పలికింది. ఫీజులేని కారణంగా ఏ నిరుపేద విద్యార్థి కూడా ఉన్నతవిద్యకు దూరం కాని పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో చదివే నిరుపేద విద్యార్థులకు సంబంధించి ఫీజులను ప్రభుత్వమే చెల్లించడం ప్రారంభమైంది. సంప్రదాయ కోర్సుల నుంచి బడుగు బలహీనవర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులు అనేక అధునాతన కోర్సుల వైపు మళ్లారు. అభిరుచులకు తగిన కోర్సులను ఎంచుకుని ఆయా రంగాల్లో స్థిరపడ్డారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ విశాల దృక్పథంతో ఇదే పథకాన్ని ఎలాంటి మార్పులు చేయకుండా యథాతథంగా కొనసాగించారు. ఈ పథకానికి వన్నె తెచ్చేలా, మరింత మంది బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు లబ్ధి పొందే ప్రణాళికలను అమలు చేశారు. ఉన్నత విద్యావకాశాలను పొందేందుకు ఊతమిచ్చారు. 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు, పీజీతోపాటు మెడిసిన్, ఇంజినీరింగ్ తదితర కోర్సులను లక్షలాది మంది పూర్తిచేసేందుకు అవకాశం కల్పించారు. విదేశాల్లో ఉన్నత చదువులు చదవాలనే అభిలాష కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదల కోసం విదేశీ విద్యానిధి పథకాన్ని కూడా కేసీఆర్ ప్రారంభించారు. రూ.20 లక్షల చొప్పున ఆర్థికసాయాన్ని అందించి బడుగుల విదేశీ విద్యకు ప్రోత్సహించారు.

యువత ఆశలపై సర్కార్ నీళ్లు

దశాబ్దకాలంలోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఊహించని రీతిలో విస్తృతి చెందింది. ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికత పెను విప్లవాన్ని సృష్టిస్తున్నది. సమస్త రంగాల గతిని మార్చివేస్తున్నది. నూతన ఉద్యోగాల సృష్టికి, విస్తృత ఉపాధి రంగాల వికాసానికి దోహదపడుతున్నది. అందుకు అనుగుణంగానే ప్రస్తుతం ఎన్నో అధునాతన, సాంకేతిక కోర్సులు ఆవిష్కృతం అవుతున్నాయి. ఆయా కోర్సులతో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి. ఈ నేపథ్యంలో అటువైపు యువత పరుగులు పెడుతున్న దశలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం రూపురేఖలు మార్చేందుకు కాంగ్రెస్ సర్కార్ పూనుకున్నది. సర్కార్ చర్యలతో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఫీజుల భారం పడనున్నది. ఆ అధునాతన విద్యకు నిరుపేద విద్యార్థులను దూరం చేసేందుకే ఈ చర్యల సారాంశం అని ఆందోళన వ్యక్తమవుతున్నది. ఫీజులు చెల్లించలేని బడుగు యువత అవకాశాలు కోల్పోవాల్సి వస్తుంది. వారి కలలు కల్లలుగానే మిగిలిపోవాల్సిన పరిస్థితులు దాపురించనున్నాయి. అభిరుచులను కాదని, ఆర్థిక పరిస్థితులను అనుసరించి మళ్లీ సంప్రదాయ కోర్సులకే బడుగు బలహీనవర్గాల విద్యార్థులు పరిమితం కావాల్సి వస్తున్నది. ఇది మళ్లీ విద్యా అసమానతలకు దారితీయడమే గాక, మున్ముందు ఆయా రంగాల్లో మానవ వనరుల కొరతకూ ముప్పు తెచ్చిపెట్టే ప్రమాదం ఉన్నది.

పథకం ఉసురు తీస్తున్న రేవంత్‌రెడ్డి

విశాల దృక్పథంతో కొనసాగుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నేడు రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్వీర్యం చేస్తున్నది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ఫీజు బకాయిల చెల్లింపులను నిలిపేసింది. కాలేజీలను నిర్వహించలేని దుస్థితి నెలకొన్నదని యాజమాన్యాలు ఒకవైపు, ఫీజుల బకాయిలను సాకుగా చూపుతూ సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని విద్యార్థులు మరోవైపు రోదిస్తున్నా సర్కార్ నుంచి కనీస స్పందన కూడా కరువైంది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అంటూ కొంతకాలం, ట్రస్ట్ ఏర్పాటుచేసి బకాయిలు చెల్లిస్తామని మరికొంతకాలం వెళ్లదీసింది. సీఎం రేవంత్‌రెడ్డి హామీలకే దిక్కులేని దుస్థితి నెలకొన్నది. ఆందోళనలు చేసినా కాంగ్రెస్ సర్కార్‌లో చలనం లేకుండాపోయింది. బకాయిలు చెల్లించాల్సింది పోయి ఇప్పుడు ఏకంగా ఫీజుల చెల్లింపు బాధ్యత నుంచి తప్పుకొనేందుకు సిద్ధమైంది. జీవో7 ద్వారా నూతన మార్గదర్శకాలు జారీ చేస్తూ మరణశాసనం రాసేందుకు రేవంత్ సర్కార్ పూనుకున్నది. కాలేజీలకు కాకుండా నేరుగా విద్యార్థులకే ఫీజులు చెల్లిస్తామని చెప్తున్నా నిర్దిష్ట గడువును వెల్లడించకపోవడంతో అంతిమంగా అది పథకం నిర్వీర్యానికే కుట్ర జరుగుతుందనేది స్పష్టంగా తెలిసిపోతున్నది.

జీవో 7ను తక్షణమే రద్దు చేయాలి



కాంగ్రెస్ సర్కార్ తాజాగా తెచ్చిన జీవో 7ను తక్షణమే రద్దు చేయాలి. ఈ జీవో నిరుపేద విద్యార్థులపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు ముందుగా ఫీజు చెల్లించలేని పరిస్థితుల్లో ఉంటారు. వారు అప్పు చేసి ఫీజు చెల్లించినా, ఆ అప్పును వడ్డీతో కలిసి తిరిగి చెల్లించడానికి ప్రభుత్వం ఇచ్చే రీయింబర్స్‌మెంట్ సరిపోదు. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ డబ్బులు విద్యార్థులకు ఎప్పుడు విడుదల చేస్తుందో తెలియదు. మూడు, నాలుగేండ్లకోసారి రిలీజ్ చేస్తే ఇక ఆ సొమ్ము అప్పుపై వడ్డీకి చాలదు. చాలామంది విద్యార్థులు అడ్వాన్స్‌గా ఫీజు చెల్లించలేక అడ్మిషన్లు కోల్పోతారు. ఈ విధానం వల్ల పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతారు.

- చిరంజీవులు, విశ్రాంత ఐఏఎస్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్

నిరుపేదలకు చదువును దూరం చేసే కుట్ర



నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బిడ్డల ఉన్నత విద్యావకాశాలపై నీళ్లు జల్లే కుట్రలకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకున్నది. ఆర్థికంగానే కాదు.. సామాజిక కోణంలోనూ ఆలోచించి నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చారు. రాజకీయ విభేదాలు చూపకుండా మాజీ సీఎం కేసీఆర్ యథాతథంగా ఆ పథకాన్ని అమలు చేయడమే కాక, దానిని విస్తృతం చేసి లక్షలాది మంది విద్యార్థులకు వర్తింపజేశారు. గురుకులాలు, విదేశీ విద్యానిధి పథకాల ద్వారా బడుగులకు ఉన్నత చదువును మరింత చేరువచేసేలా బాటలు వేశారు. కానీ ఈనాటి రేవంత్‌రెడ్డి సర్కార్ ఆ పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యలు చేపట్టింది. విద్యా కమిషన్ సిఫార్సులకు అనుగుణంగానే జీవో 7ను తీసుకువచ్చినట్టు అర్థమవుతున్నది.

-ప్రొఫెసర్ రమేశ్‌బాబు, కాకతీయ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్

హరీశ్‌రావుపై ఐలయ్య విమర్శలా?

- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ ధ్వజం

హైదరాబాద్, మే 3 (నమస్తేతెలంగాణ): 'రైతుల భూములు గుంజుకొని వెంచర్లు వేసి అవినీతికి పాల్పడుతున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావును విమర్శించే నైతిక హక్కు ఎక్కడిది? పొద్దున లేస్తే భూదందాలు నడిపే ఐలయ్య తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యమనేత హరీశ్‌రావుపై అభాండాలు వేయడం దుర్మార్గం' అని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ నిప్పులు చెరిగారు. హరీశ్‌రావుపై బీర్ల ఐలయ్య చేసిన విమర్శలపై ఆదివారం ఒక ప్రకటనలో ఘాటుగా స్పందించారు. ఆలేరులో ఐలయ్య అవినీతి వ్యవహారాల గురించి ఎవరిని అడిగినా చెప్తారని, ఐలయ్య బాధితుల సంఘాలు ఏర్పడ్డాయంటేనే ఆయన అరాచకాలు ఏమిటో అర్థమవుతున్నాయని పేర్కొన్నారు. ఐలయ్య మతిస్థిమితం కోల్పోయి అడ్డంపొడుగు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

రేవంత్ పాలనలో రోడ్డునపడ్డ అన్నదాత

కేసీఆర్ హయాంలో వేళకు రైతుబంధు అందడం, సజావుగా పంటల కొనుగోలు చేయడంతో దర్జాగా బతికిన రైతన్నలు.. కాంగ్రెస్ పాలనలో రోడ్డున పడ్డారని గాదరి కిశోర్ ధ్వజమెత్తారు. ధాన్యం కొనుగోళ్లపై సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల మంత్రికి సోయిలేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు, దిక్కుతోచని స్థితిలో రోడ్డెక్కి ధర్నాలు చేస్తుంటే కాంగ్రెస్ సర్కార్‌కు చీమకుట్టినట్టయినా లేకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కాంగ్రెస్ గద్దెనెక్కినప్పటి నుంచి రైతులను యూరియా కోసం క్యూలో నిలబెడుతున్నారని ఆరోపించారు. హరీశ్‌రావు నిలదీస్తేగానీ సర్కార్ కండ్లు తెరువలేదని తెలిపారు.

బజారు రౌడీలా బీర్ల మాటలు: గోసుల శ్రీనివాస్

అవినీతి కూపంలో కూరుకుపోయిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఫ్రస్టేషన్‌లో బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుపై బజారు రౌడీలాగా మాట్లాడారని బీఆర్ఎస్ రాష్ట్ర నేత గోసుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో విమర్శించారు. భూదందాలు చేసే ఐలయ్యకు హరీశ్‌రావు గురించి మాట్లాడే నైతికహక్కు ఎక్కడిదని నిలదీశారు. ఉద్యమనేత హరీశావుపై నోరు పారేసుకోవడం అంటే సూర్యుడిపై ఉమ్మేసిన చందమేనని మండిపడ్డారు.



మున్నూరుకాపు టవర్స్ నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎంపీ రవిచంద్ర తదితరులు

మున్నూరుకాపులు ఐక్యతతో సాగాలి

- రాజ్యాధికారంలో సముచిత వాటానే ధ్యేయం
- బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): రాజ్యాధికారంలో సముచిత వాటా, న్యాయమైన హక్కుల సాధనకు మున్నూరుకాపులందరూ ఐక్యతతో సాగాలని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. బీసీ కులాల ఆత్మగౌరవ భవన నిర్మాణాలకు హైదరాబాద్ కోకాపేటలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మున్నూరుకాపు భవన నిర్మాణానికి ఐదెకరాలను కేటాయించారు. ఆ స్థలంలో మున్నూరుకాపు ఆత్మగౌరవ భవన (మున్నూరు కాపు టవర్స్) నిర్మాణ పనులకు ఆదివారం భూమి పూజ చేశారు. మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తమరావు నేతృత్వంలో కొనసాగిన పూజా కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. మున్నూరుకాపులు పట్వారీలు, పోలీస్ పటేల్స్, మాలీపటేల్స్‌గా సమాజానికి విశేష సేవలందించారని వివరించారు. ఆత్మగౌరవ భవన టవర్స్‌కు భూరి విరాళాలు అందజేయాలని దేశ, విదేశాల్లోని కులబాంధవులకు విజ్ఞప్తి చేశారు. ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సంఘ ప్రముఖులు గాలి అనిల్‌కుమార్, తూడి ప్రవీణ్ రూ.కోటి చొప్పున విరాళం ప్రకటించారు. బిల్డర్ పోతురెడ్డి రమేశ్ బాబు, ఆయన కుమారుడు సందీప్, సంఘ ప్రముఖులు సల్ల కృష్ణ, ఆకుల సత్యనారాయణ, మిరియాల రాఘవరావును ఎంపీ సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది, కోశాధికారి కంచి, కనకయ్య, రమేశ్ , మల్లేశ్, లక్ష్మణ్, విష్ణువర్ధన్, పెంటయ్య, సత్యనారాయణ, పద్మక్క, పటేల్, లవంగాల అనిల్, ఊసా రఘు, బేతి శ్రీధర్ పాల్గొన్నారు.

వరంగల్ రైతు డిక్లరేషన్ దగా

అన్నదాతలను మోసం చేసిన రేవంత్ సర్కార్

- బీఆర్‌ఎస్ రైతు సదస్సుకు పోటీగా కాంగ్రెస్ మేళా
- ప్రజలను డైవర్ట్ చేసే కుట్ర: దాస్యం
- కాంగ్రెస్‌లో భయం: రాజయ్య
- డిక్లరేషన్‌పేరుతో చీటింగ్:రమేశ్



హనుమకొండ హంటర్‌రోడ్డులో వేదిక వద్ద రైతు సంగ్రామ సదస్సు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, అరూరి రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు

హనుమకొండ, మే 3 : వరంగల్ వేదికగా 2022 మే 6న కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ చేసిన రైతు డిక్లరేషన్ పచ్చి మోసమని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులో ఈ నెల 6న నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సు వేదిక వద్ద ఆదివారం మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి రైతు సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ.. అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులకు మోసగించిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు గడిచినా 420 హామీలు, 6 గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. రైతు పక్షపాతి కేసీఆర్ రాష్ట్ర ఏర్పాటు అనంతరం వ్యవసాయన్ని పండుగ చేసి దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలిపారని కొనియాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు వేదికలు నిరుపయోగం మారాయని అన్నారు. 'కేసీఆర్ రూ.10వేల రైతు భరోసా ఇస్తున్నారు.. మేము అధికారంలోకి వస్తే రూ. 15వేలు ఇస్తాం' అని చెప్పిన రేవంత్‌రెడ్డి మూడుసార్లు ఎగ్గొట్టాడని దుయ్యబట్టారు. బోనస్ పక్కనపెడితే పండిన పంటను కొనుగోలు చేసే పరిస్థితిలో కాంగ్రెస్ సర్కార్ లేదని ధ్వజమెత్తారు. రెండున్నరేండ్లలో తెలంగాణలో విధ్వంసం జరిగిందని అన్నారు. మళ్లీ తెలంగాణ పునఃనిర్మాణం కేసీఆర్‌తోనే సాధ్యమని అన్నారు. సదస్సు నిర్వహిస్తామంటే బీఆర్‌ఎస్‌కు అనుమతి ఇవ్వరు.. కానీ, ఏం చేశారని తమకు పోటీగా రైతు మేళా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. రైతాంగాన్ని, ప్రజలను డైవర్ట్ చేసేందుకు కాంగ్రెస్ రాజకీయం చేస్తున్నదని మండిపడ్డారు. రైతులకు డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గుర్తుచేసేందుకు రాహుల్‌గాంధీ డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్‌లో బీఆర్‌ఎస్ రైతు సంగ్రామ సదుస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సదస్సుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.

బీఆర్‌ఎస్‌ను చూస్తే కాంగ్రెస్‌కు వణుకు

బీఆర్‌ఎస్ పార్టీని చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి భయం పట్టుకున్నదని మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ బయటకు వస్తే ఆ పార్టీ నేతలకు గుబులు పుడుతున్నదని చెప్పారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతు సంగ్రామ సదస్సు పెడుతుంటే.. పోటీగా కాంగ్రెస్ రైతుమేళాతో సభ పెట్టడమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ నిర్వహిస్తున్న రైతు మేళాలు ప్రజలను మోసం చేయడానికేనని విమర్శించారు. కాంగ్రెస్ రైతుమేళా కాదు.. వారిది బ్యాండు మేళం అని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని రకాలు ఇబ్బందులకు గురిచేస్తున్నదని తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రైతు రుణ విముక్తి కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై బీఆర్‌ఎస్ పార్టీ చర్చకు సిద్ధంగా ఉన్నదని తెలిపారు. విత్తనాలు, ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు.

..పట్టపగలే లూటీ

కరీంనగర్ పీఎంజే జ్యువెల్లర్స్‌లో దొంగల బీభత్సం

- అడ్డుకోబోయిన జ్యువెల్లరీ సిబ్బందిపై కాల్పులు
- నలుగురికి తీవ్రగాయాలు.. దవాఖానలో చికిత్స
- సినీ ఫక్కీలో.. 12 నిమిషాల్లో చోరీ పూర్తి
- కేంద్రమంత్రి ఆఫీసుకు కూతవేటు దూరంలో ఘటన

కరీంనగర్ విద్యానగర్, మే 3: కరీంనగర్ నగరం నడిబొడ్డున, అత్యంత రద్దీగా ఉండే జ్యోతినగర్ ప్రాంతంలో, కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయానికి కూతవేటు దూరంలో, పట్టపగలు సాయుధ దుండగులు నగల దుకాణాన్ని దోచుకున్నారు. జ్యోతినగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీకి ఆదివారం ఉదయం 11 గంటలకు కస్టమర్లలా వచ్చిన ఐదుగురు దుండగులు సిబ్బందిపై కాల్పులు జరిపి సినీ ఫక్కీలో దోపిడీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. దుండగులు ఒక్కొక్కరుగా దుకాణంలోకి వచ్చారు. ఆభరణాలు చూపించాలంటూ సిబ్బందిని మాటల్లో దింపారు. నలుగురు లోపలికి రాగా, ఐదో వ్యక్తి ప్రధాన ద్వారం వద్ద ఉన్నాడు. స్ట్రాంగ్ రూమ్ లాకర్ నుంచి నగలు తెచ్చిన సిబ్బంది వీరికి చూపించగా ఒక వ్యక్తి గన్ తీసి అందరూ లొంగిపోవాలని, లేదంటే కాల్చేస్తానని బెదిరించాడు. సిబ్బందిని అప్రమత్తం చేసిన షాపు ఇన్‌చార్జి ముస్తాక్, దుండగులను ప్రతిఘటించేందుకు ప్రయత్నించాడు. కానీ ఒక దుండగుడు అతనిపై కాల్పులు జరిపాడు. ఈ పెనుగులాటలో ఆయన తల పై భాగానికి దెబ్బ తగలడంతో అతడు అక్కడే కుప్పకూలాడు. ఆ దుండగుడు నగల దుకాణం సిబ్బంది కమలాసన్, రాజేశ్, మధూకర్‌పై కూడా కాల్పులు జరిపాడు. దీంతో సిబ్బంది భయభ్రాంతులకు గురికాగా.. అందరినీ ఒకే చోటకు తీసుకొచ్చి మోకాళ్లపై కూర్చోబెట్టి చేతులు కట్టివేశారు. మూతులకు ప్లాస్టర్ వేశారు. ఇద్దరు దుండగులు వీరికి కాపలా ఉండగా.. ముగ్గురు దుండగులు నగలను సర్దుకున్నారు. ఈ సమయంలో సిబ్బంది భయాందోళనకు గురై అరవడంతో దుండగులు అక్కడి నుంచి బయటకు వచ్చి అప్పటికే అక్కడ ఏర్పాటు చేసుకున్న బ్లాక్ కలర్ పల్సర్ బైక్, వైట్ కలర్ అపాచీ బైక్‌పై పారిపోయారు. దుండగులు మొత్తం మూడు సంచుల్లో నగలను నింపుకొన్నట్టు తెలుస్తుండగా, రెండు సంచులు అక్కడే పడేసి ఒక సంచిని మాత్రమే తీసుకెళ్లినట్టు పోలీసులు తెలిపారు. సీసీ పుటేజీల ఆధారంగా ఉదయం 11.01 నుంచి 11.13 నిమిషాల మధ్య దొంగతనం జరిగిందని చెప్పారు.



నిందితుల ఫొటోలు

ఐజీ పరిశీలన

తెలంగాణ మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. క్రైమ్ సీన్‌ను పరిశీలించి, పురోగతిపై అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దవాఖానకు వెళ్లి బాధితులను పరామర్శించారు. వారికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట కరీంనగర్ సీపీ గౌస్‌ఆలం పలువురు పోలీస్ ఉన్నతాధికారులు ఉన్నారు. ఘటన గురించి తెలియగానే కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నగల దుకాణం వద్ద బాధితులను పరామర్శించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దవాఖానలోని బాధితులను పరామర్శించారు.

సమాచారం ఇస్తే లక్ష బహుమతి

దొంగలను పట్టుకునేందుకు పోలీసులు ఎనిమిది బృందాలను ఏర్పాటుచేసి తనిఖీలు చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలిస్తున్నారు. జిల్లాలో హైఅలర్ట్ ప్రకటించి, ప్రతి పోలీస్‌స్టేషన్‌కూ సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. దోపిడీకి సంబంధించిన సీసీ ఫుటేజీతోపాటు నిందితుల ఫొటోలను విడుదల చేశారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే, వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. దొంగలు నల్లరంగు పల్సర్ బైక్, తెల్లరంగు అపాచీ బైక్‌లపై సంచరిస్తున్నారని తెలిపారు. సీసీ పుటేజీలో కనిపించిన వ్యక్తులను ఎవరైనా గుర్తించినా లేదా వారికి సంబంధించిన సమాచారం ఉన్నా వెంటనే డయల్ 100, 8712670744, 8712670745 నంబర్లకు తెలుపాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారికి లక్ష రూపాయల బహుమానం ఇస్తామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ప్రకటించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, చిత్రంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

ప్రజల భద్రతపై ఎందుకింత నిర్లక్ష్యం?

- దొంగలు సవాల్ విసురుతుంటే పోలీసులు ఏం చేస్తున్నట్టు?
- మాజీ మంత్రి, గంగుల నిలదీత
- సీఎం రేవంత్, బండి సంజయ్ రాజీనామా చేయాలి: కౌశిక్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్, మే 3: ప్రజల భద్రత విషయంలో పోలీసులు, ప్రభుత్వం ఎందుకింత నిర్లక్ష్యం చూపుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రశ్నించారు. దొంగల కాల్పుల్లో గాయపడి కరీంనగర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్‌తో కలిసి పరామర్శించారు. పోలీసులు నాకాబంధీ పేరుతో వాహనదారులను వేధించడం కాకుండా, అసాంఘిక శక్తులు ఎక్కడైనా తిరుగుతున్నారా? అని పరిశీలించాలని సూచించారు. బీఆర్‌ఎస్ హయాంలో ఓ చిన్నపాప కిడ్నాప్ జరిగితే మూడు గంటల్లోనే సీసీ కెమెరాల సాయంతో పట్టుకున్నామని గుర్తుచేశారు.

సీఎం, బండిదే బాధ్యత: కౌశిక్‌రెడ్డి

కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇంటికి కూతవేటు దూరంలోనే ఈ ఘటన జరిగిందంటే.. భద్రత ఉందా..? లేదా అన్న అనుమానం కలుగుతున్నదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర హోంమంత్రిగా కూడా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ఇదేనా ప్రజలకు భద్రతా? అని ప్రశ్నించారు. ఈ ఘటనకు కేంద్ర మంత్రి బండి సంజయ్, సీఎం రేవంత్‌రెడ్డిదే బాధ్యత అని పేర్కొన్నారు. సీపీని వెంటనే సస్పెండ్ చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

దురదృష్టకర ఘటన: బండి సంజయ్

పీఎంజే జ్యువెల్లరీ షాపులో దొంగలు కాల్పులు జరిపి దాడికి పాల్పడటం దురదృష్టకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ విచారం వ్యక్తంచేశారు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు కరీంనగర్‌ను జల్లెడ పడుతున్నారని, దుండగులను పట్టుకుంటారనే నమ్మకం ఉన్నదని చెప్పారు. ఘటనకు 10 నిమిషాల ముందే షాపు సమీపంలో అభివృద్ధి పనుల్లో పాల్గొన్నానని చెప్పారు. దుండగులు దొంగతనం చేయడానికే చొరబడినట్టు తెలుస్తున్నదని, సిబ్బంది అడ్డుకోవడంతో ఒక బ్యాగును వదిలి వెళ్లారని తెలిపారు. దోపిడీకి గురైన ఆభరణాల విలువ పోలీసుల విచారణలో తేలుతుందని అన్నారు.



దోపిడీ ముఠాలకు భయమేది?

- నాడు ఇటువైపు చూడాలంటే భయం
- నేడు రాష్ట్రంలో యథేచ్ఛగా దోపిడీ
- పట్టపగలే కాల్పులు జరిపి చోరీ
- ఇంటెలిజెన్స్‌కు సమాచారం నిల్

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పోలీస్ అంటే.. దోపిడీ ముఠాల్లో భయం పోయిందా? ఇటువైపు కన్నెత్తి చూడాలంటేనే భయపడే ముఠాలు ఇప్పుడు యథేచ్ఛగా తిష్టవేశాయా? భయంకరమైన దోపిడీ ముఠాలపై ఇంటెలిజెన్స్‌కు ఏమాత్రం సమాచారం లేదా? అంటే అవుననే అంటున్నాయి పోలీసు వర్గాలు. పట్టపగలే తుపాకులతో, మారణాయుధాలతో తిరుగుతూ.. దోపిడీలకు పాల్పడుతున్నా వ్యవస్థ మొద్దునిద్ర వీడటం లేదు. గత డిసెంబర్ 30న పోలీసుశాఖ విడుదల చేసిన వార్షిక క్రైమ్ నివేదిక ప్రకారం రోజుకు 53 దొంగతనాలు ఎక్కడో ఓ చోట జరుగుతున్నాయి. తలుపులు బద్దలు కొట్టి/ ఇంట్లోకి చొరబడి చేసే దొంగతనాలు రోజుకు 18 నమోదవుతున్నాయి. ఇక బందిపోటు దొంగతనాలు దాదాపు 24శాతం పెరిగాయి. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా.. ఆ ముఠాలను భయపెట్టే చర్యలు తీసుకోవడంలో వ్యవస్థ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నది.

పట్టపగలే కాల్పులకు తెగబడుతూ..

తెలంగాణలో దోపిడీలు, దొంగతనాలు, చోరీల కేసులు భారీగా నమోదవుతున్నట్టు పోలీసుల లెక్కలు చెప్తున్నాయి. ఉన్నోళ్లు, పేదోళ్లు, వృద్ధులు అనే తేడా లేదు.. గుడి, బడి, ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ ఆఫీసులు, ఇండ్లు అనే భేదం లేదు.. ఏదైనా సరే అందినకాడికి దొంగలు దోచుకుంటున్నారు. పట్టపగలే తాళాలు పగులగొట్టి ఇండ్లలోకి దూరి చోరీలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో నిరుడు ఖజానా జ్యువెలర్స్‌లో సైతం కాల్పులకు తెగబడి బంగారం, వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. ఆ రోజు ఉదయమే మరో ఘటనలో కూకట్‌పల్లిలో బంగారం, నగదు దోచుకెళ్లారు. తాజాగా కరీంనగర్ పట్టణంలో పీఎంజే జ్యువెలరీలో కూడా సిబ్బందిపై కాల్పులు జరిపి మరీ బంగారం, వెండి, ఇతర ఆభరణాలు కొల్లగొట్టారు. కొన్నిచోట్ల మారణాయుధాలతో దాడి చేసి దోచుకుంటున్నారు. ఇంతలా భయపెట్టి, చంపేందుకు కూడా వెనుకాడని దోపిడీ గ్యాంగ్‌లు తెలంగాణలో తిష్టవేసినా.. హోంమంత్రిత్వ శాఖను చూస్తున్న ముఖ్యమంత్రికి పట్టడం లేదని విమర్శలొస్తున్నాయి.

ఇంటెలిజెన్స్‌కు సమాచారం శూన్యం

రాష్ట్రంలో ఎక్కడ చోరీ జరిగినా లక్షలాది రూపాయలు నష్టపోవడమే కాకుండా.. విలువైన బంగారం, ఆభరణాలు, వస్తువులను కోల్పోతున్నారు. చోరీల కోసమే అంతరాష్ట్ర ముఠాలు తెలంగాణ సరిహద్దుల్లో తిష్టవేసినట్టు తెలుస్తున్నది. ఈ దోపిడీ గ్యాంగ్‌ల రాక పట్ల ఇంటెలిజెన్స్‌కు సమాచారం లేదని తెలుస్తున్నది. దొంగతనం, దోపిడీలు జరిగిన తర్వాత దర్యాప్తులు చేపడుతున్నారే తప్ప ఆయా ముఠాలపై నిఘా పెట్టడం, తెలంగాణ వైపు రాకుండా భయపెట్టడం, ఎస్పీలు, కమిషనర్లను, వారి ద్వారా ప్రజలను అప్రమత్తం చేయడంలో వ్యవస్థ విఫలమవుతున్నది. గతంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ పటిష్టంగా ఉండటంతో దోపిడీ, పార్థీ, భవేరియా ముఠాలు తెలంగాణవైపు రాకుండా నిలువరించారు. 2020లో 8,330 దొంతనాలు జరిగితే.. 2024కు ఆ సంఖ్య 19,480కి పెరిగింది. ఇండ్లలో దోపిడీలు 2020లో 3,476 జరిగితే.. 2024 నాటికి 5,724కు చేరాయి. భారీ దోపిడీలు 2020లో 305 నమోదైతే 2024కు ఆ సంఖ్య 703కు చేరింది. గతంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉంది.. పోలీసులు కూడా ఎంత చురుగ్గా స్పందించేవారు అనడానికి ఈ లెక్కలే నిదర్శనాలు.

ఇటీవల సంచలనం సృష్టించిన దోపిడీ కేసులివే..

1) 2026 మే 3న : కరీంనగర్ పట్టణంలోని జ్యోతినగర్‌లో పీఎంజే జ్యువెలరీలోకి ఐదుగురు దుండగులు చొరబడి తుపాకులతో కాల్పులు జరిపి, ఉద్యోగులను గాయపర్చి భారీగా బంగారు, వెండి ఆభరణాలు దోచుకెళ్లారు.
2) 2026 జనవరి 6న : హైదరాబాద్‌లోని జ్యువెలరీ షాపులో బొమ్మ పిస్టల్‌తో బెదిరించి నగలు దోచుకున్నారు.
3) 2026 జనవరి 2న : హైదరాబాద్ నగర శివారులోని రాంపల్లి ఎక్స్‌రోడ్స్‌లో ఉన్న బాలాజీ జ్యువెలర్స్‌లోకి దుండగులు తుపాకీ, గొడ్డలితో వచ్చి దోపిడీకి తెగబడ్డారు. యజమాని ప్రతిఘటించడంతో పారిపోయారు. 2025 డిసెంబర్ 4న జరిగిన ఓ దోపిడీలో వీరి ప్రమేయం ఉన్నదని తెలుసుకున్నారు.
4) 2025 ఆగస్టు 12న : కూకట్‌పల్లి సమీపంలోని చందానగర్‌లో ఆరుగురు సాయుధ దొంగల ముఠా ఖజానా జ్యువెలరీని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపి, డిప్యూటీ మేనేజర్‌ను గాయపర్చి, దోపిడీకి పాల్పడ్డారు.
5) 2026 ఫిబ్రరి 10న: జూబ్లీహిల్స్ ప్రాంతంలో నేపాల్ గ్యాంగ్ ఓ ఇంటిని కొల్లగొట్టి రూ.1.3 కోట్ల విలువైన బంగారం, వజ్రాల ఆభరణాలు దోచుకెళ్లారు.
6) 2026 జనవరి 15న: చెంగిచెర్లలో 9 ఇండ్లలో బంగారం, 8 కేజీల వెండి, 2 లక్షల నగదు దోచుకున్నారు.
7) 2026న జనవరి 15న : హైదరాబాద్‌లోని ఓ దేవాలయంలో 26 లక్షల విలువైన వస్తువులు చోరీకి గురయ్యాయి. అంతర్రాష్ట్ర ముఠాగా గుర్తించారు.
8) 2026 జనవరి 31న: కోఠిలో సాయుధ దోపిడీ ముఠా ఏటీఎంలో నగదు జమచేస్తున్న వ్యాపారిపై కాల్పులు జరిపి 6 లక్షల నగదు ఎత్తుకెళ్లారు.
9) 2026 ఏప్రిల్ 13న : బాన్సువాడలో 6 ఇండ్లలో చోరీలు జరిగాయి.
10) 2026 ఏప్రిల్‌లో: కూకట్‌పల్లిలో ఓ ముఠా నగదు రవాణా చేసేవారిపై కారం చల్లి రూ.కోటి దోచుకున్నారు.

2025 వార్షిక క్రైమ్ నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో శాంతిభద్రతల దుస్థితి

- రోజుకు 10 బలాత్కారాలు, 4 కిడ్నాప్ కేసులు నమోదు..
- తెలంగాణలో సగటును రోజుకు 3 హత్యలు జరిగితే.. అందులో ఓ మహిళ ఉంటుంది.
- గంటకు ముగ్గురు చొప్పన రోజుకు 74 మంది మిస్సింగ్..
- రోజుకు 53 దొంగతనాలు, 18 దొంగతనాలు (తలుపులు బద్దలు కొట్టి/ఇంట్లోకి చొరబడి చేసేవి)
- 3 నమ్మకద్రోహం, 85 చీటింగ్ కేసులు
- రోజుకు 8 డ్రగ్స్ కేసులు నమోదు
- రోజుకు 21 వాహనాలు చోరీ
- రోజుకు 75 రోడ్డు ప్రమాదాలు, సగటున 20 మంది మృతి, 44 మంది క్షతగాత్రులు
- రోజుకు సగటున రూ.5 కోట్లు కొట్టేస్తున్న సైబర్ నేరగాళ్లు
- స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లే కేసులు రోజుకు 20 చొప్పన నమోదు
- రోజూ ఎక్కడో ఓ చోట ఎస్సీ, ఎస్టీలను కులంతో దూషిస్తున్నారు.. హర్ట్ చేస్తున్నారు
- రోజుకు సగటున అన్ని స్టేషన్లలో 683 ఎఫ్‌ఐఆర్‌లు నమోదవుతున్నాయి. వాటిల్లో సగటున 500 ఐపీసీ కేసులు నమోదుతున్నాయి.

రేవంత్ పాలనకు సవాల్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నెల రోజుల్లో రెండు భారీ దోపిడీలు

- గత నెల 11న పోలీసు ఠాణా పక్కనే ఉన్న ఏటీఎం చోరీ
- తాజాగా కేంద్రమంత్రి ఇంటికి కూతవేటు దూరంలో దోపిడీ
- దుండగులను ఉత్తర భారతీయులుగా అనుమానిస్తున్న పోలీసులు
- వచ్చింది దొంగలా.. ఉగ్రవాదులా..? అన్న అనుమానాలు
- ప్రజలరక్షణ కన్నా.. ఫైన్ల విధింపుకే కమాండ్ కంట్రోలు వినియోగం
- పక్కాగా రెక్కీ నిర్వహణ, నాకాబందీ జరిగిన 12 గంటల్లోనే దోపిడీ

కరీంనగర్, ఏప్రిల్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నెల రోజుల వ్యవధిలో జరిగిన రెండు భారీ దోపిడీలు రేవంత్‌రెడ్డి సర్కార్‌కు సవాల్ విసిరాయి. దొంగలు మాస్కులు ధరించకుండా తమను ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో దోపిడీలకు పాల్పడటం భద్రతా వైఫల్యాన్ని కండ్లకు కడుతున్నది. గతనెల 11న రాజన్న సిరిసిల్ల జిల్లా, ఎల్లారెడ్డిపేట ఎస్‌బీఐ ఏటీఎంను దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీస్ పెట్రోలింగ్ జరుగుతున్నా దొంగలు భయపడకుండా తమ పని పూర్తిచేసుకొని వెళ్లిపోగా.. నేటివరకు వారిని పట్టుకోలేకపోయారు. తాజాగా ఆదివారం పట్టపగలే పీఎంజే జ్యువెల్లరీ షాపులో దోపిడీ చేయడంతోపాటు ప్రతిఘటించిన నలుగురు సిబ్బందిపై కాల్పులు జరిపిన ఘటనతో కరీంనగర్ ఉలిక్కిపడింది. ఈ నగల దుకాణం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉండటం గమనార్హం. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఈ తరహా ఘటన జరగడం ఇదే ప్రథమం కాగా, వందల కెమెరాలను దాటొచ్చి దుండగులు ఈ దారుణానికి ఒడిగట్టడంపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సవాల్ విసురుతున్న దొంగలు

నెల రోజుల్లో రెండు భారీ దోపిడీలకు పాల్పడిన దొంగలు పోలీసులకు సవాలు విసరుతున్నారు. సిరిసిల్లలో ఓవైపు పోలీసులు గస్తీ తిరుగుతుండగా, పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉన్న ఏటీఎంను పగులగొట్టి.. అక్కడి మిషన్‌ను ఎత్తుకెళ్లారు. కరీంనగర్‌లో పీఎంజే నగల దుకాణంలో దోపిడీ పకడ్బందీగా జరిగినట్టు తెలుస్తున్నది. దోపిడీకి పాల్పడేముందు దుండగులు మూడు రోజులపాటు రెక్కీ నిర్వహించి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సినీ ఫక్కీలో దోపిడీకి పాల్పడిన దుండగులు 12 నిమిషాల్లో తమ పని ముగించుకొని వెళ్లిపోవడం నిఘా వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నది. ఘటన జరగడానికి పది నిమిషాల ముందే మంత్రి బండి సంజయ్ అక్కడ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన నేపథ్యంలో.. సాధారణంగా ఆ ప్రాంతంలో భద్రతా చర్యలు పటిష్ఠంగా ఉండాలి. కానీ దొంగలు ఏమాత్రం భయం లేకుండా నగల దుకాణంలో చొరబడి, సిబ్బందిపై కాల్పులు జరిపి మోటార్ సైకిళ్లపై తప్పించుకొని పారిపోయారు.

ఉత్తర భారతీయులే?

దుండగుల మాటలను బట్టి వారు ఉత్తర భారతదేశానికి చెందినవారై ఉండచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కొంతమంది హిందీలో, మరికొందరు తెలుగులో మాట్లాడినట్టు తెలుస్తున్నది. దుండగులు అపాచీ , పల్సర్ బైక్‌లపై శాతవాహన యూనివర్సిటీ, మల్కాపూర్, చింతకుంట మీదుగా సిరిసిల్ల వైపు పారిపోయినట్టు భావిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని రహదారులపై తనిఖీ చేపట్టారు. ఘటనాస్థలం నుంచి బుల్లెట్ షెల్స్, మ్యాగజైన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని సీపీ గౌస్‌ఆలం ప్రకటించారు.

నాకాబందీ నిర్వహించిన 12 గంటల్లోనే..

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో శనివారం పోలీస్ అధికారులు నాకాబందీ, స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, సరిహద్దు ప్రాంతాల్లో నిర్వహించిన ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన వందలాది వాహనాలపై కేసులు నమోదు చేసి, పలు వాహనాలను సీజ్ చేసినట్టు పోలీసు వర్గాలు వెల్లడించాయి. దుండగులు మూడురోజుల ముందుగానే కరీంనగర్‌కు వచ్చి మకాం వేసినట్టు తెలుస్తున్నది. దొంగలు నగరంలోనే మకాంవేసినా పోలీసుల నిఘా ఏమైందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వచ్చింది ఉగ్రవాదులా..?

పీఎంజే జ్యువెల్లరీలో క్లూస్ టీం పలు కీలక ఆధారాలు సేకరించినట్టు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తున్నది. ఐదుగురు దుండగులలో ఒకరు మాత్రమే మాస్కు వేసుకున్నారు. నలుగురు మాస్కులు ధరించలేదు. ఈ ఫొటోలను సేకరించిన పోలీసులు వారిని మహారాష్ట్రకు చెందిన పాత నేరస్తుల ముఠాగా గుర్తించినట్టు తెలుస్తున్నది. నిందితులంతా విదేశీ తుపాకులు వినియోగించడం, సిబ్బందిని తాళ్లతో కట్టేసి, బందీలను మోకాళ్ల మీద నిలబట్టడం వంటి అంశాలను మరో కోణంలో చూస్తున్నారు. దుండగులు ఉగ్రశిక్షణ పొందారా? అన్న అనుమానాలు ఉన్నాయని ఓ పోలీస్ అధికారి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కూత వేటు దూరంలోనే కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆఫీసు ఉండడంతో ఐబీ కూడా ఘటనపై ఆరా తీస్తున్నట్టు తెలుస్తున్నది.

ఫైన్లకే పరిమితమైన కమాండ్ కంట్రోల్

కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. నగరంలో శాంతిభద్రతలు, అసాంఘిక చర్యలు జరగకుండా చూసేందుకు 770కి పైగా సీసీ కెమెరాలను ఈ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. తాజా దోపిడీ నేపథ్యంలో ఈ కంట్రోల్ సెంటర్‌లో సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్న పోలీసు వ్యవస్థ ఏం చేస్తున్నదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు పోలీసులు నిత్యం వచ్చి కెమెరాలను పరిశీలించిన దాఖలాలు లేవన్న విమర్శలు ఉన్నాయి. నిజానికి శాంతి భద్రతలకు వినియోగించాల్సిన ఈ కెమెరాలను కేవలం వాహనదారులకు ఫైన్లు వేయడానికి మాత్రమే వాడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరుపై పర్యవేక్షణ లేకుండా పోయిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రస్తుతం ఓ ప్రైవేట్ సంస్థ యజమాన్యం పర్యవేక్షణ చేస్తున్నది. అత్యంత కీలకమైన కంట్రోల్ సెంటర్‌ను ఇప్పటివరకు జిల్లా యంత్రాగం పూర్తిస్థాయిలో వినియోగించలేదన్న అభిప్రాయాలు వస్తున్నాయి. స్మార్ట్ సిటీ కింద ఏర్పాటుచేసిన 770 కెమెరాలే కాదు, నగరంలో దాదాపు ప్రైవేట్ పరంగా 4వేలకుపైగా కెమెరాలున్నాయి. ఇంత వ్యవస్థ ఉన్నా దుండగులు రెక్కీలు నిర్వహించి దోపిడీకి పాల్పడుతుంటే.. పోలీస్ యంత్రాంగం ఏమి చేస్తున్నదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.


ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లి వద్ద ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు


సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో నీళ్లలోని వడ్లను ఎత్తుతున్న మహిళా రైతు


మంచిర్యాల జిల్లా కోటపల్లిలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు


సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మార్కెట్‌యార్డులో నీళ్లలో వడ్లను ఎత్తుతున్న రైతులు

గాలివాన బీభత్సం..

పలు జిల్లాల్లో ఈదురుగాలుల వర్షం

రైతన్న ఆగమాగం!

- **అకాల వర్షంతో తడిసిన ధాన్యం, మక్కజొన్న**
- **మహబూబాబాద్ జిల్లా సూదనపల్లిలో పిడుగు పాటుకు ఒకరు మృతి, ఇద్దరికి అస్వస్థత**
- **ఖమ్మం-సూర్యాపేట రహదారిపై రైతుల ధర్నా**

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు బీభత్సం సృష్టించాయి. మార్కెట్లు, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిచింది. తీవ్రమైన గాలులతో పలు చోట్ల చెట్లు, కరెంటుస్తంభాలు నేలకొరిగాయి. ఇండ్ల పైకప్పులు ఎగిరిపడ్డాయి. నల్లగొండ జిల్లా పెద్దవూర, అనుముల, త్రిపురారం, మిర్యాలగూడ, నేరడుచర్ల మండలాల్లో భారీ వర్షం పడింది. మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంతోపాటు పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. విద్యుత్తు సరఫరాకు, రాకపోకలకు అంతరాయం కలిగింది. సంద్రోన్‌పల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసి ముద్దయ్యింది. చెన్నూర్‌లో చెట్లు విరిగి పడ్డాయి. కోటపల్లి, సర్వాయిపేట, పారుపల్లి, షట్‌పల్లిలో ధాన్యం తడిసింది. రాపనపల్లిలో ఆరె సంతు అనే వ్యక్తి ఇంట్లోని తాటి చెట్టుపై పిడుగుపడింది. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం, మక్కలు తడిసిముద్దయ్యాయి. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లిలో విషాదం చోటుచేసుకున్నది. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై టార్పాలిన్లు కప్పుతుండగా నీలం వెంకన్న అనే కార్మికుడు పిడుగుపాటుతో మృతిచెందాడు. ఇద్దరు రైతులు అస్వస్థతకు గురయ్యారు. కౌసల్యాదేవిపల్లిలో రెండు మేకలు మృతి చెందాయి. శనిగపురం, ఈదులపూసపల్లి, ముడుపుగల్, అయోధ్య, మల్యాల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. గాలికి ఆర్టీసీ బస్‌స్టాండ్ ఏరియాలోని రేకుల షెడ్డు ఎగిరిపోయింది. కేసముద్రం మార్కెట్ యార్డులో మక్కజొన్న, ధాన్యం తడిసిపోయాయి. తాళ్లపూసపల్లిలో బత్తిని సమ్మయ్యకు చెందిన మూడు కాడెడ్లు పిడుగుపాటుతో మృతిచెందాయి. డోర్నకల్, బయ్యారం, గార్ల, మరిపెడ, నర్సింహులపేట మండలాల్లోని పలు గ్రామాల్లో ధాన్యం తడిసింది. దంతాలపల్లి, చిన్నగూడూరులో పంటలకు నష్టం వాటిల్లింది. వరంగల్ జిల్లా నెక్కొండలో 80 వేల బస్తాల మక్కలు వర్షార్పణమయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. హుస్నాబాద్‌మార్కెట్‌లో రైతులు ఆరబోసిన ధాన్యం, మక్కలు కొట్టుకుపోయాయి. కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల్లో అకాల వర్షం కురిసింది. సైదాపూర్ మండలం రాయికల్‌తోపాటు పలు గ్రామాల్లో వడగండ్లకు వడ్లు రాలిపోయాయి. ఆరబోసిన వడ్లు తడిసిపోయాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. వర్షంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లోని మక్కజొన్న, వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. కూసుమంచి, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో వడగండ్ల వాన పడింది. సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై వేలాది క్వింటాళ్ల ధాన్యం, మక్కలు నీటి పాలయ్యాయి. మామిడితోటల్లో మామిడికాయలు నేలరాలాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో రోడ్లపై ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయింది. కరకగూడెం మండలంలో చెట్లు నేలకొరిగాయి. అనంతారం, కరకగూడెం, పద్మాపురం, గొల్లగూడెం గ్రామాల్లో ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. కరకగూడెం నుంచి బైక్‌పై మొగిలితోగుకు వెళ్తున్న కొమరం నరసింహారావుపై పద్మాపురం సమీపంలో చెట్టుకొమ్మ విరిగి మీద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. పినపాక మండలం గోపాలరావుపేట, కిష్టాపురం, జానంపేట, తోగ్గూడెంలో విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. కారేపల్లి మండలం మాదారంలో మక్కజొన్న తడిసింది. గత 20రోజులుగా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం, మక్కలను కొనుగోలు చేయకపోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మంజిల్లా ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లి క్రాస్‌రోడ్డు వద్ద సూర్యాపేట- ఖమ్మం జాతీయ రహదారిపై మక్కజొన్న రైతులు ధర్నాకు దిగారు. మద్దులపల్లి కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు ఆలస్యంకావడంతో ఆదివారం కురిసిన వర్షానికి పంట తడవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు.

మా వడ్లన్నీ తడిసినయ్



మేము మార్కెట్‌కు తెచ్చిన వడ్లు మొత్తం ఎండినయ్. ఇక కాంటా పెడుతామని అధికారులు చెప్పిండ్రు. ఇంతలో అనుకోకుండా భారీ వర్షం పడింది. దీంతో వడ్లు మొత్తం తడిసిపోయినయి. మళ్లీ వడ్లను ఎండబెట్టాలంటే వారం రోజులు ఇక్కడే ఉండాలి. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఇప్పటికే ఎండలో రోజుల తరబడి ఉంటున్నాం. మళ్లీ వడ్లు ఎండేదాకా ఇక్కడే ఉండాల్సి వస్తుంది. అధికారులు తడిసిన వడ్లను కొనుగోలు చేయాలి.

– కానవేని పద్మ, రైతు,ఆరెపల్లి, హుస్నాబాద్, సిద్దిపేట జిల్లా

నీటిలో కొట్టుకపోయినయ్



మార్కెట్లో ఆరబోసిన వడ్లు మొత్తం తడిసి పోవడమే కాకుండా కొన్ని వడ్లు వరదకు కొట్టుకపోయాయి. ఇవి కుప్ప పోసినా, ఆరబోసినా ఇప్పట్లో ఎండేటట్లు లేవు. చేతికందిన పంట వానకు కొట్టుకపోవడం బాధగా ఉన్నది. కొట్టుకపోయే పంటను చేతులతో ఆపి కాపాడుకునే ప్రయత్నం చేసినా లాభం లేకుండాపోయింది. అధికారులు కరుణించి తడిసిన, రంగుమారిన వడ్లను కూడా కొనుగోలు చేయాలి.

–శ్యామల, రైతు, నాగారం, హుస్నాబాద్, సిద్దిపేట జిల్లా


ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో రైతుల ఉరుకులు పరుగులు


సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో నీళ్లలోని వడ్లను పారతో తీస్తున్న రైతు


వరంగల్ జిల్లా నెక్కొండలో వర్షానికి టార్పాలిన్ షీట్స్‌పై నిలిచిన నీటిని బకెట్‌తో తోడేస్తున్న రైతు

కుప్పకూలిన రైతులు

మొదటిపేజీ తరువాయి...

కొనుగోలు కేంద్రాల్లో ఆదివారం జరిగిన ఈ సంఘటనలు స్థానికంగా తీవ్ర విషాదం నింపాయి. ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీల కారణంగా నాలుగు రోజుల నుంచి వడ్లు ఆరబోసి ఎర్రటి ఎండలో పడిగాపులు కాసి చివరికి వడదెబ్బతో రైతు ప్రాణాలు వదిలాడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించిన రాయపోల్ కొనుగోలు కేంద్రంలో ఈ ఘటన జరిగింది. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ గ్రామానికి చెందిన మంగలి గౌరయ్య పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పండించిన ధాన్యాన్ని నాలుగు రోజుల క్రితం అదే గ్రామంలో రాచకొండ మైలారం సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు. ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉన్నదని, ఆరబెట్టాలని అధికారులు కొనడానికి నిరాకరించారు. ఆరబోసి నాలుగు రోజులుగా అక్కడే ఉంటున్నాడు. ఆదివారం కూడా ఆరబెట్టిన ధాన్యాన్ని తన భార్యతో కలిసి కుప్పనూర్చేందుకు వెళ్లాడు. ఎండ తీవ్రంగా ఉండడంతో వడ దెబ్బకు గుర్రై వడ్లపైనే కుప్పకూలాడు. వెంటనే తోటి రైతులు వెళ్లి చూడగా అప్పటికే చనిపోయాడు. నాలుగు రోజులుగా ఎర్రటి ఎండలోనే గౌరయ్య ధాన్యం ఎండబోస్తున్నా అధికారులు కొనుగోలు చేయకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని స్థానిక రైతులు వాపోతున్నారు. గౌరయ్యకు భార్య వెంకటమ్మ, ఇద్దరు కుమారులున్నారు.

ఎమ్మెల్యే ప్రారంభించినా కొనుగోలు ఆలస్యం

రాయపోల్‌లో ఐదు రోజుల క్రితం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మండల పరిధిలోని రాయపోల్, ముక్కునూరు, దండు మైలారం, పోల్కంపల్లి, నాగన్‌పల్లి, నెర్రపల్లి గ్రామాల రైతులు ఈ కేంద్రానికే ధాన్యాన్ని తీసుకొస్తారు. ఐదురోజులుగా ధాన్యం పెద్ద ఎత్తున పోగుపడుతున్నా కొనుగోలు మాత్రం ముందుకు సాగడం లేదు. దీంతో రైతులు మండుటెండలో రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నది. ధాన్యానికి గిట్టుబాటు ధర రావాలంటే తేమ శాతం పూర్తిగా పోవాలని అధికారులు కొర్రీలు పెడుతున్నారు. దీంతో రైతులు తాము తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దే ఆరబోసి పడిగాపులు కాస్తున్నారు. వడ్ల నుంచి తాలు వేరు చేసే మిషన్ కూడా సకాలంలో రాకపోవడంతో ధాన్యాన్ని కల్లాల వద్దే ఆరబోసి కాపలా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్యాడీ క్లీనింగ్ మిషన్ కూడా అందుబాటులో లేక పోవడంతో ధాన్యం కొనుగోలుకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. ఎమ్మెల్యే ప్రారంభించిన కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మిగతా కేంద్రాల్లో పరిస్థితి ఏవిధంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చని రైతులు పేర్కొంటున్నారు.

హడావుడిగా అంత్యక్రియలకు అధికార పార్టీ నేతల ఒత్తిడి

ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రాణం కోల్పోయిన గౌరయ్య అంత్యక్రియలను తక్షణమే పూర్తిచేయాలని అధికార పార్టీ నేతలు బాధిత కుటుంబంపై ఒత్తిడి తెచ్చారు అంత్యక్రియలు వెంటనే చేస్తే ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చవచ్చని భావించారు. ఎలాగైనా అంత్యక్రియలు ఆదివారమే పూర్తిచేయాలని బాధిత కుటుంబాన్ని ఒప్పించేందుకు ప్రయత్నించారు. ఆలస్యమైనందున సోమవారం పూర్తి చేస్తామని బాధితులు చెప్పినా వారు వినకపోవడం గమనార్హం.

మూగరైతు మృత్యువాత

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకొనేందుకు నెలరోజులుగా అరిగోస పడ్డ మూగరైతు, చివరికి వడ్లు కాంటా వేస్తుండగా పిడుగుపాటుకు గుర్రై చనిపోయాడు. వడ్లు తెచ్చి రోజులు గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం అతడి కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. నెల రోజుల తర్వాత ప్రారంభమైన సెంటర్‌లో వడ్లు కాంటా వేస్తుండగా మృతిచెందడం స్థానికులను మరింత కలచివేసింది. ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం కారణంగానే మృత్యువాతపడ్డాడని తోటి రైతులు మండిపడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లిలో కొనుగోలు కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీలం వెంకన్న (40) పుట్టు మూగ. తనకున్న 1.20 ఎకరాల్లో వరి సాగు చేశాడు. నెల క్రితమే తాను పండించిన సుమారు 45 బస్తాల ధాన్యాన్ని కాంపల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తెచ్చి ఆరబోశాడు. సమయానికి కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో రైతులు ధాన్యాన్ని కాపాడుకునేందుకు రోజుల తరబడి అక్కడే పడిగాపులు కాశారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆదివారం సాయంత్రం కాంటా వేయడం మొదలు కాగా, ఒక్కసారిగా వాతావరణం మారి గాలి దుమారం, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో కొనుగోలు కేంద్రంలో వెంకన్నపై పిడుగుపడటంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. అక్కడున్న వారు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు.


ఆదిలాబాద్ జిల్లా కనుగుట్టలో పంట దగ్ధంతో రోదిస్తున్న మహిళలు

అగ్గికి మక్క బుగ్గి

- **బూడిదైన 200 క్వింటాళ్ల పంట**
- **మంటల్లో చిక్కి 30 గొర్రెలు మృతి**
- **పాతర్లపాడులో విషాదం**
- **ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోనూ పంట దగ్ధం**

బిజినేపల్లి/ చింతకాని/ఆదిలాబాద్ (నమస్తే తెలంగాణ), మే 3 : ఆరుగాలం కష్టించి పండించిన పంటలు, ప్రేమగా పెంచుకున్న మూగజీవాలు అగ్నికి ఆహుతి కావడంతో రైతులు రోదిస్తున్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడులో మొక్కజొన్నకు ప్రమాదవశాత్తు నిప్పంటుకున్నది. పెనుగాలులకు మంటలు వ్యాపించి కల్లాల్లోని మొక్కజొన్న బస్తాలను చుట్టుముట్టాయి. ప్రమాదంలో 200 క్వింటాళ్ల మక్కలు బూడిదయ్యాయి. అదే గ్రామానికి చెందిన ఒబినబోయిన వీరబాబు, చెవుల పుల్లయ్యకు చెందిన 30 గొర్రెలు మృతి చెందాయి. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కనుగుట్టలో 60 ఎకరాల్లో 25 మంది రైతుల మక్క పంట అగ్నికి ఆహుతైంది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం అల్లీపూర్‌కు చెందిన శ్రీనివాసులు రెండెకరాల్లో మక్క సాగు చేశాడు. ఆదివారం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు చెలరేగడంతో పంట కాలిబూడిదైంది. వడ్డెమాన్‌లో ఆంజనేయులుకు చెందిన 30 గుంటలు, స్వామికి చెందిన ఎకరన్నర పంట కాలిబూడిదైంది.

ప్రాణాలు పోతుంటే ఉత్సవాలా?

- **పండుగ మోజులో సర్కార్ నిర్లక్ష్యం**
- **పంట అమ్ముడుపోక రైతు అరిగోస**
- **రాశులపైనే ప్రాణాలిడుస్తున్న వైనం**
- **కొనుగోళ్ల అంశం పక్కనబెట్టి నేటి నుంచి రైతు వారోత్సవాలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సన్నద్ధం**
- **సర్కార్ తీరుపై రగులుతున్న రైతు**

ఆదివారం ఒక్కరోజే ఇద్దరు రైతులు తనువు చాలించారు. మహబూబాబాద్ జిల్లాలో పిడుగుపాటుకు గుర్రై ఒకరు, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో గౌరయ్య అనే రైతు వడదెబ్బతో వరి కుప్పపైనే మృత్యుఒడిలోకి చేరాడు. ఈ ఘటనలు కొనుగోళ్లలో సర్కార్ నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం పంట కొనుగోలు చేయకపోవడంతో రైతులు చనిపోతుంటే, ప్రభుత్వం సంబురాలకు సిద్ధమవుతుండటంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

హైదరాబాద్, మే 3(నమస్తే తెలంగాణ): పంటల కొనుగోళ్లు ఆలస్యం అవుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ రైతులు రోడ్లెక్కుతున్నారు, ధర్నాలు, రాస్తారోకోలతో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. కల్లాల్లో ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. మక్క రైతుల గోస ఎవరికీ పట్టడం లేదు. జొన్నల కొనుగోళ్లను సర్కార్ మొదలే పెట్టలేదు. ఆయా పంటల రైతులు అరిగోస పడుతున్నారు. ఓవైపు సర్కార్ నిర్లక్ష్యం, మరోవైపు అకాల వర్షాలతో రైతులు కష్టాలు అనుభవిస్తూ నష్టాలను మూటగట్టుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు గోసరిల్లుతుంటే కాంగ్రెస్ సర్కార్ పండుగలు నిర్వహిస్తున్నది. సోమవారం నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని సోమవారం తాండూరులో మంత్రి తుమ్మల ప్రారంభించనున్నారు. ఆధునిక సాంకేతిక ప్రదర్శనలు ఈ వారోత్సవాల్లో ఆకర్షణగా నిలుస్తాయని, రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని మంత్రి చెప్తున్నారు.

పంటలు కొనకుండా పండుగలేల?

వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న రైతు వారోత్సవాలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఈ నిర్ణయంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటల కొనుగోళ్లలో సర్కార్ ఆలస్యం రైతులకు శాపంగా మారుతున్నది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం, ప్రారంభించిన చోట కొనుగోళ్లు మొదలు పెట్టకపోవడం, మొదలుపెట్టిన చోట కొర్రీలు, కోతలతో జాప్యం చేస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 20 రోజుల నుంచి నెలరోజుల పాటు కల్లాల్లోనే రైతులు పడిగాపులు కాస్తున్నారు. తామంతా రోడ్లపై అరిగోస పడుతుంటే.. ఇదే సమయంలో పండుగలెలా చేస్తారు? అంటూ మండిపడుతున్నారు. పంటలు కొనడం చేతగావడంలేదు గానీ.. పండుగలు చేయడానికి ఉత్సాహం చూపుతారా? అంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

సర్కార్ కుయుక్తి

మక్క రైతుల గోస అంతా ఇంత కాదు. మక్కలను ఎంత వీలైతే అంత తక్కువ కొనుగోలు చేసేందుకు సర్కార్ ముందే ఓ నిర్ణయం తీసుకున్నదని తెలుస్తున్నది. అందుకే కొనుగోలులో తీవ్ర తాత్సారం చేస్తున్నది. కావాలనే సమస్యలు సృష్టిస్తున్నది. గన్నీ సంచుల కొరతతో మక్క కొనుగోళ్లు నిలిచిపోయాయి. జొన్నల కొనుగోళ్లు ఇప్పటివరకు చేపట్టనే లేదు. శనగ సగం వరకు కొనుగోలు చేసి నిలిపివేసింది. కొనుగోళ్లలో జాప్యంతో రైతులు మండుటెండలో పడిగాపులు కాస్తున్నారు.

అకాలవర్షాలతో తీవ్ర నష్టం

గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా అకాలవర్షాలు రైతులకు తీవ్ర నష్టాలు తెచ్చిపెడుతున్నాయి. ఎక్కడికక్కడే నిల్వ ఉన్న పంట దిగుబడులు తడిసిపోయి రైతులు దిగాలు చెందుతున్నారు. ఆదివారం ఉమ్మడి ఖమ్మం, నల్లగొండతోపాటు సిద్దిపేట, కరీంగనర్ జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. పలుచోట్ల వర్షానికి పంటలు కొట్టుకుపోయాయి. ఒకవైపు రైతులు పంటలు అమ్ముకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే..వాన దెబ్బతో రైతులు నష్టాల పాలవుతున్నారు. మరోవైపు రైతుల కష్టాలు తీర్చాల్సిన ప్రభుత్వం రైతు వారోత్సవాల పేరిట ఉత్సవాలు నిర్వహించడం ఎంత వరకు సమంజసం అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అన్నింటా నష్టాలు చవిచూస్తున్న రైతులు కష్టాలు, కన్నీళ్లతోనే ఉత్సవాల్లో పాల్గొనలా? అంటూ ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

రైతు వారోత్సవాల షెడ్యూల్ వివరాలు

- మొదటిరోజు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మట్టి ఆరోగ్యం, సమతుల ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం వంటి అంశాలపై రైతులకు అవగాహన
- రెండోరోజు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పంటల విభిన్నీకరణ, మైక్రో ఇరిగేషన్ వంటి అంశాలపై కార్యక్రమాలు
- మూడోరోజు సహకార, మార్కెటింగ్ శాఖల ద్వారా మార్కెట్ లింకేజీ, రుణ సదుపాయాలపై రైతులకు అవగాహన
- నాలుగోరోజు యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం, సౌరశక్తి పరిష్కారాలపై ప్రదర్శనలు
- ఐదోరోజు పశుసంవర్ధక, మత్స్య శాఖల ఆధ్వర్యంలో పశు ఆరోగ్యం, చేపల ఉత్పత్తి పెంపుపై అవగాహన
- చివరిరోజు సాగునీటి శాఖ వర్షాకాలానికి ముందస్తు చర్యలు, నీటి వనరుల నిర్వహణపై మార్గనిర్దేశనం

ఎంతమందిని బలి తీసుకుంటవ్ రేవంత్



సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మల్లారం వద్ద రాజీవ్ రహదారిపై రైతులు చేస్తున్న రాస్తారోకోకు సంఘీభావం తెలుపుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రైతులను అరిగోసపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

మండుటెండల్లో రైతులు మాడిపోతున్నరు

వడదెబ్బ తగిలి కుప్పల వద్దే రాలిపోతున్నరు

- బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు ఆందోళన
- చిన్నకోడూరు మండలం మల్లారం వద్ద రాజీవ్ రహదారిపై రైతుల రాస్తారోకోలో కూర్చొని మద్దతు తెలిపిన హరీశ్‌రావు

చిన్నకోడూరు, మే 3: 'రేవంత్‌రెడ్డి.. ఎంత మంది రైతుల ఉసురు పోసుకుంటవ్? ఇంకెంతమంది రోడ్ల మీదికి రావాలి? వడదెబ్బ తగిలి కుప్పల మీదనే రాలిపోయే పరిస్థితి రైతులకు రావడం బాధాకరం.రేవంత్‌రెడ్డికి రైతులపై కనీసం కనికరం లేదు. నువ్వు ఒరిజినల్ రైతు బిడ్డవి కాదు.. డూప్లికేట్ రైతు బిడ్డవు' అని బీఆర్‌ఎస్ ఎల్పీ ఉపనేత తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మల్లారం రాజీవ్ రహదారిపై ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు చేస్తున్న రాస్తారోకోకు హరీశ్‌రావు మద్దతు తెలిపి వారితోపాటు బైఠాయించారు. రైతులతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రాజీవ్ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వడ్ల కొనుగోలు విషయంలో సర్కార్ పూర్తి విఫలమైందని ఆరోపించారు. వడ్లు కొనద్దనే ఉద్దేశంతో రకరకాల ఇబ్బందులతో రైతులను గోసపుచ్చుకుంటుందని మండిపడ్డారు. పేరుకు మాత్రం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు తప్ప ఒక్క గింజ కూడా కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. మల్లారంలో ఓ ఫంక్షన్‌కు వస్తే ఇక్కడ రైతులంతా రాస్తారోకో చేస్తున్నారని, ఎందుకని ఆరా తీస్తే కేంద్రంలో వడ్లు పోసి 28 రోజులు అవుతుందని, కొనేటోళ్లు లేరని ఆవేదన చెందుతున్నారని తెలిపారు. రైతుల రాస్తారోకో విషయం కలెక్టర్‌కు ఫోన్ చేసి చెప్తే రూల్స్ మాట్లాడటం సరికాదని అన్నారు. గ్రేడ్ల పేరిట, తాలు ఉన్నదని, కోతల పేరిట రకరకాలుగా ఇబ్బందులు గురిచేయడం దారుణమని అన్నారు. మక్కజొన్న రైతులకు నాలుగు రోజులుగా గన్నీ బ్యాగులు లేవని, బ్యాగులు రైతులే కొనుకొవాలని చెప్పడం దారుణమని అన్నారు. చిన్నకోడూరు, సిద్దిపేటలో కొనుగోళ్లు ఆగిపోయాయని తెలిపారు. 'ధాన్యం కొంటరా... కొనరా.. కొంటె ఎప్పటినుంచి కొంటరు?' అని చెప్పేవారే కరువయ్యారని అన్నారు. 22 రోజులుగా రైతులు పొద్దున్నే వచ్చి సాయంత్రం వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జొన్న, మక్కలు కొనుగోలు చేయకపోవడంతో ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. 90 లక్ష ల టన్నుల వడ్లు కొంటామని సచివాలయంలో చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు 9 లక్షల టన్నుల వడ్లు కొనలేదని.. ఇప్పటివరకు 10 పైసల వడ్లు కొనలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని హరీశ్‌రావు మండిపడ్డారు. ఉన్నతాధికారులను ప్రతి జిల్లాకు ఒకరిని నియమించి ధాన్యం కొనుగోలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సన్నాలంటే ఎనిమిది రకాలే!

ఈ వానకాలం నుంచే వీటిని సాగుచేయాలి

జాబితా నుంచి 29 రకాల సన్నాలు ఔట్?

- ధాన్యం రకాల కుదింపునకు సర్కార్ కుట్రలు
- గతంలో 37 రకాల ధాన్యం జాబితా విడుదల
- తాజాగా 8 రకాలేనని మంత్రి తుమ్మల వెల్లడి
- మిగతా రకాలకు బోనస్ ఇస్తారా? ఎగవేస్తారా?
- సర్కార్ నుంచి స్పష్టత కరువు.. రైతుల్లో ఆందోళన

హైదరాబాద్, ఏప్రిల్ 3(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ రైతుల నెత్తిన మరో పిడుగు వేయనున్నదా? అందుకే నోటిపై సన్న రకాల ధాన్యం జాబితాను కుదిస్తున్నదా? ధాన్యానికి ఇచ్చే బోనస్‌ను కూడా ఎగవేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నదా? లేదా ఈ వానకాలం నుంచే పరిమిత సన్నాలకు బోనస్ ఇవ్వనున్నదా? ఇవీ ఇటీవల సన్నాల సాగుపై ప్రభుత్వ ప్రకటనలతో రైతుల్లో రేకెత్తుతున్న అనుమానాలు. ఈ వానకాలం నుంచి 8 రకాల సన్నాలనే సాగు చేయాలన్న వ్యవసాయ శాఖ సూచనలు రైతాంగంలో గుబులు పుట్టిస్తున్నది. దీన్నిబట్టి ప్రస్తుతం బోనస్ ఇస్తున్న సన్న ధాన్యం రకాలను కుదించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టుగా తెలుస్తున్నది.ఇందులో భాగంగానే వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, సివిల్ సప్లై అధికారులు, మిల్లర్లతో సమావేశమై సాగు చేయాల్సిన 8 రకాల సన్నాలను వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ వానకాలం నుంచి ఇవే రకాలను సాగు చేయాలని రైతులకు సూచించడంతో పాటు ఈ రకపు విత్తనాలనే మార్కెట్లో అందుబాటులో ఉంచాలని ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సర్కార్ సన్నాల కొనుగోలుకు మంగళం పాడి బోనస్‌కు ఎగనామం పెట్టే దిశగా అడుగులు వేస్తున్నదా? అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ శాఖ ప్రకటనతో రైతుల్లో గందరగోళం నెలకొన్నది. జాబితాలో లేని సన్నాలను సాగుచేస్తే బోనస్ ఇవ్వరా? అనే ప్రశ్నలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. సర్కార్ నుంచి స్పష్టత కొరవడటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నికల ముందు ధాన్యానికి బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత బోనస్‌ను సన్నాలకే పరిమితం చేసింది. ఇప్పుడు ఆ సన్నాల బోనస్‌లో కోత విధించి, క్రమక్రమంగా ఆ పథకం నుంచే తప్పుకొనేందుకు సిద్ధమవుతున్నట్టు అర్థమవుతున్నది.

29 రకాలు ఔట్.. మిగిలింది 8 రకాలే

సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిన కాంగ్రెస్ సర్కార్.. ఈ మేరకు సన్నరకాలను నోటిఫై చేసింది. బోనస్‌కు అర్హమైన మొత్తం 37 రకాలను గుర్తిస్తూ 2024 జులై 4వ తేదీన వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా మళ్లీ సన్నాలపై చర్చ మొదలుపెట్టింది. 37 రకాల సన్నాలకు గాను తాజాగా 8 రకాల సన్నాలనే సాగుచేయాలంటూ వ్యవసాయ శాఖ ప్రకటనలు జారీచేస్తున్నది. దాని సారాంశం గత జాబితాలోని మిగిలిన 29 రకాలను సాగు చేయొద్దని చెప్పడమేనా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అంటే 29 రకాలను జాబితా నుంచి తొలగించేందుకు తెరవెనుక చర్యలు చేపడుతున్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మార్చి 26న ఈ అంశంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. మార్చి 27 నుంచి మే 23 వరకు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, సివిల్ సప్లై అధికారులు, మిల్లర్లతో సమావేశాల అనంతరం రాష్ట్రానికి అనువైన, అధిక దిగుబడిని ఇచ్చే 8 రకాల సన్నాలను గుర్తించనట్టు ప్రకటించిన మంత్రి.. ఆ సన్నరకాలను కూడా ప్రకటించారు. ఈ రకాలను సాగు చేస్తే రైతులకు మార్కెట్లో మంచి ధర లభించే అవకాశం ఉంటుందని, ప్రభుత్వ సూచనలు పాటించాలని రైతులను కోరారు.

తాజాగా సూచించిన 8 రకాల సన్నాలివే

1)BPT5204
2) తెలంగాణ సోన (RNR15048)
3) జైశ్రీరాం
4) KNM1638
5) HMT
6) WGL962
7) WGL44
8) TGC1798

ఆ 29 రకాలకు బోనస్ లేనట్టేనా?

తాజా సూచనల ప్రకారం.. 37 రకాల సన్నాలలో కేవలం 8 రకాలనే సాగు చేయాలంటూ సూచిస్తుండటంతో బోనస్‌పై రైతుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఎనిమిది రకాలకే బోనస్ చెల్లిస్తారా? మిగతా 29 రకాలకు బోనస్ ఇవ్వరా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా మంత్రి సూచించిన ఆ 8 రకాల్లో డబ్ల్యూజీఎల్44, టీజీసీ 1798 రకాలు వ్యవసాయ శాఖ నోటిఫై చేసిన జాబితాలో లేకపోవడం గమనార్హం.

బోనస్ భారం తప్పించుకోవడానికేనా?

'ఏరు దాటేదాక ఓడ మల్లన్న, ఏరు దాటాకా బోడి మల్లన్న' అన్న చందంగా ఉన్నది తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ తీరు. అధికారం కోసం ఎన్నికల్లో అడ్డగోలు, అలవిగానీ హామీలు గుప్పించిన కాంగ్రెస్.. తీరా అధికారంలోకి వచ్చాక వాటి అమలుపై చేతులెత్తేస్తున్నది. మెజారిటీ పథకాల అమల్లో విఫలమైంది. ఇప్పుడు అరకొరగా అమలు చేస్తున్న హామీలను సైతం బంద్ చేసే దిశగా అడుగులు వేస్తున్నది. ఇచ్చే బోనస్ కూడా అరకొరగానే ఇస్తున్నదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత యాసంగికి సంబంధించి 4.09 లక్షల మంది రైతులకు రూ.1,159.64 కోట్లు బకాయి పెట్టింది. ఏడాది గడిచినా వారికి బోనస్ బకాయిలు చెల్లించనేలేదు. మొన్నటి వానకాలానికి సంబంధించి రూ.14.62 కోట్లు బకాయి ఉన్నది. తాజా కొనుగోళ్లలో 5 లక్షల టన్నుల సన్నాలను కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించి రైతులకు రూ.250 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు నయా పైసా చెల్లించలేదు. ఈ చర్యలతో సర్కార్ బోనస్ నుంచి తప్పించుకొని ఆర్థిక భారాన్ని తగ్గించుకొనే ప్రయత్నం చేస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో వ్యవసాయ శాఖ గుర్తించిన సన్నాల జాబితా

1) సిద్ధి (WGL44)
2) కంపాసాగర్ వరి-1(KPS2874)
3) సాంబ మసూరి (BPT5204)
4) జగిత్యాల వారి-3 (JGL27356)
5) జగిత్యాల వారి-2 (JGL28545)
6) వరంగల్ సాంబ (WGL 14)
7) వరంగల్ సన్నాలు (WGL 32100)
8) జగిత్యాల్ మహసూరి (JGL 11470)
9) పొలాస ప్రభ (JGL 384)
10) కృష్ణ (RNR 2458)
11) మానేరు సోనా (JGL 3828)
12) తెలంగాణ సోనా (RNR 15048)
13) వరంగల్ వరి-1119
14) కునారం వరి-2 (KNM 1638)
15) వరంగల్ వేరి-2 (WGL 962)
16)రాజేంద్రనగర్ వేరి-4 (RNR 21278)
17) కునారం వరి-1 (KNM 733)
18) జగిత్యాల సన్నాలు (JGL 1798)
19) జగిత్యాల సాంబ (JGL 3844)
20) కరీంనగర్ సాంబా (JGL 3855)
21) అంజన (JGL 11118)
22) నెల్లూరు మహసూరి (NLR 34449)
23) ప్రత్యుమ్న (JGL 17004)
24) సుగంధ సాంబ(RNR 2465)
25) శోబిని (RNR 2354)
26) సోమనాథ్ (WGL 347)
27) ఆర్ఎన్ఆర్ 31479 (PRC)
28) కేపీఎస్ 6251 (PRC)
29) జేజీఎల్ 33124 (PRC)
30) హెచ్ఎంటీ సోనా
31) మారుటేరు సాంబ (MTU 1224)
32)మారుటేరు మహసూరి (MTU 1262)
33) ఎంటీయూ 1271
34) BPT5204, 35) RNR15048
36) HMT SONA, 37) జైశ్రీరాం



భూపాలపల్లి జిల్లా రేగొండలో రహదారిపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

ప్రభుత్వం మక్కలను కొనాల్సిందే

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్
- హైవేపై బైఠాయించి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసన

రేగొండ, మే 3 : రైతులు పండించిన మక్కలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి రేగొండలోని పరకాల- భూపాలపల్లి ప్రధాన జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ.. ఇప్పటికైనా ప్రభుత్వం మద్దతు ధరకు మక్కలు కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల తరపున బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాడుతామని హెచ్చరించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యం అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని ధ్వజమెత్తారు. ప్రజలు తమ సమస్యలపై స్థానిక ఎమ్మెల్యేను నిలదీస్తే, వారిపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని పేర్కొన్నారు. ప్రజా సమస్యల కంటే ఎమ్మెల్యే తన సొంత ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాడని విమర్శించారు. ఈ నెల 6న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రైతు సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

పదిరలో రోడ్డెక్కిన అన్నదాత



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిరలో కామారెడ్డి-కరీంనగర్ ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న రైతులు

ఎల్లారెడ్డిపేట, మే 3: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిరలో రైతులు రోడ్డెక్కారు. రైస్ మిల్లర్ల సూచన మేరకు కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు తాలు పేరిట అదనపు తూకం వేస్తామని చెప్పడంపై భగ్గుమన్నారు. ఆదివారం గ్రామంలోని కామారెడ్డి-కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. బస్తాకు 40 కిలోల 700 గ్రాములు తూకం వేయాల్సి ఉండగా, జాలిపట్టనందున 42కిలోలకు ఒప్పుకొన్నట్టు తెలిపారు. మొన్నటిదాకా అలాగే తూకం వేశారని చెప్పారు. మరో 500 గ్రాములు అదనంగా తూకానికి అంగీకరించకపోవడంతో కొనుగోళ్లు నిలిపివేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని వాపోయారు. 42 కిలోలు తూకం వేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.



అక్బర్‌పేట-భూంపల్లి హైవే చౌరస్తాపై ఆందోళన చేస్తున్న అన్నదాతలు

గ్రేడ్ల పేరుతో మోసం

తొగుట, మే 3: గ్రేడ్ల పేరుతో అధికారులు తమను మోసం చేస్తున్నారని సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని హైవే చౌరస్తాపై ఆదివారం అన్నదాతలు ఆందోళన చేశారు. దీంతో గంటన్నరపాటు సంగారెడ్డి, సిద్దిపేటకు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. ధర్నాకు బొప్పాపూర్ సర్పంచ్ మాధవనేని భానుప్రసాద్ మద్దతు తెలిపారు.



దామరచర్లలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా, నాయకులు

పంటలు కొనకపోతే రాజీనామా చేయండి

- దళారులకు అమ్ముకునే పరిస్థితిని ప్రభుత్వమే కల్పించింది
- పంటలు కొనేదాకా రైతులతో కలిసి ధర్నా చేస్తాం
- అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు స్పష్టీకరణ

చంద్రుగొండ, మే 3: రైతులు పండించిన పంటలను ప్రభుత్వం బేషరతుగా కొనుగోలు చేయాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి కొనుగోలు కేంద్రాల వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. రైతుల పంటలను కొనే ఉద్దేశం కాంగ్రెస్ పాలకులకు లేకపోతే తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలంలో పర్యటించారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి దామరచర్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించగా, అక్కడున్న రైతులు తమ సమస్యలను విన్నవించారు. వెంటనే ఆయన రైతుల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ అధికారులకు ఫోన్ చేసి కోరారు. అనంతరం కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కొనడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కొర్రీలు లేకుండా పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కొనేదాక సర్కార్‌ను విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు.



ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం గంగారం సొసైటీలోని కొనుగోలు కేంద్రంలో రైతుల ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పంటల కొనుగోలులో సర్కార్ విఫలం


- ఖమ్మంలో ముగ్గురు మంత్రులున్నా ఒరిగిందేమీ లేదు
- సాక్షాత్తు డిప్యూటీ సీఎం నియోజకవర్గంలోనే కర్షకుల కన్నీరు
- సర్కార్ తీరుపై సీపీఎం నాయకుల మండిపాటు
- ఖమ్మం జిల్లా బోనకల్లు, సత్తుపల్లిలో కేంద్రాల పరిశీలన

బోనకల్లు/సత్తుపల్లి టౌన్, మే 3: అన్నదాతలు పండించిన పంటలను కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం నాయకులు, తెలంగాణ రైతు సంఘం నాయకులు విమర్శించారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా రైతులకు ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టారు. సాక్షాత్తు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గంలోనే రైతులు కన్నీరు పెట్టుకుంటే.. రాష్ట్రంలోని రైతుల పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉందోనని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా బోనకల్లు, సత్తుపల్లి మండలాల్లోని మక్క, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా నాయకుడు జాజిరి శ్రీనివాస్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు తదితరులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలు ఉన్నా మక్కలు, ధాన్యాన్ని కొనేందుకు ప్రభుత్వం కొర్రీలు పెడుతున్నదని విమర్శించారు. గన్నీ బ్యాగుల కొరత ఉన్నదని, తామే సొంతంగా కొనుక్కుంటున్నామని, లారీల కిరాయిలు కూడా తామే చెల్లించుకుంటున్నామని రైతులు చెప్తుండటం బాధాకరమని అన్నారు. లారీ డ్రైవర్లు బస్తాకు రూ.40 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

ధాన్యం ఇచ్చి.. మిల్లులను బతికించండి

ప్రభుత్వానికి రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): డిఫాల్ట్ జాబితాలో ఉన్న రైస్ మిల్లులకు పలు సడలింపులు ఇచ్చి, ధాన్యం(సీఎమ్మార్) కేటాయించి మిల్లులను బతికించాలని రాష్ట్ర రా రైస్ మిల్లర్స్ యాజమాన్యాల అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 400 మిల్లుల వరకు 100శాతం సీఎమ్మార్ సరఫరా పూర్తి చేశాయని, అయితే 25 శాతం పెనాల్టీ, 12శాతం వడ్డీ చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ మిల్లులకు పెనాల్టీ, వడ్డీ రద్దు చేసి సీఎమ్మార్ కేటాయించాలని కోరారు. ఈ మేరకు సోమవారం జరిగే క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. లేనిపక్షంలో ఈ మిల్లులు మూతపడటం ఖాయమని, వాటి యాజమాన్యాలు, వాటిలోని ఉద్యోగులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి అయిందని, ఈ మిల్లులకు ధాన్యం కేటాయిస్తే రైతుల సమస్యలు, కొనుగోళ్ల సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. బడాబాబుల మిల్లులు మినహా మిగిలిన 90శాతం రైస్‌మిల్ ఇండస్ట్రీ కష్టాలు, నష్టాల్లోనే ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.



సర్వర్‌ను సరిచేసి మక్క కొనుగోళ్ల ప్రక్రియను చేపట్టాలని ఖమ్మం జిల్లా వైరా మక్కల కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

ప్రభుత్వమే సర్వర్ డౌన్ చేసింది

- మక్కల కొనుగోళ్లకు ఆటంకం కల్పిస్తున్నది: రైతు సంఘం
- వైరాలో అన్నదాతల నిరసన

వైరా టౌన్, మే 3: ప్రభుత్వం సర్వర్ డౌన్ చేయడంతోనే మక్కల కొనుగోళ్లు నిలిచిపోయిందని రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వైరా మండల కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు ఆరోపించారు. శని, ఆదివారాల్లో సర్వర్ డౌన్ కావడంతో ఖమ్మం జిల్లాలో మక్క రైతుల వివరాలు, ఎగుమతి కేంద్రాల వివరాలు, దిగుమతి చేయాల్సి గోదాముల వివరాలు, బస్తాలు లోడ్ చేసిన లారీల వివరాలు కన్పించడం లేదని అన్నారు. అనంతరం వైరాలో కొనుగోలు కేంద్రంలో రైతులతో కలిసి ఆందోళనకు దిగారు. సర్వర్ డౌన్ వల్ల రైతులు సతమతమవుతున్నారని, మక్కల కొనుగోళ్లు, తరలింపు, దిగుమతి ప్రక్రియకు ఆటంకం కలుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.

రైతులు మళ్లా ఆగమైండ్రు!

మొదటిపేజీ తరువాయి...

కేసీఆర్ ఈ నెల 6న వరంగల్‌లో జరుగనున్న రైతు సదస్సుపై వాకబు చేశారు. 'రైతులు మళ్లా ఆగమైండ్రు. రెండున్నరేండ్లలోనే కాంగ్రెసోళ్లు వ్యవసాయాన్ని అతలాకుతలం చేసిండ్రు.. వ్యవసాయంలో దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలిపినం. రైతు బిడ్డ అంటే పిల్లనిచ్చే పరిస్థితి తెచ్చినం. కథ మళ్లా మొదటికి వచ్చింది. ఈ నెల 6న జరిగే రైతు సదస్సుకు రైతులు భారీగా తరలేలా చూడండి. రైతులతోనే మాట్లాడించండి' అని కేసీఆర్ సూచించినట్టు ఎర్రబెల్లి తెలిపారు. రైతులు కాంగ్రెస్ పార్టీకి ఓటేసినందుకు పశ్చాత్తాప పడుతున్నారని, ఒక్క రైతులే కాక, అన్ని వర్గాల ప్రజలు రేవంత్‌రెడ్డి మాటలకు మోసపోయామని వాపోతున్నారని కేసీఆర్‌కు వివరించినట్టు చెప్పారు. ప్రస్తుతం నడుస్తున్న ధాన్యం, మక్కల కొనుగోలు కేంద్రాల పరిస్థితిపై వివరించినట్టు తెలిపారు. బస్తాలు, హమాలీ, లారీ కిరాయి అన్నీ మక్క రైతుల మీదనే వేస్తున్నారని చెప్పారు. 'కేసీఆర్‌ను ఓడగొట్టి ఆగమవుతున్నం.. అరిగోస పడుతున్నం' అని ఎక్కడికి వెళ్లినా రైతులు మొత్తుకుంటున్నట్టు కేసీఆర్‌కు వివరించానని తెలిపారు.

రైతుల ఆగ్రహానికి నువ్వే కారణం

- మార్క్‌ఫెడ్ అధికారిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే రంకెలు
- మనస్తాపంతో తప్పుకొన్న అధికారి!
- వేరే జిల్లా అధికారికి బాధ్యతలు?
- వరంగల్ జిల్లాలో ఘటన

వరంగల్, మే 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ సర్కార్ వైఫల్యం.. ఆపై ప్రజాప్రతినిధుల నోటిదురుసు అధికారులకు శాపంగా మారుతున్నది. క్షేత్రస్థాయిలో సమస్య వచ్చినప్పుడు, ప్రజల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురైనప్పుడు, తమ తప్పును కప్పిపుచ్చుకొనేందుకు ఏం చేయాలో తోచక ముఖ్యమంత్రి, మంత్రుల నుంచి ఎమ్మెల్యేల దాకా ప్రతి ఒక్కరూ అధికారులపై విరుచుకుపడటం సర్వసాధారణం అయిందని అధికారులు వాపోతున్నారు. యాసంగి ధాన్యం ప్రత్యేకించి మక్కల కొనుగోళ్ల విషయంలో రేవంత్ సర్కార్‌ది మొదటి నుంచీ ముందుచూపు లేనితనంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకించి వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు అరిగోస పడుతున్నారు. సీజన్ ప్రారంభానికి ముందే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాల్సిన సర్కార్ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించింది. కొనుగోలు కేంద్రాలకు రైతులు తమ పంట దిగుబడిని తీసుకొచ్చేదాకా పట్టనట్టు వ్యవహరించిన ప్రభుత్వం గత నెల తొలివారంలో రాష్ట్రవ్యాప్తంగా 13 మంది మార్క్‌ఫెడ్ డీఎంలను బదిలీ చేసింది. సకల ఏర్పాట్లు చేస్తున్నామనే సంకేతాలిచ్చి తద్వారా ప్రచారం చేసుకోవడానికి మాత్రం బదిలీలు చేసింది కానీ, కొనుగోలు కేంద్రాలు, గోదాముల్లో పంటలను కాంటా పెట్టేందుకు, ఎగుమతి, దిగుమతి చేసుకునేందుకు అతిముఖ్యమైన హమాలీలు, అవసరమైన గన్నీ సంచులను సమకూర్చుకోలేదు. క్షేత్రస్థాయిలో ఇలాంటి మౌలిక అంశాల మూలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం వీటిపై దృష్టిసారించాలని వారం క్రితం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఓ జిల్లాస్థాయి అధికారి ప్రజాప్రతినిధులతో మొరపెట్టుకున్నారని తెలిసింది. ఈ సమీక్షా సమావేశమైన రెండు రోజులకు వరంగల్ జిల్లాకు చెం దిన ఒక ప్రజాప్రతినిధి 'నా నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు నాపై తీవ్ర ఆగ్రహంతో ఉండటానికి కారణం నువ్వే!' అంటూ మార్క్‌ఫెడ్ అధికారిపై నోరుపారేసుకున్నారని, దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సదరు అధికారి తాను పనిచేయలేనని తన ఉన్నతాధికారికి తెగేసిచెప్పినట్టు సమాచారం. దీంతో వేరే జిల్లాకు చెందిన అధికారికి కొనుగోళ్ల అదనపు బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది.

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి...
editpage@ntnews.com



ఇంటి పట్టునే..

కడప లోపటే కదిలే ప్రపంచం
ఇంటి వైశాల్యంలోనే విహారం

మనసైతే గాలిలోనే తిరిగొస్తది
మాటాముచ్చటా ఫోనే చేపిస్తది
మనిషి మాత్రం కదలని మెదలని గుట్ట

కాలుకు ఆయి అయితేనేమి!
ఆహార జీవప్రక్రియకు నో విరామం
రొటీన్ నుంచి మరింత బలవర్ధకం
ప్రేమ మరింత చిగురులు వేసి
చాలు చాలునన్నా కావలసినవన్నీ
బల్మీటికి డైనింగ్ టేబుల్‌ను ఆవరిస్తాయి

పాదం కోలుకునేలోపు
నెమ్మదిగా ఎల్‌బో స్టిక్‌తో అడుగులు
మనసు ఆగమైనా ఆగని కృత్యాలు

కుర్చీలో కూర్చునే చల్లని స్నానం
మగ్గు మగ్గు పోసుకున్నకొద్దీ అల్కగ
స్టూల్ మీంచే దంతధావనం
సింక్‌లోనే చిన్నగ ముఖప్రక్షాళనం
మితిమీరుతున్నదా ఈ గావురం

ఇస్త్రీ వస్త్రాలకు సెలవులే
లుంగీ అంగీలు ఆ అరలోనే ఓరకు
దినాం షార్ట్ స్తోనే గడిచే కాలం

పలకరింపు పలుకుల లేపనాలకు
సగం గాయం మటుమాయం

ఎముక వికలమైతే ఇల్లే ప్రపంచం
ఎక్కువ సమయం హాలపురం
అప్పుడప్పుడూ కిచెన్ పుర
మధ్యమధ్యలో వాషింగ్టన్
రాత్రి కాగానే బెడ్‌రూమ్ హిల్స్


నాలుగు వారాలదాకా
నాకు గృహమే కదా మహానగరం



అన్నవరం దేవేందర్
9440763479

విశిష్ట కావ్య నాయిక... సినారె లకుమ

> పౌరాణికంలో కాళిదాసు ఊర్వశీ ఆధునికంలో రవీంద్రుని ఊర్వశీ అరవిందుని ఊర్వశీ, కృష్ణశాస్త్రి ఊర్వశీ విశిష్ట నాయికలుగా కనిపిస్తారు. అట్లాగే తెలుగులో విశ్వనాథ కిన్నెరసాని రాయప్రోలు నష్టనమల నాయని వత్సల నండూరి ఎంకి సి. నారాయణరెడ్డి లకుమ.



సినారె లకుమ కర్పూర వసంతరాయలు కావ్యం లోనిది. ఇదొక కథా కావ్యం. ఈ కావ్యం ఆయన 1957లో రాశారు. ఇందులో ముఖ్యపాత్ర లకుమ. లకుమ తెలుగు సాహిత్యంలో విలక్షణమైన కావ్యనాయిక. ఇది చారిత్రాత్మకమైన పరిస్థితుల నేపథ్యంలో రాసిన కాల్పనిక గాథ. కథాకావ్యాలు రాయడంలో అందెవేసిన చెయ్యిగా పేరొందిన సినారె చారిత్రక కావ్యాలకు గుర్తింపును, ఉదాత్తతను సమకూర్చారు. ఈ కావ్యంలోని పాత్రలను ఆయన సృష్టించటమే కాకుండా చక్కని సన్నివేశాలను కల్పించి, కల్పనల ద్వారా, కథనం ద్వారా వాటికి ప్రాణం పోశారు. కవితాత్మకతతో శక్తివంతం చేశారు. దానికి తోడు ఉపమలు, ఉత్రేక్షలు, వ్యంజనలు, ధ్వని ఈ కావ్యానికి సొగసులను ఇనుమడింపజేశాయి. ఈ చారిత్రక కావ్యానికి శృంగారం, కరుణ, వీరరసాలను రంగరించి రసిక హృదయాల ముందు ఆవిష్కరించారు. వీటన్నిటి సమాహారమే కర్పూర వసంతరాయలు అనే కావ్యం. అడుగడుగునా నూతన పదబంధాలు, గారవించే భావ సుగంధాలు ఈ కావ్యానికి ప్రత్యేకమైన ఆభరణాలు.

కర్పూర వసంతరాయలు అనే బిరుదు కొండవీటి కుమారగిరిరెడ్డికి ఉండేది. రెండవ ఆశ్వాసంలో లకుమ, వసంతరాయలు.. ఇద్దరి విరహావస్థను కవి విశేషమైన రీతిలో అభివర్ణించారు. రాజు ఇచ్చిన రత్నహారాన్ని లకుమ కలలో పాములా అనుకుని భయపడిన ఘట్టాన్ని కవి చక్కగా మలిచారు. ఈ కథనానికి కొంతవరకు ప్రబంధ శైలితో పోలికలు ఉన్నమాట వాస్తవమే. కానీ భాష లలితమై, సరళమైన కలకండ తీపిని తెలుగుకు అద్దాయి, పద్యాల నడకలో వయ్యారం కనిపిస్తుంది.

లకుమ, ఆమె లావణ్యం, ఆమె నాట్యం చూసి రాజు ఎదలో ప్రేమ అంకురిస్తుంది. అది కాలక్రమంలో వటవృక్షమై అతనిని నిదురపోనీయకుండా చేస్తుంది. రాజుకు, నాట్యగత్తెతో ప్రేమ అనే భావనే వినూత్నమైనది.

వెండి గజ్జల రవళియే
కవ్వించునా నన్నింతగా?
గుండె గజ్జలలోన చొరబడి
యుండెనేమో వింతగా
అని తనలో తాను వాపోయాడు..

ఆటవెలదుల ఇంటి పడుచే
నాటికైనను కాదు లకుమ
శప్తయై దివి నుండి భువిపై
జారి వచ్చిన అచ్చర సుమ

విరహావస్థలో పాన్పుపై చల్లిన పువ్వులు ముళ్లుగా తోస్తున్నవి. సవాలక్ష ఊహలు వస్తున్నవి. ప్రకృతిలో అన్నీ హాయిగా నిద్రపోతున్నవి. ఈ సంగతి కవి చూసి ఈ విధంగా రాశాడు.

నేల నిదురవోయె
నింగి నిదురవోయె
గాలి నిదురవోయె రేడో
కందె అదిరిపోయె

ఒక్క రాజే అదిరిపోయి, నిప్పుల లాంటి పాన్పు మీద పొరలుతూ ఉంటాడు. మరి అక్కడ లకుమ అవస్థ అట్లాగే ఉంటుంది.

ఇచట రాజునుబోలె లకుమయు
అచట వెర్రిగ పొరలె పాన్పున
ఆమెకు అదే అర్ధరాతిరి
అదే తారలు, అదే జాబిలి

ఆమె వింతగా కలగంటుంది. తాను రాధగా, వసంతరాయలు వేణుగోపాలుడిగా, తర్వాత తన శరీరానికి అలంకరణమైన నాగమణి పాములా బుసకొట్టింది. ఆమె కెవ్వున కేకవేసి లేచి చూసుకున్నది.



కె. ప్రభాకర్

కన్నులు విప్పెను లకుమ
ప్రకంప్యమాన మానసయై
దిక్కులు చూచెను లకుమ,
అతిస్విన్న శరీరకయై

నృత్యము సాగగా, సాగగా, రాజు తన్మయుడవుతాడు. చిన్మయుడవుతాడు. అతని ప్రాణాలు ఆమెయందే లగ్నమవటం వలన, అతను ఆనందపరవశుడై ఆసీనం నుంచి లేచే సమయం చూసి, రాణి అతనిని మర్యాద పాటించమని ఆపుతుంది. మహారాజు ఆమె నా ట్య కౌశల్యాన్ని మెచ్చుకొని మెడలోని రత్నాల హారాన్ని లకుమ మెడలో వేస్తాడు. దండతో పాటు అతని చేతులు కూడా ఒక్క క్షణం దండలా అమరు తాయి ఆమె కంఠసీమలో. ఇది రఘువంశంలో అజ మహారాజు మెడలో ఇందుమతి మాల వేసినప్పుడు దృశ్యంలా అగుపిస్తుంది. ప్రజల హర్షధ్వానాలు ఆకాశాన్ని అంటుతాయి. అప్పుడు..

సిగ్గుతో తలవాల్చి
ముగ్ధయయ్యెను లకుమ
ఆమె కన్నులు మూసుకుని
హృదయమును మూయగ
లేక యేడ్చెను

ఆమె జాలి గుండె. తొణకని కుండ. గుండె భారాన్ని దించటానికి కడుపు చెరువు చేసుకున్నది. అంతర్మథనంతో నలిగిపోతున్నది. ఎటూ పాలుపోని స్థితి తనది. అప్పుడు గద్గద స్వరంతో ఇలా అన్నది..

ఎటుల వాగ్దానమ్ము తీర్తును
ఎటుల రాయని వీడ నేర్తును
ఎందుకీ
హృదయమ్మునిచ్చితి
వీశ్వరా! ఈ సానిదానికి.

బంధాలు, అనుబంధాలతో నలిగిన వారిద్దరి ప్రేమను ఎంతో అందంగా చిత్రిస్తాడు కవి.

లకుమయే రాణ్మాళి
బ్రతుకునావను నడుపు చుక్కాని అంటూ
మరో ఉపమానం వేస్తాడు కవి.

> ఆమె కన్నులు విరిసినంతనే
> అతడు పగలనుకొనును
> ఆమె కన్నులు మోడ్చినపుడే
> రాతిరి యయ్యెననుకొనును

కొండవీటి ప్రభువైన వసంతరాయలు తమ పరస్పర ప్రేమ జీవితాన్ని ఆరని కర్పూరజ్యోతిగా వెలిగించాడు. కాబట్టి కర్పూర వసంతరాయలు తనువు, ఆత్మ, సర్వమూ ఆమెలో లీనమైపోయాయి. పంచభూతాత్మకమైన నిఖిల సృష్టికి లకుమనే ప్రతీక గావించాడు. పృథ్వీ ఆమె కటిచక్రము, జలమాయె కంటిపాపల లోతులు, తేజము ఆమె ముఖరాజీవము, వాయుగతి ఆమె నిశ్వాసాలు, ఆకాశము మధ్యము. అతని దృష్టి, ఆమె ముఖము కురమ్ములో తన మోము సరిచూసుకునేవాడట. ఆమె కనుపాపల్లో కురులు దిద్దుకొనేవాడట.

నేను పునర్జన్మమెత్తితేని
ప్రభూ! రసికతామహాలయమౌ
మీ యువ హృదయముగా
జన్మింతుగాత!

సౌందర్యాన్వేషకులకు రమణీయమైన వాతావరణాన్ని సృష్టించి, తన దంటూ ఒకానొక మార్గంలో పరిమళభరితమైన పువ్వుల వాటికలో మృదుమధురమైన సంభాషణ చాతుర్యంతో వసంతరాయ స్వప్నసీమకు తీసుకెళ్లి, కల్పనలతో, చిత్రవిచిత్ర దృశ్యాలను ఆవిష్కరిస్తాడు. శబ్ద మాధుర్యంతో లయను సమకూరుస్తాడు. పరమాద్భుతమైన రీతిలో ఈ కథాకావ్యాన్ని నడిపించి అపురూపమైన రీతిలో మనకు అందించారు సినారె.



శిథిలం

నడిచొచ్చిన మెట్లను
మరిచిపోయాక
మెట్లు కట్టిన చేతులెవరికి
గుర్తుంటాయి
మొదటి మెట్టు శిథిలావస్థను
పట్టించుకునే పాదాలెక్కడివి?

చేసిన ప్రయాణం చేతికి చేరాక
బాటను తొలిచిన
చేతులెవరిక్కావాలి

చేరాల్సిన తీరం చేరిపోయాక
ఈత నేర్పిన చేతులనెవరు చూస్తారు?

కొండలూ కోనలూ దాటి
గూడు చేరాక
పల్లకీమోసిన వ్యక్తులెవరికి
గుర్తుంటారు?

ఇవాళ
నదిని దాటాక
తెప్పను తగలేయటమే
బతుకుదెరువు సూత్రం

నీ గాయాలను చూసే
ఓపికా తీరికా ఎవడికీ లేదు
నీ కన్నీళ్లను ఒడకట్టే
సమయమెవడికీ లేదు

ఎండుటాకులా నిన్ను
తొక్కుకుంటూ పోవటమే నీతి
నువ్వు సృష్టించి ఇచ్చిన వసంతాలు
ఎవడికి గుర్తుంటాయి

నువ్విప్పుడొక పక్షులెగిరిపోయిన చెట్టువి
నువ్వు రెట్ట వేయటానికి
కూడా పనికిరానితొలిమెట్టువి
నిన్ను శిథిలం చేస్తూ
మరిన్ని మెట్లు
నిర్మించుకుంటూ పోవటమే
నీతో ఉన్న స్వార్థపరుల లక్ష్యమిప్పుడు



చిత్తలూరి
9133832246



'కొన్ని మాకు ఇయ్యండి'

సారు కొన్ని నవ్వులు
మా గుడిసెలకు కూడా ఇయ్యండి
ఎంతకాలం ఈ చీకట్లో బతుకమంటారు
ఎన్నో ఏండ్ల నుంచి దుఃఖపు నీళ్లలో
తడుస్తూ ఉన్నాము
బీదరికపు ముళ్లతో సావాసం చేస్తున్నాము
ఆకలి నీడలో ముదురుకుంటున్నాము
ఎంత దులిపినా, ఎంత కష్టంతో కడిగినా
వీడని మరకలా అంటుకునే ఉన్నాయి
సావో రేవో తేల్చుకున్న తెగిపోతలేవు
మీరే దయవుంచి కొన్ని నవ్వులు
మా దోసిళ్లలో వెయ్యండి సార్
మీ బొమ్మలను మా పూరిగుడిసెలో
పెట్టుకుంటాము



గుండెల్లి ఇస్తారి
9849983874

అమృతలత-అపురూప అవార్డ్స్ ప్రదానోత్సవం

హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి యూనివర్సిటీలో ఈనెల 10వ తేదీ సాయంత్రం నాలుగున్నర గంటలకు 'అమృతలత-అపురూప అవార్డ్స్' ప్రదానోత్సవం జరుగుతుందని అవార్డ్స్ కన్వీనర్ నెల్లుట్ల రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్జ్యూమర్ డిస్ప్యూట్స్ రీడ్రెసెల్ కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ జి.సుధారాణి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ప్రముఖ శాస్త్రీయ నృత్యకారిణి, సినీనటి మంజు భార్గవి విశిష్ట అతిథిగా పాల్గొంటారని తెలిపారు. లలిత సంగీతం విభాగంలో డాక్టర్ హైమావతి భీమన్న, నవలా రచన విభాగంలో డాక్టర్ పెళ్లకూరు జయప్రద, శాస్త్రీయ సంగీతం విభాగంలో బుర్రా వరహాలు అమృతలత జీవన సాఫల్య పురస్కారాలను అందుకుంటారని తెలిపారు.

17న 'నారీ మధుతారకలు' నానీల సంపుటి ఆవిష్కరణ

బండ్ల తారకేష్ రచించిన 'నారీ మధుతారకలు' నానీల కవితా సంపుటి ఆవిష్కరణ సభ ఈనెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతిలో జరుగుతుందని కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ అధినేత మద్దాళి రఘురాం తెలిపారు. డాక్టర్ ఎన్.రఘు అధ్యక్షత వహించే ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్.గోపి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. సజ్జా వెంకటేశ్వర్లు, కుడికాల వంశీధర్, డాక్టర్ గిన్నారపు ఆదినారాయణ ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.



రుధిరం నుంచి క్షీరం దాకా..
కవిత్వతత్త్వ విచారణ

> సాహిత్యం సమాజానికి దారిదీపంగా ఉండాలి అనే భావనతో పుట్టిన కవిత్వమే చిరస్థాయిగా నిలుస్తుంది. పురుషార్థ సాధనకు ప్రేరణనిచ్చే ప్రబోధాత్మకత సాహిత్య లక్షణం. రసభరితమైన వాక్యనిర్మాణం ద్వారా భావాలను లోతుగా వ్యక్తీకరించగలిగినవారే నిజమైన కవులు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు జీవితాంతం తపస్సు చేసిన వారిలో మృదుల కవిత్వం ప్రత్యేక స్థానం పొందింది.

'ఏకం సత్ విప్రా బహుధా వదంతి' అనే సూత్రం ప్రకారం..మనిషి బాహ్యంగా భిన్నంగా కనిపించినా అంతర్గతంగా ఒకే భావాన్ని అనుసరిస్తాడు. మృదుల తన చుట్టూ ఉన్న అలంకారాలను తొలగించి ఆత్మవివేచనతో నిజాన్ని కవిత్వంగా మలిచారు. ఆమె రుధిరం నుంచి క్షీరం దాకా కవితా సంపుటిలో ఆలోచన, ఆర్తి, ప్రయత్నం సమన్వయంగా ప్రతిఫలిస్తాయి. ప్రతి కవిత జీవన ప్రతిబింబంలా నిలుస్తూ ఆశావాదాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ కవిత్వం కాలక్షేపానికి కాదు; తాత్వికత, తార్కికత, భావుకతల సమ్మేళనంగా సమాజానికి ఉపయోగకరంగా ఉంటుంది. స్త్రీల అస్తిత్వాన్ని చాటుతూ, సమాజంలోని అసమానతలను ప్రశ్నిస్తూ నిర్భయంగా అభివ్యక్తమవుతుంది. 'బోగన్ విలియాలు' వంటి కవితల్లో అనుభూతుల సుగంధం, బాధల సత్యం స్పష్టంగా కనిపిస్తాయి.

మృదుల శైలి సరళమైనదైనా భావగంభీరతతో నిండి ఉంటుంది. ఆమె కవిత్వం స్త్రీ-పురుష అసమానతలను విమర్శిస్తూ, సమానత్వాన్ని ప్రబోధిస్తుంది. సేవ, త్యాగానికి ప్రతీకలైన స్త్రీల బాధను వ్యక్తపరుస్తూ సమాజాన్ని ప్రశ్నిస్తుంది. మొత్తంగా, రుధిరం నుంచి క్షీరం దాకా కవితా సంపుటి ఆశ నుంచి నిరాశకు, ప్రతికూలత నుంచి సానుకూలతకు జరిగిన ఒక ఆత్మయానం. ఇది కేవలం కవిత్వం కాదు; జీవన సత్యాలను ప్రతిబింబించే ఒక తాత్విక దర్శనం.



కోడోజు కృష్ణమూర్తి

తొలినాటి సంద్రాలు

> కథాసాహితి భారతీయ భాషలకు అంత అపరిచితమైందేం కాదని ఇంతకుముందోసారి అనుకున్న మాటేగా! మన దేశంలో నాలుగైదు వేల సంవత్సరాలుగా కావ్యేతిహాసాలు, మహాకావ్యాలు, కథాకావ్యాలు, అనగనగా కథలూ, పేదరాశి పెద్దమ్మ కథలూ, పుక్కిట పురాణాల్లాంటి సాహిత్య రూపాలు విస్తృతంగా ఉండేవి.

సామాన్య శకానికి పూర్వం 24 వందల సంవత్సరాల కిందట కూడా కథన రూపాలు అస్తిత్వంలో ఉన్నాయంటారు. ఎటొచ్చీ, ఇప్పుడు మనకు తెలిసిన కథానికలు వేరు- ఆనాటి కథనాలు వేరు! సామాన్యశకం తర్వాత సాహిత్య చరిత్రలు అరకొరగానైనా లెక్కతేలిన తర్వాత, తెలుగు కథా కావ్యాకాశంలో, రవ్వల్లా తళుక్కున మెరిసే రచనలూ కొన్ని పుట్టుకొచ్చాయి. తాము తిక్కనకు ప్రత్యక్ష శిష్యులమని చెప్పుకున్న పదమూడో శతాబ్దినాటి మూలఘటిక కేతన, మారనవారి సమకాలికుడే అయిన మంచన తదితరులు కథాకావ్యాలు రాసిన వారిలో ప్రముఖులు. మరో రెండు శతాబ్దాల నాటివాడైన జక్కన 'విక్రమార్క చరితం' కూడా కథాకావ్యమే. ఆ మాటకొస్తే శ్రీనాథుడి 'శృంగార నైషధం' మొదలుకుని ప్రబంధాలన్నీ కథాకావ్యాలే! అయితే వాటిల్లో కథకు చిన్న పీట వేసి, కవిత్వకళకే పెద్దపీట వేశారు మనవాళ్లు.


> అటు పడమటి ప్రపంచంలోనూ అదే 'కథ'. పదమూడు, పద్నాలుగు శతాబ్దాల నాటి 'రాబిన్‌హుడ్', 'విలియమ్ టెల్' కథలూ, పదహారో శతాబ్దినాటి దక్షిణ యూరోపియన్ మట్టివాసనలతో గుబాళించే పికారెస్క్యూ కథలూ, తమిళంలో మళైకళ్ళన్ (కొండ దొంగ) కథలూ, తెలుగులో 'ఆకాశరామన్న' కథలూ, హిందీలో 'సుల్తాన్ డాకూ' కథలూ అలాంటి తారలే!

ఇక, కాశీమజిలీ కథలు సరేసరే! వాటి గొప్పతనాన్ని గౌరవిస్తూనే ఓ నిష్ఠుర సత్యం చెప్పుకోక తప్పదు. ఆధునిక కథానిక రూపురేఖలు తీర్చిదిద్దడంలో ఈ కథాకావ్యాల పాత్ర దాదాపు శూన్యం. కథానిక వస్తురూపాలూ, శిల్పంలో నగిషీలు మొనతేరడంలో ప్రధానపాత్ర పోషించిన ఇతర ప్రక్రియల విషయానికి వస్తే, నూరేళ్ల కిందట నిర్దిష్ట రూపం తీసుకున్న చిన్నకథ, పెద్దకథ తదితరాలను ప్రస్తావించాల్సి ఉంటుంది. అయితే ఈ సాహిత్య ప్రక్రియల విషయంలో గందరగోళానికి ముఖ్యకారణం నామకరణంలో చోటుచేసుకున్న చిందరవందరలే. ఉదాహరణకి, చిన్నకథలుగా ప్రసిద్ధమైన కళాఖండాల్లో ఎక్కువ భాగం కథానికలు కావు-'వడ్లగింజలు', 'మార్గదర్శి', 'బ్రాహ్మణాగ్రహారం' లాంటివైతే పేరుకు మాత్రమే చిన్నకథలు!

పందొమ్మిదో శతాబ్ది చివర్లో వచ్చిన 'తెలుగు జనానా', 'హిందూ సుందరి', ఇరవయ్యో శతాబ్ది మొదట్లో వచ్చిన 'ఆంధ్రభారతి' లాంటి పత్రికల్లో అచ్చయిన కథానికలు, కథాకావ్యాలు ఈ క్రమాన్ని పైమెట్టుకు చేర్చాయి! 1947కు ముందే, ఇలాంటివి ఇరవయ్యొక్క పత్రికలు ఉండేవని పరిశోధకులు లెక్క తేల్చారు. ఆ పత్రికలూ, వాటిల్లో వచ్చిన రచనలూ కథానిక ప్రక్రియను తీర్చిదిద్దిన వాచకాల్లాంటివి. అలాంటి పత్రికల్లోనే భండారు అచ్చమాంబ కథలు దాదాపు డజను వరకూ, గురజాడ కథానికలు కనీసం రెండు అచ్చయ్యాయి. 1910లోనే కొమర్రాజు వెంకట లక్ష్మణరావు-క. రామానుజరావు అనే కలం పేరుతో-రాసిన కథానిక 'ఎద్దుల బేరం' కూడా అచ్చయింది. 'ఆంధ్రభారతి'లోనే మాడపాటి హనుమంతరావు రాసిన అనువాద కథానిక 'హృదయశల్యము' 1912లో అచ్చయింది. 'ఆంధ్రుల సాంఘికచరిత్ర'మనే చారిత్రాత్మక చరిత్ర గ్రంథాన్ని రాసిన సురవరం ప్రతాపరెడ్డి 'మొగలాయీ కథలు', 'వింత విడాకులు' లాంటి కథానికలు రాసిన సంగతి చదువుకున్న వారికి చాలామందికి తెలుసు. హిందూ స్త్రీ పునర్వివాహం విషయంలో-చట్టవిరుద్ధం కాని పద్ధతిలో- కమలమ్మ అనే క్లయింట్‌ను ఓ న్యాయవాది ఎలా చమత్కారంగా గట్టెక్కించాడో చెప్పిన కథానిక 'వింతవిడాకులు' స్వయంగా న్యాయవాదయిన ప్రతాపరెడ్డికి చట్టాల అంతరార్థాలకు ఎలా భాష్యం చెప్పాలో బాగా తెలియడంలో వింతేముంది?! 1922లో తాము మొదలుపెట్టిన సాహిత్యపత్రికలో, ఒద్దిరాజు సోదరులు (సీతారామచంద్రరావు, రాఘవరంగారావు) కనీసం మూడు కథానికలు ('రక్తమూల్యము', 'అదృశ్య వ్యక్తి', 'నటి' రాసినట్లు) తెలుస్తోంది. ఎటొచ్చీ, ఈ కథానికలకు అప్పట్లో ఆ 'పేరు' వాడుకలో లేదు! మాటలకు అర్థాలు, ధ్వన్యాశ్రయాలు కావు-అవి భావాలను ఆశ్రయించుకుని ఉంటాయంటారు పెద్దలు.

> తొలితరం తెలుగు సాహిత్య పత్రికల సంపాదకుల్లో వీరేశలింగం స్ఫూర్తిగా కలంపట్టిన వెంకటశివుడు ఆ కాలంలోనే ఆంగ్లంలో ఎమ్మే చేసి అధ్యాపకుడిగా పని చేసినవారు. భండారు అచ్చమాంబ కథానికలను తొలిసారి అచ్చువేసి, లోకానికి పరిచయం చేసింది ఆయనే. అచ్చమాంబ తొలి కథలను అచ్చువేసిన మరో పత్రిక 'హిందూ సుందరి'.

ఈ పత్రిక విశిష్టత ఏమిటంటే, నలభైయేళ్లు నడిచిన ఈ పత్రిక పేరులోనే ఉన్నట్లుగా పాఠకురాళ్లను ఉద్దేశించి రూపొందింది. దానికి ఎడిటర్లు మొసలికంటి రామాబాయమ్మ-వెంపటి శాంతాబాయమ్మ. చరిత్ర మూలమలుపు తిరిగే ముందు పదిసార్లు ఆలోచిస్తుందేమో కానీ, ఆ తర్వాత దానికి జంకుండదు! అందుకే పులుగుర్త లక్ష్మీనరసమాంబ, వింజమూరి వెంకటరత్నమ్మ, కళ్లేపల్లి వెంకటరమణమ్మ తదితర సంపాదకురాళ్లు ఒకరి వెనుక ఒకరుగా పత్రికా రంగంలోకి ప్రవేశించారు.



కథానిక కమామిషు | 9

గృహిణులు అప్పుడప్పుడే కథానికలూ, వ్యాసాలూ చదవటం మొదలుపెట్టిన యువపాఠకుల కోసం ఉద్దేశించిన పత్రికలకు రూపురేఖలు దిద్దిన ఆ తరం రాయసం, కాశీనాథుని, ముట్నూరి, అయ్యంకి, గాడిచర్ల తదితరుల కృషి గురించి పత్రికలకూ-పుస్తకాలకూ ఎక్కి, చరిత్రగా స్థిరపడింది. అయితే, తెలంగాణ ప్రాంతంలో అలాంటి కృషే చేసిన సురవరం, ఒద్దిరాజు, శబ్నవీసు, వట్టికోట, ఆదిరాజు, బుక్కపట్నం, దేవులపల్లి (రామానుజరావు) తదితరుల కృషి ప్రాచుర్యంలోకి రాలేదు. 1910కి ముందు వెలువడిన 92 తెలుగు కథానికలను రాసిన తొలితరం కథానికల రచయితల జాడ తీసి పుణ్యం కట్టుకున్న పరిశోధక రచయిత వి.వి.న.మూర్తి. బుద్ధిరాజు ఈశ్వరప్ప పంతులు లాంటి విశిష్టమైన రచయిత పేరు 'దిద్దుబాటలు' వల్లనే వెలుగులోకి వచ్చింది. తెలంగాణ ప్రాంతంలో తెలుగు సాహిత్య ప్రస్థానం తీరుతెన్నులను ప్రభావితం చేయడంలో ఒద్దిరాజు సోదరులు లాంటి వాళ్ల కృషిని గ్రంథస్థం చేసిన వాళ్లలో ముఖ్యుడు 'కవిలె' సంగిశెట్టి శ్రీనివాస్. ఇకపై, ఈ పరిశోధన పేర్ల తేదీల వేటగా కాకుండా నిలువుకోత విశ్లేషణగా సాగటం ఈనాటి చారిత్రక అవసరం! ■



మందలపర్తి కిశోర్
81796 91822

సుశ్లోకం




టి.సుధాకరశర్మ

నతత్ర ధనినో యాంతి

శ్లో: వళీపలిత కాయోపి
కర్తవ్యం శృతి సంగ్రహః
నతత్ర ధనినో యాంతి
యత్రయాంతి బహుశ్రుతాః

తా: శరీరము కృశించి తీగవలె మారినను, వెంట్రుకలు నెరిసినను అనగా చాలా వృద్ధుడైనప్పటికిని వేదశాస్త్ర అధ్యయనము చేయుచునే ఉండవలెను. ఎందుకనగా ధనికులు పోలేని చోటికి కూడా శాస్త్రాధ్యయనపరుడు పోగలుగుతాడు.



వాక్యమూ మనమే...

పూలే కాదు
వాక్యాలూ సున్నితంగా ఉంటాయి
చదువుతుంటే మనసుకు మధురంగా
ఇగిరిపోని సుగంధం!

వాక్యాలు చదువుతుంటే కూడా దుఃఖం
పొంగి కంటినిండా తడి తడి పొరలు!!

లోకంలో ఉండే అనుభూతులన్నీ గాఢంగా రాస్తే
వాక్యాలలోనూ ప్రాణమే
హృదయపూర్వకంగా చదివితే
ఓహో! వాక్యమూ మనమేనా అనిపిస్తుంది

అవును! మనం రాసే వాక్యం జీవంగా
మనమయే ఉండాలి మరి!
ప్రపంచమంతా చదివి వాక్యంతో మమేకమే

భేషజం లేని
'ఒక్క తెలంగాణ మాండలిక వాక్యం'
మన తాతముత్తాతలను ప్రత్యక్షం చేస్తుంది
మనం శనార్తులు చెప్పడే ఆలస్యం



కందాళై రాఘవాచార్య
87905 93638

ఆ ఆరుగురు బాధితుల్లో

నేనూ ఉన్నా!

- లైంగిక వేధింపుల కేసుపై రెజ్లర్ వినేష్ ఫోగట్ సంచలన వ్యాఖ్యలు
- బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై మరోసారి తీవ్ర ఆరోపణలు
- డబ్ల్యూఎఫ్ఐ టోర్నమెంట్ల పారదర్శకతపై అనుమానాలు



న్యూఢిల్లీ, మే 3: బీజేపీ మాజీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు నమోదు చేసిన ఆరుగురు మహిళా రెజ్లర్లలో తాను కూడా ఉన్నానని ప్రముఖ రెజ్లర్ వినేష్ ఫోగట్ ఆదివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. బ్రిజ్ భూషణ్‌పై దాఖలైన కేసు విచారణ న్యాయస్థానంలో ఇప్పటికీ కొనసాగుతున్నది. ప్రస్తుతం సాక్ష్యాల నమోదు జరుగుతున్నందున తన ఉనికిని వెల్లడించకూడదని, న్యాయపోరాటం కొనసాగించాలని గతంలో తాను నిర్ణయించుకున్నానని ఆమె తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఏ బాధితురాలి గుర్తింపును వెల్లడించరాదని, అలా చేస్తే వారి గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లుతుందని ఆదివారం సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక వీడియోలో వినేష్ తెలిపారు. కాని కొన్ని పరిస్థితుల కారణంగా తాను అన్ని విషయాలు పంచుకోదలచుకున్నానని ఆమె చెప్పారు. కేసు కోర్టులో ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నందున తాను దానిపై మాట్లాడదలచుకోలేదని, అయితే ఫిర్యాదు చేసిన ఆరుగురు బాధితుల్లో తాను కూడా ఒకరినని చెప్పదలచుకున్నానని, ప్రస్తుతం సాక్ష్యాల నమోదు జరుగుతున్నదని వినేష్ తెలిపారు. బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా 2023లో జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో పాల్గొన్న ప్రధాన వ్యక్తుల్లో వినేష్ ఒకరు. బ్రిజ్ భూషణ్‌కు పలుకుబడి ఉన్న ఉత్తర ప్రదేశ్‌లోని గొండలో ర్యాంకింగ్ టోర్నమెంట్లు, ట్రయల్స్ నిర్వహించాలన్న డబ్ల్యూఎఫ్ఐ ప్రణాళికను దృష్టిలో ఉంచుకుని తాను ఇప్పుడు మాట్లాడుతున్నానని ఆమె చెప్పారు. బ్రిజ్ భూషణ్‌కు చెందిన ఓ ప్రైవేట్ కాలేజీలో ప్రస్తుతం ట్రయల్స్ జరుగుతున్నాయని, ట్రయల్స్ నిష్పాక్షికతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని ఆమె అన్నారు.

ప్రభుత్వానిదే బాధ్యత

గొండలో జరిగే నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ సందర్భంగా తనకు కాని, తన జట్టుకు కాని ఎటువంటి హాని జరిగినా అందుకు భారత ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని వినేష్ హెచ్చరించారు. తాను పోటీలో పాల్గొంటున్న సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురవుతాయోనన్న ఆందోళనను ఆమె వ్యక్తం చేశారు. బ్రిజ్ భూషణ్‌కు సంబంధించిన వేదిక వద్ద ఈ టోర్నమెంట్ జరుగుతున్నదని, ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని 18 నెలల తర్వాత వీడియో సందేశం ద్వారా ప్రజల ముందుకు వచ్చిన వినేష్ అనుమానం వ్యక్తం చేశారు. పోటీ సందర్భంగా మీడియా, క్రీడా సమాజం వేదిక వద్ద ఉండాలని ఆమె కోరారు. "ఆయన(బ్రిజ్) పలుకుబడి బలంగా ఉన్న చోట టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఏ బౌట్‌కు ఎవరు అంపైర్‌గా వ్యవహరిస్తారు. ఎన్ని పాయింట్లు వేస్తారు. మ్యాట్ చైర్మన్‌గా ఎవరు కూర్చుంటారు. వీటన్నిటినీ ఆయన, ఆయన మనుషులు నియంత్రిస్తారు" అని వినేష్ వ్యాఖ్యానించారు.

న్యాయమైన అవకాశం దక్కుతుందా?

తాను తిరిగి శిక్షణ పొందానని, పతకాలు గెలవడానికి పోటీలకు తిరిగి రాదలచానని 31 ఏండ్ల వినేష్ చెప్పారు. అయితే న్యాయమైన అవకాశం దక్కుతుందని తాను కచ్చితంగా చెప్పలేనని ఆమె అన్నారు. తనకు ఎటువంటి ప్రత్యేక సదుపాయాలు లేదా ప్రత్యేక మర్యాదలు అవసరం లేదని, పోటీలో ఉన్న క్రీడాకారుల కష్టానికి తగ్గట్టుగా ఫలితాలు కనిపించాలని మాత్రమే తాను కోరుకుంటున్నట్లు ఆమె చెప్పారు. టోర్నమెంట్‌లో తన సామర్థ్యాన్ని 100 శాతం ప్రదర్శించడంపై ఆమె సందేహం వ్యక్తం చేశారు. టోర్నమెంట్ నిర్వహణ బాధ్యతను పూర్తిగా బ్రిజ్ భూషణ్‌కు అప్పగించి ప్రభుత్వం, క్రీడా శాఖ ప్రేక్షకపాత్ర పోషిస్తున్నాయని ఆమె విమర్శించారు.

అధికారం ఎవరిని వరించేనో!

- బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి కౌంటింగ్ నేడే
- ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లతో లెక్కింపు ప్రారంభం
- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ



న్యూఢిల్లీ, మే 3: టీఎంసీ, డీఎంకే వంటి ప్రాంతీయ పార్టీలతోపాటు బీజేపీ, కాంగ్రెస్, వామపక్షాలకు ఫలితం కీలకంగా మారిన పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అస్సాం, కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం జరగనున్నది. మూడు అంచెల భద్రత వ్యవస్థ కలిగిన లెక్కింపు కేంద్రాల్లో ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల్‌తో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. తొలిసారిగా కౌంటింగ్ కేంద్రాల్లోకి అనధికార ప్రవేశాన్ని నివారించడానికి ఎన్నికల సంఘం ఈసీఐఎన్ఈటీ ద్వారా క్యూర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డు వ్యవస్థను ప్రవేశపెట్టింది. పశ్చిమ బెంగాల్‌లోని 293 అసెంబ్లీ స్థానాలకు 77 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరగనున్నది. ఈసారి ఊహించని రీతిలో భద్రతా ఏర్పాట్లు జరిగాయి. ఫలితాల రోజు వరకు తీవ్ర వాగ్వాదం నెలకొంది. అధికార టీఎంసీ, ప్రతిపక్ష బీజేపీ రెండూ ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశాయి. రెండు దశల్లో జరిగిన పోలింగ్ ఏప్రిల్ 29న ముగిసింది. స్వాతంత్ర్యం అనంతరం మొదటిసారి రికార్డు స్థాయిలో 92.47 శాతం ఓటింగ్ నమోదైంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని ఫల్తా నియోజకవర్గంలో తీవ్రమైన ఎన్నికల ఉల్లంఘనలను కారణంగా చూపుతూ ఎన్నికలను ఎన్నికల కమిషన్ రద్దు చేసింది. ఆ నియోజకవర్గంలోని మొత్తం 285 పోలింగ్ కేంద్రాలలో మే 21న రీపోలింగ్ జరగనున్నది.

బెంగాల్‌లో హోరాహోరీ

ప్రధాన ప్రతిపక్షం బీజేపీ నుంచి బలమైన సవాలును ఎదుర్కొన్న అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) వరుసగా నాలుగోసారి గెలవాలని ఆశిస్తుండగా 2021 ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన సీపీఎం, కాంగ్రెస్ తిరిగి పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. హుమాయున్ కబీర్ నేతృత్వంలోని ఏజేయూపీ, అసదుద్దీన్ ఒవైసీ సారథ్యంలోని ఏఐఎంఐఎం కూడా కొన్ని కీలక ప్రాంతాలలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. ఇదివరకు మొత్తం 87 కౌంటింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ప్రకటించగా అ సంఖ్యను 77కు తగ్గించింది. 2021లో మొత్తం 107 కౌంటింగ్ కేంద్రాలను ఈసీ ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుత కౌంటింగ్ సందర్భంగా బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఈసీ ఏర్పాటు చేసింది. కౌంటింగ్ శాంతియుతంగా, పారదర్శకంగా, క్రమబద్ధంగా జరిగేలా చూసేందుకు సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేశామని ఈసీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. 165 అదనపు కౌంటింగ్ పరిశీలకులను, 77 పోలీసు పరిశీలకులను ఈసీ నియమించింది. రిటర్నింగ్ అధికారులు, పరిశీలకులు మినహా మిగతా వారికి మొబైల్ ఫోన్లను నిషేధించడం సహా లెక్కింపు కేంద్రాల వద్ద కఠినమైన ప్రవేశ నియంత్రణ చర్యలను ఈసీ ప్రవేశపెట్టింది.

అస్సాంలో ఎన్‌డీఏ హ్యాట్రిక్?

అస్సాంలో హ్యాట్రిక్ సాధించగలమని బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ఆశిస్తున్నది. రాష్ట్రంలోని 126 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 722 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ధారించే ఈవీఎంలను 35 జిల్లాలోని 40 కౌంటింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం తెరవనున్నారు. కౌంటింగ్ కేంద్రాలు, ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత కోసం 25 కంపెనీల (ఒక్కోదానిలో దాదాపు 100 మంది సిబ్బంది) సీఆర్‌పీఎఫ్ దళాలను ఈసీ నియమించింది. రాష్ట్రంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగగా 85.96 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల బరిలో ఉన్న ప్రముఖులలో బీజేపీకి చెందిన ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ ఉన్నారు.

ఎల్‌డీఎఫ్‌కు హ్యాట్రిక్ దక్కేనా?

కేరళలో 2024 లోక్‌సభ ఎన్నికలు, ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికలలో తన పనితీరుతో ఉత్సాహంగా ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ రెండు పర్యాయాలుగా అధికారంలో ఉన్న లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్(ఎల్‌డీఎఫ్)ను గద్దె దించాలని ఆశిస్తుండగా, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ రాష్ట్రంలో పట్టు సాధించడానికి ప్రయత్నిస్తున్నది. ఎల్‌డీఎఫ్ ఓటమి పాలైతే 1960ల తర్వాత ఏ భారత రాష్ట్రంలోనూ వామపక్ష పార్టీలు అధికారంలో లేకుండాపోవడం ఇదే మొదటిసారి అవుతుంది. రాష్ట్రంలోని 140 సీట్ల కోసం మొత్తం 883 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. 43 ప్రదేశాలలో 140 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పోటీలో లేనప్పటికీ 2021లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయిన బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కేరళలో తమ ఉనికిని విస్తరించుకోవడానికి ఈ ఎన్నికలను కీలకమైనవిగా భావిస్తున్నది.

తమిళనాడులో త్రిముఖ పోటీ

తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే, దాని ప్రధాన ప్రత్యర్థి ఏఐఏడీఎంకేతోపాటు నటుడు-రాజకీయవేత్త విజయ్ నేతృత్వంలోని టీవీకే, తమిళ జాతీయవాది సీమాన్ నేతృత్వంలోని ఎన్‌టీకే వంటి కొత్త పార్టీల భవితవ్యం మరి కొన్ని గంటల్లో తేలిపోనున్నది. వరుసగా రెండోసారి అధికారాన్ని చేపట్టాలని డీఎంకే ఆశిస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా 62 కౌంటింగ్ కేంద్రాల్లో మూడంచెల భద్రత నడుమ సోమవారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నది. ఈవీఎంల కోసం 234 కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం అదనంగా 240 హాళ్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఏఐఏడీఎంకే, బీజేపీ, ఐఎన్ఆర్‌సీ, ఎల్‌జేకే పార్టీలు ఎన్‌డీఏ కూటమిలో ఉండగా కాంగ్రెస్, డీఎంకే, వీసీకే పార్టీలు ఇండియా కూటమి తరపున బరిలో ఉన్నాయి. విజయ్ సారథ్యంలోని టీవీకే ఒంటరిగా పోటీ చేసింది.

పుదుచ్చేరిలో విజయం ఎవరిది?

కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని 30 అసెంబ్లీ స్థానాలకు సోమవారం ఉదయం ఓట్ల లెక్కింపు జరగనున్నది. ఏప్రిల్ 9న ఒకే దశలో పోలింగ్ జరగగా రికార్డు స్థాయిలో 91.23 శాతం ఓట్లు పోలయ్యాయి. 2021 ఎన్నికల్లో 16 స్థానాలు గెలుచుకుని కచ్చితమైన మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఎన్‌డీఏ మరోసారి తన అదష్టాన్ని పరీక్షించుకుంటున్నది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి కూడా గెలుపును ఆశిస్తున్నది.

8 స్థానాల్లో ఉప ఎన్నికల కౌంటింగ్

గోవా, కర్ణాటక, నాగాలాండ్, గుజరాత్, మహారాష్ట్రలోని 8 అసెంబ్లీ స్థానాలకు సోమవారం ఓట్ల లెక్కింపు జరగనున్నది. గోవాలోని పోండ, కర్ణాటకలోని బాగల్‌కోట్, దావణగెరె, నాగాలాండ్‌లోని కోరిదంగ్, త్రిపురలోని ధర్మనగర్, గుజరాత్‌లోని ఉమ్రేత్, మహారాష్ట్రలోని రహూరీ, బారామతి స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి.

భార్య వేధింపులతో ఢిల్లీ జడ్జి ఆత్మహత్య!

న్యూఢిల్లీ: ఢిల్లీలోని కర్‌కర్‌దూమ దిగువ కోర్టులో న్యాయాధికారిగా పనిచేస్తున్న అమన్ కుమార్ శర్మ(30) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతుడి బంధువు కథనం ప్రకారం.. భార్య వేధింపులకు తట్టుకోలేక ఆమె చున్నీతోనే ఆయన ఉరేసుకొని చనిపోయారు. మృతుడి భార్య స్వాతి కూడా న్యాయాధికారే. అమన్ మృతికి ముందు రెండు రోజుల పాటు వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. చనిపోవడానికి ఒక రోజు ముందు అమన్ తన తండ్రికి ఫోన్ చేసి తాను తీవ్రంగా కలత చెందానని..బతకడం కష్టమైపోయిందని ఆవేదన చెందారు. ఆ తర్వాత శనివారం మళ్లీ స్వాతి భర్తతో గొడవ పడింది. ఆ తర్వాత కాసేపటికే అమన్ కుమార్ బాత్‌రూమ్‌లో చున్నీతో ఉరేసుకొని చనిపోయి కనిపించారు.

పెండ్లి చేయట్లేదని పోలీస్ స్టేషన్‌కు!

లక్నో, మే 3: ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో పోలీసుల ముందుకు ఒక ఆశ్చర్యకరమైన ఫిర్యాదు వచ్చింది. పెండ్లి చేసుకోవటంలో తనకు సాయం చేయాలంటూ 41 ఏండ్ల మహిళ పోలీసులను కోరింది. అన్నావదినలు తన పెండ్లి గురించి పట్టించుకోవటం లేదంటూ ఫిర్యాదు చేసింది. ఆమె తెలిపిన వివరాల ఆధారంగా.. జిల్లాలోని 'సరాయ్ ఇనాయత్' పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా నమోదైంది. సదరు మహిళ కోసం వస్తున్న పెండ్లి సంబంధాల్ని కుటుంబ సభ్యులు అడ్డుకుంటున్నట్టు తెలిసింది. తన పెండ్లి జరగకుండా కుటుంబ సభ్యులు ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటున్నారని సదరు మహిళ పోలీసుల ముందు తన గోడు వెళ్లబోసుకుంది. తన కోసం వస్తున్న ప్రతి పెండ్లి సంబంధాన్ని అన్నా వదినలు తిరస్కరిస్తున్నారని ఆరోపించింది. కాబట్టి తన పెండ్లికి కుటుంబ సభ్యులు అడ్డంకులు సృష్టించకుండా చూడాలంటూ పోలీసులను కోరింది. కాగా, ఆమె ఆరోపణల్ని కుటుంబసభ్యులు తోసిపుచ్చారు.

ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం

- 9 మంది మృతి.. నలుగురికి గాయాలు
- ఏసీ పేలుడే కారణమని అనుమానం

న్యూఢిల్లీ, మే 3: ఢిల్లీలోని వివేక్ విహార్‌లో ఆదివారం తెల్లవారుజామున ఒక నాలుగు అంతస్తుల భవనంలో మంటలు చెలరేగి తొమ్మిది మంది మరణించగా మరో నలుగురు గాయపడ్డారు. ఏసీ పేలుడు కారణంగా మంటలు చెలరేగి ఉండవచ్చని ప్రాథమిక ఆధారాలను బట్టి తెలుస్తున్నది. అగ్ని ప్రమాదం గురించి తెలిసిన వెంటనే 12 అగ్నిమాపక శకటాలు అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశాయి. మరణించిన తొమ్మిది మందిలో ఐదు మృతదేహాలు భవనంలోని రెండవ అంతస్తులో లభించాయి. మరో మూడు మృతదేహాలు మెట్ల పైన లభించాయి. మరో వ్యక్తి మృతదేహం మొదటి అంతస్తులో లభించింది. మృతులలో ఏడాది వయసున్న బాలుడు కూడా ఉన్నాడు. ఈ ఘటనలో నలుగురు పురుషులు, నలుగురు మహిళలు, ఒక చిన్నారి మరణించినట్లు పోలీసులు తెలిపారు. డజను మందికిపైగా భవన నివాసితులను రక్షించినట్లు సహాయక సిబ్బంది చెప్పారు. భవనంలోని రెండు, మూడు, నాలుగవ అంతస్తులకు మంటలు వ్యాపించినట్లు పోలీసులు చెప్పారు.



అంతరిక్షంలోకి భారత 'దృష్టి'

కక్ష్యలోకి చేరిన శాటిలైట్

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనలో మరో చారిత్రక ఘట్టం నమోదైంది. భారత అతిపెద్ద ప్రైవేట్ ఉపగ్రహం 'మిషన్ దృష్టి' రోదసి ప్రయోగం విజయవంతమైంది. ఆదివారం అమెరికాలోని కాలిఫోర్నియా నుంచి 'స్పేస్ఎక్స్'కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టారు. ప్రపంచంలోనే మొట్టమొదటి 'ఆప్టోసార్' శాటిలైట్ ఇది. అంటే సాధారణ కెమెరా (ఆప్టికల్), రాడార్ (సింథటిక్ అపర్చర్ రాడార్) టెక్నాలజీని కలిపి తయారుచేసిన హైబ్రిడ్ శాటిలైట్. భూమిపై మబ్బులు సహా ఎలాంటి వాతావరణం ఉన్నా.. అంతరిక్షం నుంచి హై-రిజల్యూషన్ చిత్రాలు తీయటం దీని ప్రత్యేకత. దీనిని రక్షణ, విపత్తు నిర్వహణ, వ్యవసాయం, మౌలిక సదుపాయాల పర్యవేక్షణకు భారత్ ఉపయోగించనున్నది.

మూడేండ్ల పిల్లలపై రేప్

- మహారాష్ట్రలో దారుణం

ముంబై, మే 3 (నమస్తే తెలంగాణ): మూడు సంవత్సరాల బాలుడు, మూడున్నరేండ్ల బాలికపై అత్యాచారం జరిపి, వారిద్దరిని హత్య చేసిన వేర్వేరు ఘటనలు బీజేపీ పాలిత మహారాష్ట్రలో సంచలనం సృష్టించాయి. మొదటి ఘటన పుణె జిల్లాలోని భోర్ తాలూకా నస్రాపూర్‌లో శుక్రవారం జరిగింది. సెలవులకు అమ్మమ్మ ఇంటికి వచ్చిన బాలికను ప్రలోభ పెట్టిన 65 ఏండ్ల వృద్ధుడు చిన్నారిపై లైంగిక దాడి చేశాడు. తర్వాత ఆ విషయాన్ని బాధితురాలు ఎవరికైనా చెప్తొచ్చన్న భయంతో రాయితో తలపై మోది హత్య చేశాడు. దీంతో బెంగళూరు-ముంబై హైవేను వందలాది మంది దిగ్బంధించి ధర్నా చేశారు. అదే జిల్లాలోని దక్షిణ మహాలుంగేలో శుక్రవారం మరొక రేప్ జరిగింది. బాలుడి ఇంటి దగ్గర నివసించే బీహార్‌కు చెందిన మైనర్ చాక్లెట్ ఆశ చూపించి బాలుడిని తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. అక్కడ అతడిని రేప్ చేసి హత్య చేశాడు. సాక్ష్యాలను నాశనం చేసే ఉద్దేశంతో మృతదేహాన్ని ఒక సూట్ కేసులో పెట్టి తాళం వేశాడు.

కర్ణాటకలో ఆర్టీసీ కార్మికుల సమ్మె బాట

- ఈ నెల 20 నుంచి నిరవధిక సమ్మె
- కాంగ్రెస్ సర్కార్ తీరుపై ఆగ్రహం



బెంగళూరు, మే 3: కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. తెలంగాణలో ఆర్టీసీ ఉద్యోగులు ఉద్యమ బాటపట్టగా, తాజాగా కాంగ్రెస్ అధికారంలో ఉన్న మరో రాష్ట్రం కర్ణాటకలోనూ ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 20 నుంచి రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థల కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ(జేఏసీ) పిలుపునిచ్చింది. కార్మిక సంఘాల నాయకులు, రవాణా మంత్రి రామలింగా రెడ్డి మధ్య ఇటీవల జరిగిన చర్చలు విఫలమైన నేపథ్యంలో మే 20 ఉదయం 6 గంటల నుంచి కేఎస్ఆర్‌టీసీ, బీఎంటీసీ, ఎన్‌డబ్ల్యూకేఆర్‌టీసీ, కేకేఆర్‌టీసీకి చెందిన బస్సులు నిలిచిపోనున్నాయి. కేఎస్ఆర్‌టీసీ సిబ్బంది, కార్మికుల సమాఖ్య అధ్యక్షుడు జ్యోతి అనంత సుబ్బారావు శనివారం విలేకరుల సమావేశంలో సమ్మె నిర్ణయాన్ని ప్రకటించారు. 2024 జనవరి నుంచి 25 శాతం జీతం పెంపును తమ సంఘాలు డిమాండు చేసినట్లు ఆయన చెప్పారు. నిర్ణీత కాల వ్యవధిలో వేతన సవరణ అమలు చేయాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు. అయితే ప్రభుత్వం కేవలం 7 శాతం పెంపును అది కూడా 2025 ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలుచేస్తామని ప్రతిపాదించిందని ఆయన చెప్పారు ఇది తమ కార్మికులకు ఆమోదనీయం కాదని సుబ్బారావు స్పష్టం చేశారు. సాధారణ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం ఏర్పడినా రాష్ట్ర ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని యూనియన్ నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని, తమ సమ్మె వల్ల ప్రజలకు అసౌకర్యం ఏర్పడితే దానికి ప్రభుత్వానిదే బాధ్యతే తప్ప ఉద్యోగులది కాదని సభ్యులు తెలిపారు.

ఎమర్జెన్సీ డోర్ తెరచి.. కిందికి దూకేసి!

చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో టెన్షన్ రేపిన ప్రయాణికుడు

చెన్నై: ఎయిర్ అరేబియా విమానం ఆదివారం ఉదయం చెన్నై విమానాశ్రయంలో దిగి రన్ వేపై వెళుతున్నప్పుడు ఒక ప్రయాణికుడు(34) అత్యవసర ద్వారాన్ని తెరచి కిందికి దూకిన ఘటన ఉత్కంఠను రేపింది. విమానాశ్రయ అధికారుల వివరాల ప్రకారం.. షార్జా నుంచి చెన్నై వచ్చిన విమానంలో ఈ ఘటన జరిగింది. ప్రయాణికుడి అనుచిత చర్యను గమనించిన వెంటనే పైలట్ విమానాన్ని ఆపేసి ఎయిర్‌పోర్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. భద్రతా సిబ్బంది, బాంబు నిర్వీర్య దళం వెంటనే అక్కడికి చేరుకొని సదరు ప్రయాణికుడిని అదుపులోకి తీసుకొన్నారు. అతడి మానసిక స్థితిని పరిశీలిస్తున్నారు. అతడు అలా ఎందుకు దూకాడో విచారణ చేస్తున్నారు. పైలట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. నిందితుడిని పుదుక్కోట్టై వాసిగా గుర్తించారు.

డిజిటల్ మత్తుకు బౌన్సర్లతో చెక్!

- స్మార్ట్ ఫోన్ బానిసలపై నిఘాకు బౌన్సర్ల సాయం
- నియమించుకుంటున్న గుజరాత్‌లోని పలు కుటుంబాలు
- నెలకు 65 వేలు వెచ్చిస్తున్న ఓ బాలిక కుటుంబ సభ్యులు



అహ్మదాబాద్, మే 3: ఒకప్పుడు మద్యం, పొగతాగడాన్ని వ్యసనాలుగా భావించేవారు. ఆ తరువాత మత్తుమందులు (డ్రగ్స్) ఆ స్థానాన్ని ఆక్రమించాయి. ఇప్పుడు సెల్‌ఫోన్‌కు అందులోని సామాజిక మాధ్యమాలకు యువత బానిసలుగా మారుతున్నారు. చిన్న పిల్లలు మొదలు పెద్దల దాకా అందరికీ సెల్‌ఫోన్ తమ శరీరంలో ఒక అవయవంలా మారిపోయింది. కొద్దిసేపు ఫోన్ తమ వద్ద లేకపోతే పిచ్చి పట్టినట్టు వ్యవహరిస్తున్నారు. ఈ వ్యసనం ప్రాణాంతకంగా మారుతున్నదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలా సెల్‌ఫోన్‌ను వ్యసనంగా మార్చుకొన్న వారిని కాపాడుకొనేందుకు, వారి నుంచి ఇతరులను కాపాడేందుకు అహ్మదాబాద్‌లో కొన్ని కుటుంబాలు బౌన్సర్లను నియమించుకున్నాయి. తమ 16 ఏండ్ల కుమార్తెను 24x7 నిఘా వేసేందుకు ఓ కుటుంబం రెండు షిఫ్టుల్లో నలుగురు బౌన్సర్లను నియమించింది. వీరి సేవలకు గాను నెలకు రూ.65 వేలు చెల్లిస్తున్నది. ఆ బాలిక సెల్‌ఫోన్‌కు, సోషల్ మీడియాకు బానిసగా మారిందని సైకియాట్రిస్ట్ డాక్టర్ మురుగేశ్ వైష్ణవ్ చెప్పారు. ఫొటోలు పంచుకొనే మాధ్యమానికి ఆమె బానిసగా మారిందని, అలా ఫొటోలు షేర్ చేసిన వారిని కలిసేందుకు ఏ సమయంలోనైనా వెళ్లిపోతుందని తెలిపారు. సెల్‌ఫోన్‌ను ఆమె నుంచి తొలగిస్తే హింసాత్మకంగా మారుతుందని అన్నారు. ఆమె రక్షణ కోసమే బౌన్సర్లను ఏర్పాటుచేసినట్టు తల్లిదండ్రులు చెప్పారు.

పెంపుడు కుక్కను కాపాడుకునేందుకు..

సూరత్‌లో తమ 17 ఏండ్ల కుమారుడి నుంచి పెంపుడు కుక్కను కాపాడుకొనేందుకు ఓ కుటుంబం బౌన్సర్లను నియమించుకుంది. ఆ కుక్కను కాపాడేందుకు తొమ్మిది నెలలపాటు ఎనిమిది మంది బౌన్సర్లను రెండు షిఫ్టుల్లో మోహరించామని ఫోర్స్-11 సెక్యూరిటీ కంపెనీ అధిపతి నిఖిల్ పాండే తెలిపారు. ఆ టీనేజర్ సెల్‌ఫోన్‌లో గేమ్స్‌కు బానిసగా మారాడు. తండ్రి తనను మందలించిన ప్రతిసారీ ఆ బాలుడు తన కోపాన్నంతా తమ పెంపుడు కుక్కపై చూపేవాడని పాండే చెప్పారు.

సెక్యూరిటీ ఏజెన్సీలకు క్యూ..

వ్యసనాలకు బానిసలైన యువతకు రక్షణ కల్పించే కొత్త బాధ్యతను ఇటీవల సెక్యూరిటీ ఏజెన్సీలకు అందిస్తున్నారని సూరత్‌కు చెందిన యాసిన్ మాలిక్ చెప్పారు. మాదకద్రవ్యాలకు బానిసైన తమ కుమారుడికి వైద్య చికిత్స అందించిన అనంతరం అతనికి తోడుగా ఉండేందుకు తమ సంస్థను ఆశ్రయించారని తెలిపారు. ఆ యువకుడు ఒంటరిగా ఎక్కడికీ వెళ్లకుండా, మళ్లీ మత్తు మందుల జోలికి పోకుండా చూడటం తమకు అప్పగించిన బాధ్యత అని అన్నారు. ఇందుకోసం ఒక బౌన్సర్‌కు రోజుకు రూ.1,500 చెల్లిస్తున్నారని చెప్పారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌కు బానిసలైన పిల్లలు, యువత కేసులు కొవిడ్ అనంతర కాలంలో ఎక్కువయ్యాయని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ వైష్ణవ్ చెప్పారు. చదువు కోసం సెల్‌ఫోన్‌ను పొందుతున్న విద్యార్థులు ఇతర అంశాలపైకి తమ దృష్టిని మరలిస్తున్నారని అన్నారు. డ్రగ్స్, మద్యం లాగా ఇది కూడా ఒక కొత్త రకం వ్యసనంగా మారిందని చెప్పారు.



ఖలిస్థాన్ తీవ్రవాదులతో జాతీయ భద్రతకు ముప్పు

కెనడా నిఘా ఏజెన్సీ నివేదిక

ఒట్టావా, మే 3: ఖలిస్థాన్ వేర్పాటువాదుల విషయంలో కెనడా కీలక నిర్ణయం తీసుకుంది. ఖలిస్థాన్ వేర్పాటువాదులు తమ దేశ జాతీయ భద్రతకు ముప్పుగా కెనడా సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ ప్రకటించింది. తమ హింసాత్మక తీవ్రవాద ఎజెండాను కెనడాలో ప్రచారం చేయడానికి వేర్పాటువాదుల బృందం వివిధ సంస్థలను వాడుకుంటున్నదని పేర్కొన్నది. ఆదివారం ఈ మేరకు '2025 పబ్లిక్ రిపోర్ట్'ను విడుదల చేసింది. కెనడా కేంద్రంగా ఖలిస్థాన్ వేర్పాటువాదుల (సీబీకేఈ) హింసాత్మక కార్యకలాపాలు ఈ దేశానికి, కెనడా ప్రయోజనాలకు ముప్పుగా నివేదిక పేర్కొన్నది. 'కెనడా పౌరులతో సంబంధాలు కొనసాగిస్తున్న సీబీకేఈ.. తీవ్రవాద ఎజెండా ప్రచారానికి వారిని ఉపయోగించుకుంటున్నది. అమాయక పౌరుల నుంచి నిధులు సేకరించి, వాటిని హింసాత్మక కార్యకలాపాలవైపు మళ్లిస్తున్నది' అని నివేదిక తెలిపింది. నివేదికను కెనడా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. జస్టిన్ ట్రూడో తర్వాత కెనడా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మార్క్ కార్నీ.. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపర్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

అసాధ్యమైన యుద్ధమా? ఒప్పందమా?

- అమెరికాకు వేరే దారులు లేవన్న ఇరాన్ నాయకత్వం
- పద్నాలుగు పాయింట్లతో కొత్త శాంతి ప్రతిపాదన
- దురుసుగా ప్రవర్తిస్తే మళ్లీ దాడులు: డొనాల్డ్ ట్రంప్



టెహ్రాన్: అమెరికాపై ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్‌జీసీ) తన మాటల దాడిని ఉధృతం చేసింది. ఇరాన్‌ను ఎదుర్కోవడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు చాలా పరిమితమైన, క్లిష్టమైన దారులు ఉన్నాయని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. సాధ్యంకాని ఆపరేషనా లేక ఇరాన్‌తో ఒక చెడ్డ ఒప్పందమా అన్న దాంట్లో ఒకదాన్ని ట్రంప్ ఎంచుకోవాలని ఐఆర్‌జీసీ నిఘా విభాగం ఒక ప్రకటనలో పేర్కొన్నట్లు ఇరానియన్ ప్రభుత్వ టీవీ తెలిపింది. ఈ హెచ్చరిక రెండు దేశాల మధ్య, ముఖ్యంగా ఆ ప్రాంతంలో అమెరికా సైనిక ఒత్తిడి విషయంలో పెరుగుతున్న ఉద్రిక్తతలను ప్రతిబింబిస్తున్నది. ఐఆర్‌జీసీ ఎక్స్‌లో పెట్టిన ఒక పోస్టులో ఇవే వ్యాఖ్యలు మరోసారి వెలువడ్డాయి. "దీన్ని అర్థం చేసుకోవడానికి ఒకే ఒక మార్గం ఉంది: ట్రంప్ ఒక అసాధ్యమైన సైనిక చర్య లేదా ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒక చెడ్డ ఒప్పందం మధ్య ఎంచుకోవాలి. అమెరికాకు నిర్ణయం తీసుకునే అవకాశాలు తగ్గిపోయాయి" అని పేర్కొన్నది. అంతేగాక, ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన నావికా దిగ్బంధాన్ని ముగించడానికి ఇరాన్ ఒక గడువు విధించిందని తెలిపింది. అయితే అందుకు కచ్చితమైన కాలపరిమితిని ఐఆర్‌జీసీ పేర్కొనలేదు. అమెరికా పట్ల చైనా, రష్యా, యూరప్ వైఖరిలో మార్పు వస్తున్నదని, ఇది పెరుగుతున్న అంతర్జాతీయ ఒత్తిడిని సూచిస్తున్నదని కూడా ఐఆర్‌జీసీ తెలిపింది.

దిగ్బంధాన్ని ఎత్తేయాలి..

యుద్ధాన్ని ముగించేందుకు 14 పాయింట్లతో ఇరాన్ కొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చింది. పాకిస్థాన్ ద్వారా దీన్ని అమెరికాకు అందజేసింది. లెబనాన్‌సహా అన్ని విధాలుగా యుద్ధాన్ని ముగించాలని కోరింది. అమెరికా ప్రతిపాదించిన కాల్పుల విరమణ పొడిగింపును తిరస్కరించింది. 30 రోజుల్లోగా యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేలా పరిష్కారాన్ని కోరింది. తమపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని, తమపై మళ్లీ దాడి చేయకుండా భద్రతా హామీలు ఇవ్వాలని, హార్ముజ్ దిగ్బంధాన్ని ఎత్తివేయాలని, స్తంభింపజేసిన తమ ఆస్తులను విడుదల చేయాలని, యుద్ధం కారణంగా జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని ఆ ప్రతిపాదనల్లో కోరింది.

ఇరాన్‌కు ట్రంప్ తాజా వార్నింగ్

ఇరాన్ దురుసుగా ప్రవర్తిస్తే సైనిక దాడులను తాము పునఃప్రారంభించవచ్చని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శనివారం హెచ్చరించారు. ఇరాన్ 14 అంశాల శాంతి ప్రతిపాదన సమీక్ష సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ నాయకత్వంపై అనిశ్చిత స్థితి ఉన్నప్పటికీ ఆ దేశంతో చర్చలు పురోగమిస్తున్నాయని ట్రంప్ అన్నారు. దక్షిణ ఫ్లోరిడాలో విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ ఇరాన్ దురుసుగా ప్రవర్తిస్తే, ఏదైనా చెడు చేస్తే మళ్లీ యుద్ధం ప్రారంభించడానికి తాము సిద్ధమని ఆయన చెప్పారు. ఇరాన్‌లో మిగిలిన క్షిపణి ఉత్పత్తి సామర్థ్యాలను కూడా నిర్మూలించాలని అమెరికా ఇప్పటికీ కోరుకుంటున్నదని ఆయన అన్నారు. "మళ్లీ వారు(ఇరాన్) ఒక ఒప్పందం చేసుకోవాలనుకుంటున్నారు. కానీ వారు పూర్తిగా నాశనమయ్యారు. తమ నాయకుడు ఎవరో వారు తేల్చుకోలేకపోతున్నారు. తమ నాయకుడు ఎవరో వారికి తెలియదు. ఎందుకంటే వారి నాయకుడు ఇప్పుడు లేడు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. గడచిన 47 ఏండ్లలో తన గత చర్యలకు ఇరాన్ ఇంకా తగినంత భారీ మూల్యం చెల్లించాల్సి ఉందని ట్రంప్ చెప్పారు.

రీల్స్ కోసం వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి!

- పై నుంచి దిగుతూ పడిపోయిన ముగ్గురు పిల్లలు.. ఒకరు మృతి
- ట్యాంక్ పైనే మరో ఇద్దరు..హెలికాప్టర్‌తో రక్షించిన ఎయిర్‌ఫోర్స్

లక్నో: రీల్స్‌తో పాపులర్ కావాలన్న పిచ్చితో కొందరు పిల్లలు చేసిన ప్రయత్నం ప్రాణాంతకంగా మారింది. ఉత్తరప్రదేశ్ సిద్ధార్థ్‌నగర్‌లో శనివారం ఐదుగురు పిల్లలు 60 అడుగుల ఎత్తులో ఉన్న వాటర్‌ట్యాంక్ ఎక్కి.. ఊహించని ప్రమాదంలో చిక్కుకున్నారు. సరైన అవగాహన లేకుండా వీరు చేసిన ఈ సోషల్‌మీడియా స్టంట్ భయానకంగా మారింది. ముగ్గురు పిల్లలు వాటర్‌ట్యాంక్ పై నుంచి కిందికి దిగుతుండగా, వారి బరువుకు అక్కడి నిచ్చెన విరిగిపోయింది. దీంతో ఆ ముగ్గురు పిల్లలు 50 అడుగుల ఎత్తు నుంచి కిందికి పడిపోయారు. ఈ ఘటనలో 13 ఏండ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరు పిల్లలు వాటర్‌ట్యాంక్ పైన్నే చిక్కుకోగా, ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్‌తో వారిని సురక్షితంగా కిందికి చేర్చారు.

హజ్ యాత్రికులపై 'ఇంధన' భారం

- రూ.10 వేలు అదనంగా చెల్లించాలని కేంద్రం ఉత్తర్వులు
- రాష్ట్రంలో 6,632 మందిపై అదనపు చార్జీల భారం
- మోదీ సర్కార్ వైఖరిపై యాత్రికుల అభ్యంతరం
- నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వివిధ మైనారిటీ సంఘాల నేతల డిమాండ్

ఇంధన కొరత నెపంతో హజ్ యాత్రికులను కేంద్రం తీవ్ర ఇబ్బందులు పెడుతున్నది. ఓవైపు పుష్కలంగా చమురు నిల్వలు ఉన్నాయని చెబుతూనే మక్కా యాత్రికులపై రూ.10వేల అదనపు భారాన్ని మోపుతున్నది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రం నుంచి యాత్ర చేసేవారిపై రూ.6,63,20,000 భారం పడనున్నది. దీంతో దాతల సాయంతో హజ్ కు వెళ్లే నిరుపేదలు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తక్షణం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వమైనా ఆ భారాన్ని మోయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): హజ్ యాత్రికులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం షాకిచ్చింది. ఇంధన కొరత సాకుతో ఒక్కొక్కరు రూ.10వేల చొప్పున అదనంగా చెల్లించాలని నిర్ణయిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. మోదీ సర్కార్ వైఖరిపై హజ్ యాత్రికుల్లో తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతున్నది. దేశంలో మూడు నెలలకు సరిపడా పుష్కలంగా ఇంధన నిల్వలు ఉన్నాయని చెబుతూ వస్తున్న కేంద్రం పవిత్ర యాత్రకు వెళ్లేవారిపై భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

యాత్రకు ఏటా 2లక్షల మంది

సౌదీ ఆరేబియాలోని మక్కా మదీన యాత్రకు ఏటా భారతదేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 2 లక్షల మందికి పైగా ముస్లింలు వెళ్తుంటారు. నాలుగైదు నెలల క్రితమే ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమవుతున్నది. హజ్ కమిటీల ఆధ్వర్యంలో జనవరిలో దరఖాస్తులు స్వీకరించి స్క్రూటిని పూర్తిచేసి అర్హులను ఎంపిక చేస్తారు. యాత్రకు ఎంపికైనవారు రూ.3.6 లక్షల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. తెలంగాణ నుంచి ఈ ఏడాది 6,632 మంది యాత్రికులను ఎంపిక చేశారు. వీరంతా సోమవారం ప్రత్యేక విమానాల్లో బయల్దేరి వెళ్తారు. నిరుపేదలైన అనేకమంది యాత్రికులు దాతల సహాయంతో మక్కా యాత్ర చేస్తారు. ఇపుడు కేంద్రం అదనంగా రూ.10వేలు చెల్లించాలని నిర్దేశించడంతో దాతలపై ఆధారపడే యాత్రికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. ఇంధన కొరత పేరిట తమను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని మక్కా యాత్రికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అదనపు భారాన్ని ఉపసంహరించుకోవాలని మైనార్టీ సంఘాల నాయకులు కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వమైనా ముందుకొచ్చి ఆర్థిక భారాన్ని భరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కేంద్రంపై ఒత్తిడి తేవాలి

హజ్ యాత్రికులపై కేంద్రం ఏటీఎఫ్ చార్జీల పేరిట రూ.10 వేల అదనపు భారం మోపడం సరికాదని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్‌పాషా పేర్కొన్నారు. దాతల సహాయంతో మక్కాకు వెళ్లే నిరుపేద ముస్లింలు అదనపు సొమ్ము చెల్లించడం ఇబ్బందికరంగా మారుతుందన్నారు. ఇంధన చార్జీలు ఉపసంహరించుకొనేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని, లేదంటే రాష్ట్రం నుంచి వెళ్లేవారికి సంబంధించిన భారాన్ని భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వాలు విఫలం

- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్‌వలీ ఉల్లా ఖాద్రీ
- ఘనంగా ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవం

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : ఉన్నత చదువులు చదివిన లక్షలాది మంది యువతకు ఉద్యోగాల కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ ఆరోపించారు. ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం రాష్ట్ర కార్యాలయంలో యువజన సంఘం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ.. యువతను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యోగ సంక్షోభం ప్రమాదకరస్థాయికి చేరిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు శ్రీమాన్, బాలకృష్ణ, అనిల్‌కుమార్, శ్రీనివాస్, దశరథ్‌నాయక్, భగత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని గ్యాస్ గోదాము వద్ద సిలిండర్లను లైన్‌లో పెట్టి అక్కడే నిద్రిస్తున్న వినియోగదారులు

గ్యాస్ సిలిండర్ల కోసం జాగారం

- మహబూబాబాద్ జిల్లాలో ధర్నా
- ఏజెన్సీ నిర్వాహకుల తీరుపై ఆగ్రహం

నర్సింహులపేట, మే 3 : గ్యాస్ సిలిండర్ల కోసం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలకేంద్రంలోని గ్యాస్ గోదాం వద్ద శనివారం రాత్రి నుంచి వినియోగదారులు పడిగాపులుకాచారు. ఆదివారం ఉదయం వరకు కూడా సిలిండర్ల లారీ రాకపోవడంతో జాతీయ రహదారిపై ధర్నా చేశారు. ఆ తర్వాత సిలిండర్ల వాహనం రావడంతో నర్సింహులపేట, దంతాలపల్లి పోలీసుల పహారా నడుమ వినియోగ దారులకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. రాత్రి మొత్తం జాగారం చేసినా చాలా మంది వినియోగదారులకు సిలిండర్లు దొరక్కపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఈ కేవైసీ పేరుతో ఓటీపీలు తీసుకున్న ఏజెన్సీ నిర్వాకులు మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బుక్ చేసిన వారికి సిలిండర్లు ఇస్తామని ఖాళీ సిలిండర్లు తీసుకొని, ఇప్పుడు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని వాపోతున్నారు. ఏజెన్సీ నిర్వాహకులకు ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆరోపించారు.

సాధించిందేంది..సంబురాలెందుకు?

> మొదటిపేజీ తరువాయి...

మీరు తెచ్చింది ఏమిటి?' అని ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలను ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రితో భేటీలో సాధించిందేమిటి? అని నిలదీస్తున్నారు. ఉద్యమాన్ని ఎందుకు వాయిదా వేశారు?, ఆర్టీసీ కార్మికుల తరహాలో ఎందుకు ఉద్యమించలేదు? అని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు, ప్రభుత్వంపై సోషల్ మీడియాలో వాగ్బాణాలు సంధిస్తున్నారు. ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు శనివారం సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన విషయం తెలిసిందే. రిటైర్మెంట్ బెనిఫిట్లను వంద రోజుల్లో క్లియర్ చేస్తామని సర్కార్ వెల్లడించింది. గత క్యాబినెట్ సమావేశంలోనే దీనిపై ప్రభుత్వం ప్రకటన చేసింది. ఇక జూన్-1న హెల్త్‌కార్డులిస్తామన్నది. గతంలో వారంలోనే మార్గదర్శకాలిస్తాం. అమలుచేస్తామన్నారు. 2 నెలలు గడిచింది. మళ్లీ జూన్-1కి వాయిదా వేశారని ఉద్యోగులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఇంత మోసం చేస్తున్న సర్కార్‌ను నమ్మేదెలా? అని మండిపడుతున్నారు.

సోషల్‌మీడియాలో రచ్చ..

సీఎంతో భేటీ అనంతరం ఉద్యోగ సంఘాల నేతలు సీఎంతో దిగిన ఫొటోలను సోషల్‌మీడియాలో షేర్ చేశారు. కొత్తగా ఏం తెచ్చారని ఉద్యోగులు, టీచర్లు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. సీఎంతో భేటీ విషయంపై ఓ ఉద్యోగి, ఉద్యోగ సంఘం నేత మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. సోషల్ మీడియాలో రచ్చకు దారితీసింది. 'ఉద్యమం అంటారు.. కొట్లాడేందుకు రెడీ కావాలంటారు.. ఆశలు రేపుతారు.. చివరికి చర్చల పేరు చెప్పి గప్‌చుప్ అవుతారు. సంఘాలను నడపడం రాకపోతే, జేఏసీ నిర్వహణ సాధ్యం కాకపోతే ఇంట్లో ఉండండి' అని ఓ టీచర్ ఫైర్ అయ్యాడు. 'ప్రభుత్వానికున్న 60 నెలల్లో 30 నెలలు గడిచింది. ఇక ఉద్ధరించేది ఏమున్నది' అని మరో టీచర్ మండిపడ్డాడు.

పీఆర్సీ ఇప్పట్లో లేనట్లే..

ఉద్యోగులు ఆశగా వేచిచూస్తున్న వేతన సవరణ(పీఆర్సీ) ఇప్పట్లో లేనట్టేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. పీఆర్సీ కమిటీ సర్కార్‌కు నివేదిక సమర్పించాలి. ఆ తర్వాత సర్కార్ ఈ నివేదికపై అధ్యయనం చేయాలి. నివేదికను బహిర్గతం చేయాలి. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సంప్రదింపులు జరుపాలి. ఆ తర్వాతే ఫిట్‌మెంట్‌పై ఓ నిర్ణయం తీసుకునే అవకాశముంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వంద రోజుల్లో.. అంటే ఆగస్టులోగా రిటైర్మెంట్ బెనిఫిట్లు చెల్లిస్తామని సర్కార్ చెబుతున్నది. ఆ లోగా పరిషత్ ఎన్నికలు వస్తే ఆలస్యం కానున్నదని ఉద్యోగ సంఘాల నేతులు అంచనావేస్తున్నారు.

ఉద్యోగుల స్పందనలు ఇలా..

- అందరూ వెళ్లారు. సీఎంతో దిగిన ఫొటోలు వాట్సాప్ ప్రొఫైల్‌లో, యూనియన్ ఆఫీస్‌లో చూసుకుని మురవడమే.
- లడ్డూ కావాలా నాయనా? అంటే గాడిద గుడ్డు కావాలి అన్నట్టుగా ఉన్నది.
- 'నువ్వు కొట్టినట్టు చెయ్యి.. నేను ఏడ్చినట్టు చేస్తా' అన్నట్టుంది జేఏసీ, సర్కార్ బంధం.
- జీవో-317 బాధితుల కోసం తీసుకొచ్చిన జీవో-190పై చర్చే లేదు.
- 5శాతం ఐఆర్ గురించి ఎందుకడగలేదు.
- హెల్త్‌కార్డులు, ఇతర డిమాండ్లు నెరవేర్చకపోతే కోర్టుకెళ్లాల్సి వస్తుందేమో.
- ఉపాధ్యాయ సంఘాలు ఉద్యోగుల జేఏసీ నుంచి బయటికి రావాలి. రాష్ట్ర సర్కార్‌తో కొట్లాడాలి.

ఎంప్లాయీస్ జేఏసీ హర్షం

ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చూపిన చొరవకు తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ కృతజ్ఞతలు తెలిపింది. సీఎం, డిప్యూటీ సీఎంలకు ధన్యవాదాలు తెలిపింది. ఆదివారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడారు. శనివారం ముఖ్యమంత్రితో సమావేశంలో పీఆర్సీ, హెల్త్ కార్డులు, పెండింగ్ బకాయిలపై ప్రభుత్వ చిత్తశుద్ధి హర్షణీయమని తెలిపారు. సమావేశంలో పీ మధుసూదన్‌రెడ్డి, సదానందంగౌడ్, ఏ వెంకట్, కటకం రమేశ్, సంగి రమేశ్, ఎంబీ కృష్ణాయాదవ్, కే రామారావు, నోరి శ్రీనేశ్‌కుమార్, కస్తూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ వార్డెన్ల తొలగింపు అన్యాయం

హైదరాబాద్, మే3 (నమస్తే తెలంగాణ): మైనార్టీ గురుకులాల్లో పదేండ్లుగా పనిచేస్తున్న 265 మంది డిప్యూటీ వార్డెన్లను తొలగించడం అన్యాయమని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ నాన్-టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ రాజ్‌అహ్మద్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బీసీ ఉద్యోగ సంఘాన్ని గుర్తించండి

టీబీసీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ డిమాండ్

హైదరాబాద్, మే3 (నమస్తే తెలంగాణ): బీసీ ఉద్యోగుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న తెలంగాణ బీసీ ఉద్యోగ సంఘం(టీబీసీయూఎస్)ను ప్రభుత్వం అధికారికంగా గుర్తించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముకురాల చంద్రశేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.



బీటీఎన్జీవోస్ సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

టీఎన్జీవో రాష్ట్ర సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్

శేరిలింగంపల్లి, మే 3 : ప్రభుత్వ ఉద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యోగ జేఏసీ కృషి చేస్తున్నదని, ఈ విషయమై ప్రభుత్వంతో మాట్లాడినట్టు టీఎన్జీవో రాష్ట్ర సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ తెలిపారు. ఆదివారం గోపన్‌పల్లిలోని బీటీఎన్జీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ మాజీ అధ్యక్షుడు, దివంగత బంగారు స్వామినాథం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ టీఎన్జీవోస్(గచ్చిబౌలి) మ్యుచువల్ ఎయిడెడ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని, త్వరలోనే సమస్యలు పరిష్కారమవుతాయని హామీ ఇచ్చినట్టు చెప్పారు. గోపన్‌పల్లిలోని బీటీఎన్జీవోల స్థలవివాదానికి సంబంధించిన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే పరిష్కారం కానున్నట్టు తెలిపారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, భాగ్యనగర్ టీఎన్జీవో అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణగౌడ్, టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేని, కస్తూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సొంతకారునే అంబులెన్స్‌గా మార్చి..!

- ఇరవై ఏండ్లుగా క్షతగాత్రులకు మానవత్వంతో సేవలు
- జైపూర్ నివాసి సందీప్ గుప్తా బాధితులకు నిస్వార్థ సేవ



జైపూర్: అంబులెన్స్ కోసం ఎదురుచూస్తూ ఓ రోడ్డు ప్రమాద బాధితుడు తన కండ్ల ఎదుటే ప్రాణాలు కోల్పోవడం జైపూర్‌కు చెందిన సందీప్ గుప్తాను తీవ్రంగా కలిచి వేసింది. రెండు దశాబ్దాలుగా ఆయన తన సొంత కారునే అంబులెన్స్‌గా మార్చి 120 మందికి పైగా క్షతగాత్రులను సమీపంలోని దవాఖానాలకు తరలించారు. ఇందులో 35 మందికి సకాలంలో చికిత్స అందించి వారి ప్రాణాలను కాపాడారు. దీంతో ఆయన నిస్వార్థ సేవను మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ సహా పలువురు ఉన్నతాధికారులు ప్రశంసించారు. ఆయన సహకారం కారణంగా సకాలంలో చికిత్స పొందిన క్షతగాత్రులు ఆయన చేసిన మేలును మరువలేమని చెప్పారు. తన అంబులెన్స్ సేవల గురించి పన్ను సలహాదారుగా పనిచేసే సందీప్ వివరిస్తూ.. 22 ఏండ్ల క్రితం శాసనసభ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ వ్యక్తి తన కండ్ల ఎదుట ప్రాణాలు విడిచాడని... అంబులెన్స్ సకాలంలో రాకపోయినా గాయపడ్డ వారు వేచి ఉండకుండా చూడాలని ఆనాడే తాను సంకల్పించుకొన్నట్టు చెప్పారు. అందుకోసమే రోడ్డు ప్రమాదాల గురించి తన దృష్టికి వచ్చినప్పుడు గాయపడ్డ వారిని వెంటనే తన 'కార్ అంబులెన్స్'లో దగ్గరలోని దవాఖానకు చేర్చి చికిత్స అందేలా చూస్తానని తెలిపారు. ఇందుకోసం తన కారులో ప్రాథమిక చికిత్స సామగ్రి, దుప్పట్లు, అత్యవసర సూచికలు, అవసరమైతే సైరన్ వినిపించే సౌకర్యాన్ని అమర్చానని వెల్లడించారు. ట్రాఫిక్ పోలీసులు తన సేవకు సహకరిస్తారని.. క్షతగాత్రుల తరలింపు సమయంలో రోడ్లపై రద్దీని అత్యవసరంగా క్లియర్ చేస్తారని సందీప్ తెలిపారు.

ఆధార్ కార్డ్ ఫార్మాట్ మార్చే యోచన లేదు

క్యూఆర్ కోడ్ వార్తలపై కేంద్రం వివరణ

న్యూఢిల్లీ, మే 3: ప్రస్తుతమున్న 'ఆధార్ కార్డ్' ఫార్మాట్‌ను మార్చుతున్నట్టు వస్తున్న ఊహాగానాల్ని కేంద్రం కొట్టివేసింది. అలాంటి ప్రతిపాదనేదీ తమ ముందు లేదని, ఫొటోగ్రాఫ్, క్యూఆర్ కోడ్‌తో ఆధార్ కార్డును తీసుకొచ్చే ఆలోచనేదీ లేదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'ఈ ఏడాది చివరి నాటికి ఆధార్ కార్డ్ డిజైన్‌ను కేంద్రం మార్చబోతున్నదని సోషల్ మీడియాలో ప్రచారం, మీడియా సంస్థల నివేదికలు ప్రజల్ని అనవసరంగా గందరగోళపరుస్తున్నాయి. ఇవన్నీ తప్పుడు వార్తలు' అని కేంద్రం తెలిపింది. ఆధార్ కార్డ్‌పై ఆధార్ నంబర్, పేరు, అడ్రస్ సహా ఇతర వ్యక్తిగత వివరాల స్థానంలో క్యూఆర్ కోడ్‌ను తీసుకొస్తున్నట్టు వస్తున్న వార్తల్ని కేంద్రం ఖండించింది. ఆధార్‌కు సంబంధించి సోషల్‌మీడియాలో వచ్చే పోస్ట్‌లపై ప్రజలు ఆధారపడవద్దని కోరింది.

దేశంలో పత్రికా స్వేచ్ఛ పతనం

మీడియా సంఘాల ఆందోళన

న్యూఢిల్లీ, మే 2: దేశంలో పత్రికా స్వేచ్ఛ ప్రస్తుత స్థితిగతులపై మీడియా సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ విడుదల చేసిన 2026 ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో భారత్ 157వ స్థానానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో ఆదివారం న్యూఢిల్లీలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి పలువురు మీడియా సంఘాల ప్రతినిధులు, ప్రెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సీకే నాయక్, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి రాఘవన్ శ్రీనివాసన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భారత్‌లో పత్రికా స్వేచ్ఛ పరిస్థితులు దిగజారాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. పాత్రికేయులపై దాడులు యాదృచ్ఛికం నుండి ఉద్దేశపూర్వకంగా మారాయని అంతర్జాతీయ ప్రెస్ క్లబ్‌ల సంఘం అధ్యక్షుడు అవ్వాద్ అన్నారు. నిజం బయటకు రాకుండా అడ్డుకోవడానికి జరుగుతున్న వ్యవస్థీకృత ప్రయత్నమిదని అన్నారు. పాత్రికేయులకు సంఘీభావం అవసరమైన తరుణంలో సమన్వయంతో కూడిన ప్రతిఘటన జర్నలిస్ట్ సంఘాల నుంచి లేదంటూ సీకే నాయక్ వాపోయారు.

17 నెలలుగా ఎన్యుమరేటర్ల పడిగాపులు

- 1.16 కోట్ల ఇండ్లలో సర్వే.. లక్ష మందికిపైగా ఎన్యుమరేటర్లకు నేటికీ అందని గౌరవ వేతనం
- సర్వే పనిచేయించుకొని పైసలు ఎగ్గొట్టిన వైనం
- 10 రోజుల్లో ఇస్తామన్న హామీకి అతీగతీ లేదు
- రోడ్డెక్కుతున్న టీచర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు
- త్వరలో జన, కులగణన, శిక్షణకు వెళ్లనున్న టీచర్లు



హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సర్కార్ చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన (సీపెక్ సర్వే) ఫలితాలను మంత్రులు ఇటీవల అట్టహాసంగా విడుదల చేశారు. కానీ, ఈ భారీ గణాంకాల సేకరణ వెనుక శ్రమించిన లక్ష మందికి పైగా ఎన్యుమరేటర్ల కష్టాన్ని మాత్రం విస్మరించారు. సర్వే ముగిసి 17 నెలలు గడుస్తున్నా, నేటికీ తమకు రావాల్సిన పారితోషికం కోసం ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు కండ్లల్లో వత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నారు. 'పని మాది.. క్రెడిట్ మీది.. మరి పైసలెవరివి? అంటూ సర్కార్‌ను నిలదీస్తున్నారు. 2024 నవంబర్ 9న మొదలైన సర్వేలో భాగంగా 1,03,889 మంది ఎన్యుమరేటర్లు, సుమారు 10,000 మంది సూపర్‌వైజర్లు అహర్నిశలు శ్రమించారు. ఎన్యుమరేటర్లకు రూ.10 వేలు, సూపర్‌వైజర్లకు రూ.12 వేల చొప్పున గౌరవ వేతనం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో దరఖాస్తుకు రూ.20 చొప్పున చెల్లిస్తామని చెప్పి, డాటా ఎంట్రీ ఆపరేటర్ల చేత రాత్రింబవళ్లు పని చేయించుకున్నారు. సగటున ఒక్కో ఆపరేటర్‌కు రూ.6 వేలు అందాల్సి ఉండగా, 17 నెలలైనా నయాపైసా విదిల్చలేదు. త్వరలోనే జాతీయ జన, కుల గణన మొదలుకానున్నది. ఇందుకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాల షెడ్యూల్ రావాల్సి ఉన్నది. ఏడాదిన్నర క్రితం నెలపాటు కష్టించి పనిచేసిన వారి పారితోషికానికి దిక్కులేదు. జాతీయ జనగణన కూడా చేయమంటున్నారని, వీటి డబ్బులు తీసుకోవడానికి ఎంత కాలం ఎదురుచూడాల్సి ఉంటుందోనని ఎన్యుమరేటర్లు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

అవమానాలు భరించి.. లక్ష్యాలు చేధించి..

రాష్ట్రవ్యాప్తంగా 1,16,14,349 ఇండ్లను సందర్శించిన ఎన్యుమరేటర్లు, 75 రకాల ప్రశ్నలతో కూడిన సమాచారాన్ని సేకరించారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి అనేక ఛీత్కారాలు, అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ, ఉన్నతాధికారులు విధించిన లక్ష్యాలను పూర్తి చేశారు. సర్వే పూర్తయిన పది రోజుల్లోనే నేరుగా బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని నాడు ప్రభుత్వం నమ్మబలికింది. కానీ, నేడు ఆ ఊసే ఎత్తడం లేదు. సర్వే పారితోషికం కోసం ప్రభుత్వం రూ.50.90 కోట్లు మంజూరు చేసినట్లు గొప్పగా చెప్పుకున్నప్పటికీ, అవి క్షేత్రస్థాయి సిబ్బందికి చేరకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని జిల్లాల్లో నామమాత్రంగా చెల్లింపులు జరిపి, మెజారిటీ జిల్లాల్లో బకాయిలను అలాగే ఉంచడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది. అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయిన ఎన్యుమరేటర్లు, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు ఉధృతం చేశారు. ఇప్పటికే పలు జిల్లాల్లో కలెక్టరేట్లను ముట్టడించి, వినతిపత్రాలు సమర్పించారు. తక్షణమే తమ బకాయిలు చెల్లించకుంటే ముమ్ముందు ప్రభుత్వ కార్యక్రమాలను బహిష్కరిస్తామని హెచ్చరిస్తున్నారు.

సర్వే గణాంకాలు క్లుప్తంగా

మొత్తం ఇండ్లు:	1,16,14,349
పాల్గొన్నఎన్యుమరేటర్లు:	1,03,889
పర్యవేక్షకులు :	10,000 మంది
ఎదురుచూపులు:	17 నెలలు

పాతవాటికే దిక్కు లేదు.. కొత్తగా జనగణన

సీపెక్ సర్వే కోసం నెల రోజులు ఇల్లిల్లూ తిరిగి సర్వే చేసి ఎంపీడీవోకు వివరాలతో కూడిన పేపర్లు అందించాం. ఒక పూట పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించి, మరో పూట సీపెక్ సర్వే నిర్వహించినం. ఒకటి కాదు.. రెండు కాదు 17 నెలలుగా నాకు రావాల్సిన 10 వేల కోసం ఎదురుచూస్తున్నాం. సర్వే పారితోషికానికి సంబంధించి ఎవరినీ అడిగినా సమాధానం చెప్పడం లేదు. ఎంపీడీవో విధులు కేటాయించారు కానీ, వేతనాల గురించి అడితే మా దగ్గరకు రాలేవు అని చెప్తున్నారు. కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించి పలుమార్లు కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదు. ఇప్పటికి 17 నెలలు అయింది. నేటికీ సర్వే పారితోషికం అందలేదు. త్వరలో జాతీయ జన, కులగణన మొదలు కాబోతున్నది. నేటికీ పాత డబ్బులకు అతీగతీ లేదు. జాతీయ కుల గణన పారితోషికం ఎప్పుడొస్తదో ఏమో!' అని పేరు చెప్పడానికి ఇష్టపడని టీచర్ ఆవేదన వ్యక్తంచేశారు.

తిరుమలలో భారీ రద్దీ

- ఒక్కరోజే 91వేల మందికి స్వామివారి దర్శనం
- 16 గంటలు క్యూలోనే..

హైదరాబాద్, మే 3 (నమస్తేతెలంగాణ) : ఎండాకాలం సెలవుల నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శనివారం రికార్డు స్థాయిలో 91,005 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. స్వామివారికి 36,257 మంది తలనీలాలు సమర్పించుకున్నారని, భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం ఒక్కరోజే రూ.3.37 కోట్లుగా నమోదై రికార్డు సృష్టించినట్లు అధికారులు వెల్లడించారు. ఆదివారం భక్తుల రద్దీ మరింత పెరగడంతో సర్వ దర్శనం కోసం వేచి ఉండే భక్తుల క్యూలు ఏటీజీహెచ్ ప్రాంతం వరకు కొనసాగుతున్నది. దర్శన టోకెన్లు లేని సామాన్య భక్తులకు శ్రీవారిని దర్శించుకునేందుకు సుమారు 16 గంటలపైగా సమయం పడుతున్నది. సెలవులు ముగిసే వరకు భారీ రద్దీ కొనసాగే అవకాశం ఉన్నందున, టీటీడీ అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. భక్తులు రద్దీ దృష్ట్యా తమ ప్రయాణాలు సాగించాలని టీటీడీ కోరింది. సెలవుల కారణంగా భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరు గుతున్నదని, సెలువుల అనంతరం సాధారణ స్థాయికి చేరుకుంటుందని తెలిపింది.

రాష్ట్రంపై అల్పపీడన ద్రోణి ప్రభావం

రెండ్రోజులపాటు పలు జిల్లాల్లో వర్షాలు • హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : గత కొన్ని రోజులుగా భానుడి భగభగలతో అల్లాడుతున్న రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. వాతావరణంలో సంభవిస్తున్న మార్పులతో ఎండల నుంచి తాత్కాలిక ఉపశమనం కలిగే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 48 గంటలపాటు రాష్ట్రంలో అల్పపీడన ద్రోణి ప్రభావం కొనసాగే వీలున్నదని అధికారులు స్పష్టంచేశారు. రాష్ట్రంలోని తూర్పు జిల్లాల్లో కొనసాగుతున్న వడగాడ్పుల తీవ్రత నేటితో ముగియనుండగా, పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని చెప్పారు. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ సహా పలు జిల్లాలకు ఉరుములతో కూడిన వర్షం కురువనున్నట్టు హెచ్చరికలు జారీచేశారు. హైదరాబాద్‌లో మే 6 నుంచి వర్షాల తీవ్రత పెరుగనున్నదని వెల్లడించారు. ఆదివారం దాదాపు 12 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేశారు. నిజామాబాద్ జిల్లా మెండోరాలో 46 డిగ్రీలు, నల్లగొండ జిల్లా అనుముల, నిర్మల్ జిల్లా ఖానాపూర్, సిద్దిపేట జిల్లా తొగుటలో 45.9 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 45.8, పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో 45.8, ఖమ్మంలో 45.6, కరీంనగర్, మెదక్‌లో 44.6, మహబూబ్‌నగర్‌లో 44.2 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. ఆదివారం సాయంత్రం నల్లగొండ, యాదాద్రి భువనగిరి, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, ఖమ్మం, సూర్యాపేట, భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. సోమ, మంగళవారాల్లో కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని అధికారులు అంచనావేశారు.

పెరిగిన టమాటా ధరలు

- కిలో రూ.10 నుంచి రూ.50పైగా పెరుగుదల
- నెలరోజుల్లోనే తారుమారు

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): తెలుగు రాష్ట్రాల్లో టమాటా ధరలు మళ్లీ పెరిగాయి. ఏప్రిల్‌లో రూ.10కే కిలో పలికిన టమాటా.. ఇప్పుడు ఏకంగా రూ.50 దాటింది. ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పంట పండించిన రైతులకు మాత్రం మద్దతు ధర దొరకడం లేదు. ఎండల తీవ్రత, సాగు తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతుండగా.. క్షేత్రస్థాయిలో ట మాటా రైతు గోడు మాత్రం మరోలా ఉంది. హైదరాబాద్‌లోని హోల్‌సేల్ మార్కెట్లలో కిలో రూ.30 నుంచి రూ.40 మధ్య అమ్ముడవు తుండగా, రిటైల్ షాపులు, సూపర్ మార్కెట్లలో కిలో రూ.50 నుంచి రూ. 60కి చేరుతున్నది.

అప్పుడు ధర లేదు.. ఇప్పుడు పంట లేదు

టమాటా ధరలు పెరుగడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ తమవద్ద తగినంత పంట లేదని వాపోతున్నారు. నెల రోజుల క్రితం వ్యాపారులు రైతుల దగ్గర నుంచి కిలో టమాటా రూపాయికే కొనుగోలు చేశారు. మార్కెట్‌లో ప్రజలకు రూ.5 నుంచి రూ.15 వరకు అమ్మారు. అయితే కూలీల ఖర్చులు, రవాణా చార్జీలు కూడా రాకపోవడంతో విసుగు చెందిన రైతులు పంటను కోయకుండా పొలాల్లోనే వదిలేశారు. కొందరు రోడ్లపై పారబోసి నిరసన తెలుపుతున్నారు.



తల్లిని ముద్దాడి ఆశీర్వాదం తీసుకుంటున్న డీజీపీ ఆనంద్

తల్లి ఆశీస్సులు అందుకున్న డీజీపీ

అమ్మ ప్రగాఢ వాంఛ నెరవేరింది: సీవీ ఆనంద్

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): ఢిల్లీకి రాజైనా.. ఓ తల్లికి కొడుకే అన్న చందంగా తెలంగాణ పోలీస్ బాస్ అయిన తర్వాత డీజీపీ హోదాలో సీవీ ఆనంద్ ఆదివారం తన తల్లి యశోదాదేవి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ విషయాన్ని తన ఎక్స్ ఖాతాలో ఆయన పంచుకున్నారు. 'మా అమ్మను పరామర్శించి ఆమె ఆశీర్వాదం తీసుకున్నాను. నవంబర్–జనవరి మధ్యలో చాలా అనారోగ్యంతో ఉన్నారు. ఇప్పుడు పూర్తిగా మంచానికే పరిమితమైనప్పటికీ త్వరగానే కోలుకున్నారు. తన కొడుకు ఈ రాష్ర్టానికి డీజీపీ కావాలన్న ఆమె ప్రగాఢ వాంఛను నెరవేర్చానని నాకు అనిపించింది. ఆమె నన్ను ఆశీర్వదించి ఎంతో సంతోషించారు. నేను కూడా చాలా సంతోషంగా ఉన్నాను' అంటూ తల్లి యశోదాదేవి ఆశీర్వదిస్తున్న ఫొటోలను షేర్ చేశారు.



కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలో యాకూబ్ మృతదేహాన్ని తోపుడు బండిపై ఇంటికి తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

తోపుడుబండిలో డెడ్‌బాడీ తరలింపు!

- *అనారోగ్యంతో కొడుకు మృతి*
- *మృతదేహాన్ని తరలించేందుకు తల్లిదండ్రుల ఇక్కట్లు*
- *కేశవపట్నంలో ఘటన*

శంకరపట్నం, మే 3: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో హృదయవిదారక ఘటన చోటుచేసుకున్నది. తోపుడుబండిపై పండ్లు విక్రయించి జీవనోపాధి పొందే ఆ దంపతుల కుమారుడు అనారోగ్యంతో మృతిచెందాడు. కొడుకు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు ఆ తల్లిండ్రులు చేసిన ప్రయత్నాలన్నీ విఫలం అయ్యాయి. దీంతో వారు తోపుడు బండిలోనే కొడుకు మృతదేహాన్ని తరలించగా.. ఈ ఘటన చూపరులను కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళ్తే.. కేశవపట్నం గ్రామానికి చెందిన ఎల్కపెల్లి వీరయ్య–రుక్కమ్మ గ్రామంలోని మెయిన్ రోడ్డుపై పండ్లు విక్రయించి జీవనోపాధి పొందేవారు. వీరి కుమారుడు యాకూబ్(38) అనారోగ్యానికి గురయ్యాడు. ఆదివారం సాయంత్రం తల్లిదండ్రులు కొడుకును మెయిన్ రోడ్డుపై ఉన్న తమ రేకుల షెడ్డుకు తీసుకువచ్చి 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చిచూడగా అప్పటికే యాకూబ్ చనిపోవడంతో వారు తిరిగివెళ్లిపోయారు. వారు పండ్లు అమ్ముకునే తోపుడు బండిలోనే కొడుకు మృతదేహాన్ని తరలించగా, ఈ ఘటన చూపరులను కంటతడి పెట్టించింది.

పోలీస్ కానిస్టేబుల్ మిస్సింగ్!

- షీటీమ్స్ హెడ్‌కానిస్టేబుల్ సురేశ్ అదృశ్యం
- డీసీపీ గన్‌మెన్ తిట్టాడని తీవ్ర మనస్తాపం
- సైఫాబాద్ పీఎస్‌లో మిస్సింగ్ కేసు నమోదు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో షీటీమ్స్ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సురేశ్ అదృశ్యమయ్యాడు. ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ లావణ్యానాయక్ జాదవ్ గన్‌మెన్ సురేశ్‌ను దుర్భాషలాడటం ఇందుకు కారణమని తెలుస్తున్నది. వివరాల్లోకి వెళ్తే.. ఓ మహిళ వ్యక్తిగత వివరాలు కావాలని ఆ గన్‌మెన్ అడగడంతో అనధికారికంగా ఆ వివరాలు ఇవ్వలేనని సురేశ్ సమాధానమిచ్చాడు. దీంతో ఆగ్రహానికి గురైన ఆ గన్‌మెన్ అందరిముందే ఆ హెడ్‌కానిస్టేబుల్‌ను బూతులు తిట్టాడు. దీనిపై డీసీపీకి, ఏసీపీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెందిన సురేశ్ శనివారం సాయంత్రం తన ఉద్యోగానికి రాజీనామా చేసి, పత్తా లేకుండా పోయారు. సురేశ్.. రాత్రి ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య అధికారులు, పోలీసులకు ఫోన్‌చేసి ఆరా తీశారు. దీంతో అసలు వ్యవహారం బయటకొచ్చింది. కార్యాలయం వెలుపల ఉన్న సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా.. రెండు చోట్ల ట్యాంక్‌బండ్ రెయిలింగ్ ఎక్కిన సురేశ్.. జనం సందడి ఉండటంతో దిగిపోయినట్టు రికార్డయింది. సురేశ్ భార్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపారు.

లేట్‌గా వస్తే సీఎల్ కట్

మొదటిపేజీ తరువాయి...

క్యాజువల్ లీవులకు కోత పెట్టనున్నారు. అయిపోయాక ఈఎల్స్‌లో కోత పెడుతారు. కార్యాలయ సూపరింటెండెంట్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు కార్యాలయ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం అధికారులు ఉద్యోగుల ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు, సెలవుల ఖాతాలను నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. హాజరు వివరాలను ప్రతి నెల 20వ తేదీలోపు అకౌంట్స్ ఆఫీసర్‌కు నివేదిక సమర్పించాలని సూచించారు.

హాజరు – కోతలిలా..

- ఉద్యోగులను ఉదయం 10.40గంటల వరకే అనుమతిస్తారు. ఆ సమయంలోపే ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో లాగిన్‌కావాలి.
- ఉదయం 10.41 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు వచ్చే వారి విషయంలో అత్యంత కఠినంగా ఉంటారు. నెలలో మూడు రోజులు ఇలా లేట్ వస్తే ఒక క్యాజువల్ లీవ్ (సీఎల్) కింద పరిగణిస్తారు. సీఎల్స్‌ను కట్‌చేస్తారు.
- ఉద్యోగులు సాయంత్రం ఐదు గంటల తర్వాతే కార్యాలయాలు వదిలివెళ్లాలి. సాయంత్రం 4 గంటల్లోపు కార్యాలయం వదిలి వెళ్తే ఒక పూట(ఆఫ్‌డే) క్యాజువల్ లీవ్‌గా పరిగణిస్తారు.. సాయంత్రం 4 – 5 గంటల మధ్యలో కార్యాలయం వదిలి వెళ్లినా డుమ్మా కిందే పరిగణిస్తారు. ఇలా వరుసగా మూడు రోజులు ముందు వెళితే ఒక క్యాజువల్ లీవ్ (సీఎల్)గా పరిగణిస్తారు.
- బయట ఏదైనా శాఖపరమైన పని ఉంటే సంబంధిత అధికారి అనుమతి తప్పనిసరి. లేదంటే డుమ్మా కొట్టినట్టుగానే పరిగణించి సెలవులు, లేదంటే జీతం కట్‌చేస్తారు.

భవిష్యత్తులో టీచర్లకూ..

విద్యాశాఖ డైరెక్టరేట్‌లో పనిచేసే బోధనేతర సిబ్బందికి ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు విషయంలో విద్యాశాఖ తాజాగా ఉత్తర్వులిచ్చింది. అయితే ఇవే నిబంధనలను టీచర్లకు



సైతం వర్తింపజేస్తారనే ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రంలో లక్ష మందికి పైగా టీచర్లు ఉన్నారు. వీరికి సైతం ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరును అమలు చేస్తున్నారు. అయితే సెలవులు, జీతానికి కోత పెట్టడం లేదు. కొందరు టీచర్లు అదే పనిగా విధులకు గైర్హాజరవుతున్నారు. ఇటీవలే జోగుళాంబ గద్వాల జిల్లాలో 76 మంది టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. మిగతా జిల్లాల్లోనూ కొందరికి నోటీసులిచ్చారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇంతవరకు ఆన్‌డ్యూటీ ఇవ్వలేదు. కానీ సంఘాల నాయకుల్లో అత్యధికంగా విధులకు దూరంగా ఉంటున్నారు. దీనిని సీరియస్‌గా పరిగణిస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభంకాగానే ఆలస్యంగా వెళ్లిన టీచర్ల సీఎల్స్, ఈఎల్స్‌కు కోత పెట్టబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతున్నది.

బానెట్‌పై 2 కి.మీ. దూరం లాక్కెళ్లి..

- హైదరాబాద్‌లో 'హిట్ అండ్ రన్' ఘటన
- సోషల్ మీడియాలో వైరల్
- పోలీసుల అదుపులో నిందితుడు



బడంగ్‌పేట, మే 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని మీర్‌పేటలో 'హిట్ అండ్ రన్' ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం గాయత్రీ నగర్ నుంచి ద్విచక్రవాహనంపై ఎల్‌బీనగర్ వైపు వెళ్తున్న జిలానీ, ఆయన కుమారుడు ఫైజల్‌ను ఓ క్యాబ్ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఫైజల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై వాగ్వాదం జరుగడంతో జిలానీపై క్యాబ్‌లోని వ్యక్తి దాడి చేశాడు. ఆ తర్వాత క్యాబ్ డ్రైవర్ నీలకంఠం సత్యనారాయణ అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించడంతో ఆపేందుకు జిలానీ ప్రయత్నించాడు. ఆ క్రమంలో జిలానీ బానెట్‌పై ఉన్నప్పటికీ కారును ఆపకుండా డ్రైవర్ దాదాపు 2 కి.మీ. దూరం లాక్కెళ్లాడు. బాలాపూర్‌వైపు వేగంగా వెళ్లిన ఆ క్యాబ్ తిరిగి మందమల్లమ్మ చౌరస్తా వద్దకు రాగానే స్థానికులు అడ్డుకున్నారు. దీంతో కారును ఆపిన డ్రైవర్.. జిలానీని వదిలి పరారయ్యాడు. బ్యానెట్‌పై లాక్కెళ్లడంతో జిలానీకి కూడా గాయాలయ్యాయి. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వెలుగులోకి వచ్చింది. దీంతో మీర్‌పేట పోలీసులు కేసు నమోదుచేసి, నిందితుడు నీలకంఠం సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు.

జిందగీ
చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 4 మే 2026
www.ntnews.com

సాధనాత్ సాధ్యతే సర్వమ్

ఆధ్యాత్మిక పథంలో 'సాధన' అనగానే మనకు ముందుగా గుర్తొచ్చేవి క్రమశిక్షణ, నియమాలు, కొంత కఠినత్వం. కానీ నిజమైన సాధన అంటే కేవలం ఒక యాంత్రికమైన ప్రక్రియ కాదు. అది అంతరంగాన్ని శుద్ధి చేసే ఒక మధురమైన ఆస్వాదన. చాలామంది సాధనను ఒక 'శిక్ష'లా భావిస్తారు. కానీ, ఒక సంగీత విద్వాంసుడు స్వరాలను ఎలా ఆస్వాదిస్తాడో, ఒక చిత్రకారుడు రంగులను ఎలా ప్రేమిస్తాడో, సాధకుడు తన ధ్యానాన్ని అలాగే ప్రేమించాలి. 'సాధన' ఆస్వాదనగా మారినప్పుడు, ఫలితం కంటే ఆ ప్రయాణమే మనకు అమితమైన ఆనందాన్ని ఇస్తుంది.



మనం చేసే పనిలో పూర్తిగా నిమగ్నమైనప్పుడు కాలం తెలియదు, అలసట ఉండదు. ఆ పని మనకు ఒక ధ్యానంలా మారుతుంది. మొదట్లో కష్టంగా అనిపించినా, సాధన చేసే కొద్దీ ఆ విషయంలో మనకు పట్టు చిక్కుతుంది. ఆ చిన్న చిన్న విజయాలు మనకు తెలియని ఉత్సాహాన్ని, సంతృప్తిని ఇస్తాయి. గమ్యాన్ని చేరుకోవడం ముఖ్యం కాదని కాదు, కానీ ఆ గమ్యం వైపు వేసే ప్రతి అడుగునీ ప్రేమించినప్పుడే సాధన ఒక కళ అవుతుంది. నిత్య జీవితంలో కొంత సమయాన్ని దైవ చింతనకో, ధ్యానానికో కేటాయించడం ఒక అలవాటుగా మొదలవుతుంది. సంసార బాధ్యతలు నిర్వర్తిస్తూనే, మనసును ఉన్నత స్థితికి మళ్లించే ప్రయత్నం చేయడం మనసులో నిలకడను పెంచుతుంది. రోజువారీ ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తూ, అంతర్గత శాంతికి దారి తీస్తుంది.

సాధనలో అతిపెద్ద రుచి ఎక్కడుందంటే అది వర్తమాన క్షణంలో ఉండటమే. గతాన్ని తలచుకోకుండా, భవిష్యత్తు గురించి ఆందోళన చెందకుండా, ఈ నిమిషంలో దైవత్వాన్ని లేదా ప్రకృతిని అనుభూతి చెందడం ఒక గొప్ప కళ. లోకం వైపు చూసే కళ్లను లోపలికి మళ్లించడమే సాధనలో అసలైన మలుపు. బయటి ప్రపంచంలో మనం వెతికే సంతోషం తాత్కాలికం. కానీ, సాధన ద్వారా మన లోపల ఉన్న శాంతిని ఆస్వాదించడం మొదలుపెడితే, అది అక్షయ పాత్రలా ఎప్పుడూ నిండే ఉంటుంది. ఫలితం వెంటనే రాకపోయినా కృంగిపోకూడదు. సాధన అనేది గమ్యం కాదు, అది ఒక ప్రయాణం. ఆ ప్రయాణంలో ప్రతి అడుగునూ ఆస్వాదించాలి. ఎప్పుడైతే సాధన అలవాటుగా కాకుండా అనుభూతిగా మారుతుందో, అప్పుడే మనిషిలో దైవత్వం మేల్కొంటుంది. మనసును పరిమళించే పువ్వులా మార్చుకోవడమే ఈ 'సాధన' వెనుక ఉన్న అసలైన పరమార్థం.

సాధారణ 'సాధన' మనల్ని సంస్కరిస్తే, 'తీవ్ర సాధన' మనల్ని రూపాంతరం చెందించి పరమాత్మతో అనుసంధానం చేస్తుంది. మొదట సాధనను ఒక ఆస్వాదనగా మొదలుపెడితే, అది క్రమంగా తీవ్రమైన అనుభూతిగా మారుతుంది. 'సాధన'లో ప్రయత్నం ఉంటుంది (దీపం గాలికి రెపరెపలాడుతూ వెలగడం), 'తీవ్ర సాధన'లో తపన ఉంటుంది (గాలి లేని చోట నిశ్చలంగా వెలిగే దీపం), 'తీవ్రాతితీవ్ర సాధన'లో కేవలం పరమాత్మ మాత్రమే ఉంటాడు (సూర్యకాంతిలో దీపం జ్యోతి కలిసిపోవడం). మొదటి మెట్టు మీద అడుగు వేస్తేనే, ఆఖరి మెట్టు అయిన ఆత్మానందాన్ని చేరుకోగలం. తీవ్ర సాధననే 'తపస్సు' అని కూడా అంటారు. ఇక్కడ సాధకుడికి లక్ష్యం పట్ల తప్ప మరో దాని మీద ధ్యాస ఉండదు.

..✍ ఆనంద మైత్రయమ్
8008 577 834

దైవదర్శనం కోసం ఆలయంలోకి ప్రవేశించే సమయానికే మనకు మంత్రాలు వినిపిస్తుంటాయి. ఆలయంలోని ప్రధాన దైవానికి సంబంధించిన మంత్రం.. ఆ ప్రాంగణంలో లీలగా మార్మోగుతూ ఉంటుంది. ఓంకారం మొదలైన మంత్రాలను వినటంతోనే మన మనసుకు ఏదో తెలియని ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుంది. మంత్రం వినగానే ఒక్కసారిగా మన చుట్టూ ఉన్న వాతావరణంలో ఏదో మార్పు కలిగినట్లు అనిపిస్తుంది. ఓ విధమైన ప్రశాంతత కలుగుతుంది. ఆధ్యాత్మిక భావాలు ఉప్పొంగుతాయి. ఇవన్నీ జరగటానికి కారణం మంత్రాలకు ఉన్న మహత్తరమైన శక్తి.

మహిమోపేతం.. మంత్రం



ఆలయంలోని అర్చకస్వాములు చదివే మంత్రాల్లో మహత్తరమైన శక్తి ఉంటుంది. అవి కేవలం భగవంతుడిని ప్రసన్నం చేసుకోవటానికి చేసే స్తోత్రాలు మాత్రమే కాదు. మనలో నిద్రాణమై ఉన్న ఆధ్యాత్మిక చైతన్యాన్ని జాగృతం చేసే చైతన్యదీపాలు. మంత్రంలోని ప్రతి అక్షరం వెనుకా మాటల్లో వర్ణించలేనంత గొప్ప శక్తి దాగి ఉంటుంది. భక్తుడు నిరంతర సాధన ద్వారా ఈ శక్తిని పొందగలుగుతాడు.

మంత్రం అంటే..

'మంత్రం' అనే పదానికి అనేకమైన అర్థాలు ఉన్నాయి. పద వ్యుత్పత్తి ప్రకారం పరిశీలిస్తే, 'మననాత్ త్రాయతే ఇతి మంత్రః' – నిరంతరం మననం చేసే వారిని రక్షించేది మంత్రం అని అర్థం. మరొక కోణంలో పరిశీలిస్తే, మంత్రం అనే పదంలో 'మ' అంటే మననం చెయ్యటం. 'త్రం' అంటే 'త్రాణం' (రక్షించేది అని అర్థం). అదేపనిగా, మంత్రాన్ని నిశ్చలమైన భక్తితో ఉపాసన చేసినట్లయితే, ఆ మంత్రశక్తి మరింతగా పెరుగుతుంది. మంత్రానికి అధిష్ఠాన దేవత అనుగ్రహం కలుగుతుంది. అందుకే మననం చేసేవారిని రక్షించేది మంత్రం అయింది.

'మంత్రం' అనే పదానికి ఇంకా అనేకమైన అర్థాలు ఉన్నాయి.

- భక్తుడి హృదయం నుంచి ప్రకటితమయ్యే శక్తి మంత్రం అవుతుంది.
- భక్తుడి మనసులో కలిగే దైవీకమైన భావాలకు ఏర్పడే బీజాక్షర రూపమే మంత్రం.
- దేవతలకు కల్పించే అక్షరాకృతి మంత్రం.
- అనుకున్న కార్యాన్ని సాధించటానికి పారవశ్యం కలిగేంతవరకు ఓ శబ్దాన్ని (అక్షరం లేదా అక్షరాల సమూహం) అదే పనిగా పునశ్చరణ చెయ్యటం లేదా త్రికరణ శుద్ధిగా జపించటమే మంత్రజపం అవుతుంది. ఆ శబ్దం మంత్రం అవుతుంది.

ఆలయంలో కంటికి కనిపించే దేవతామూర్తుల విగ్రహాలు సగుణ స్వరూపం అయితే మంత్రం అనేది నిర్గుణ స్వరూపానికి ప్రతీక. ఎలాగైతే, విత్తనం అతి చిన్నగా ఉండి, క్రమంగా పెరిగి అతి పెద్ద వృక్షంగా మారుతుందో, చిన్నగా కనిపించే మంత్రం, భక్తుడు చేసే సాధన ద్వారా అనంతమైన శక్తిని సంపాదించుకుని, వారిని సర్వకాల సర్వావస్థల్లో రక్షిస్తుంది.
'మంత్రాధీనో దేవతాః'– దేవతలు మంత్రాలకు అధీనమై ఉంటారని శాస్త్రాలు చెబుతున్నాయి. మొత్తం ప్రపంచమంతా దైవానికి ఆధీనమై ఉంటే, దైవం మాత్రం మంత్రానికి కట్టుబడి ఉంటుంది. అదీ మంత్రానికి ఉన్న గొప్ప శక్తి. కాబట్టి, మంత్రాన్ని ఏవో కొన్ని అక్షరాల సమూహంగానో, కొన్ని శబ్దాల అపరిమితమైన ఉచ్చారణగానో భావించకూడదు.

బీజాక్షరాలే మంత్రాలు

మంత్రం శబ్దరూపంలో ఉండే దైవం. మంత్రాన్ని ధ్యానిస్తున్నప్పుడు ఆ మంత్రశక్తి భక్తుడు/ సాధకుడి అణువణువులో వ్యాపిస్తుంది. మంత్ర జపం చెయ్యటానికి ముందు, ఆ వ్యక్తిలో ఉన్న అజ్ఞానం తొలగిపోతుంది. భక్తుడిలో అంతర్గతంగా ఉన్న దైవీకమైన శక్తులు జాగృతమవుతాయి. జ్ఞానోదయం అవుతుంది. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్య మాలిన్యాలు తొలగిపోతాయి. మనసు నిశ్చలమై, సచ్చిదానంద స్థితి కలుగుతుంది.
అత్యంత శక్తిమంతమైన బీజాక్షరాలతో ఏర్పడినవే మంత్రాలు. శక్తికి, శబ్దానికి అవినాభావ సంబంధం ఉంది. శబ్దంలో స్పందన ఉంటుంది. మంత్రాన్ని సక్రమంగా ఉచ్చరించినట్లయితే, ఆ మంత్రంలో ఉన్న బీజాక్షరాల్లో స్పందన కలిగి, అత్యద్భుతమైన శక్తి ఉత్పన్నమవుతుంది. మంత్రాల నుంచి ఉత్పన్నమయ్యే శబ్దతరంగాలు అమోఘమైన శక్తి కలిగి ఉంటాయి. ఇవి జీవుల మీదా, ప్రకృతి మీదా, సృష్టి మీదా స్పష్టమైన ప్రభావాన్ని చూపిస్తాయి. ఈ విషయాన్ని పలు అధునాతన శాస్త్ర పరిశోధనలు కూడా ఒప్పుకొన్నాయి.
జీవుల్లో ఉండే అంతరంగిక శక్తులతోపాటు ప్రకృతిలో ఉండే అదృశ్య శక్తుల్ని కూడా మంత్రాల్లో ఉండే బీజాక్షరాలు ప్రేరేపిస్తాయి. వర్షాలు కురిపించడం, దీపాలు వెలిగించడం మొదలైన వాటిని శబ్దతరంగాల ప్రక్రియతో మన పూర్వికులు సాధించి చూపించారు. అణువులను కదిలించే శక్తి శబ్ద తరంగాలకు ఉండడం వల్లే ఇవన్నీ సాధ్యమవుతాయి. అందుకే ప్రతి అక్షరం బీజాక్షరం. ప్రతి బీజాక్షరం దేవతాశక్తి స్వరూపం.

తదేక లక్ష్యంలో మంత్రాన్ని ఉపాసన చేసినట్లయితే భక్తుడు చేస్తున్న సాధన ఫలిస్తుంది. అయితే, కేవలం నోటిమాటగా భక్తుడు మంత్రాన్ని పలకటం వల్ల ఫలితాలు కలగవు. మానసిక ఏకాగ్రతతో, త్రికరణ శుద్ధిగా మంత్రం జపం చెయ్యాలి. తాను నమ్ముకున్న దైవం పట్ల, ఎంచుకున్న మంత్రం పట్ల, మంత్రోపాసన చేసిన గురువు గారి (కేవలం గురువు గారి నుంచే మంత్రోపదేశం పొందాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ పుస్తకాలను చూసి మంత్ర సాధన చెయ్యకూడదు. ఇది విపరీతమైన ఫలితాలను ఇస్తుంది) పట్ల అచంచలమైన భక్తి విశ్వాసాలు ఉండాలి. అప్పుడే మంత్రం ఫలిస్తుంది. మంత్రశక్తి మనం కోరుకున్న ఫలితాలను అందిస్తుంది.

..✍ డాక్టర్ కప్పగంతు రామకృష్ణ

దాన లక్షణాలు..

గీతాసారం

దాతవ్యమితి యద్దానం దీయతేఽనుపకారిణే
దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్||
యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వా పునః
దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్||
అదేశకాలే యద్దానం అపాత్రేభ్యశ్చ దీయతే
అసత్కృతమవజ్ఞాతం తత్తామసముదాహృతమ్||
(భగవద్గీత – 17వ అధ్యాయం...20, 21, 22)

దీయతే ఇతిదానం.. అవతలి వ్యక్తికి ఉపయుక్తమయ్యేది ఇవ్వడం దానం అనిపించుకుంటుంది. దానాన్ని మూడు విధాలుగా చెబుతారు. అడిగినవారికి అడిగినది ఇచ్చేవాడు దాత. అడిగిన దానికన్నా ఎక్కువగా ఇచ్చేవాడు వదాన్యుడు. అడగకుండానే అనుగ్రహించేవాడు ఉదారుడు. అలాగే పుణ్యాన్నో మరే ప్రయోజనమో ఆశించి ఇచ్చినా.. ఇచ్చిన దానికి ప్రతిగా మరొకటి తీసుకున్నా అది వ్యాపారం అవుతుందే కాని దానం కాదు. ఇతరుల మెప్పు కోసం, గొప్ప కోసం ఇచ్చేది లేదా అపాత్రులకు ఇచ్చేది కూడా దానం అనిపించుకోదు. దాన లక్షణాలను భగవద్గీత.. సాత్విక, రాజస, తామస దానాలుగా చూపింది. నిష్కామంగా అంటే ప్రతిఫలాపేక్ష లేకుండా, సరైన స్థలంలో సరైన కాలంలో, వ్యక్తి పాత్రాపాత్రతలను గుర్తించి, ఇచ్చే దానం సాత్త్విక దానం. ఇష్టం ఉన్నా లేకున్నా ప్రతిఫలాన్ని ఆశించి, సముచితంగా చేసేదానం రాజస దానం. స్థలకాల, అర్హత నియమాలేవీ పాటించకుండా అవివేకంగా, అనుచితంగా.. నిర్లక్ష్యంగా ఇచ్చేది తామస దానం.

దానం ఎలా చేయాలో తైత్తరీయ ఉపనిషత్తు శిక్షావల్లిలో చక్కగా చెపుతుంది. శ్రద్ధయా దేయమ్.. శ్రద్ధతో (భక్తితో) ఇవ్వాలి, అశ్రద్ధయా అదేయమ్.. అశ్రద్ధగా ఇవ్వకూడదు, శ్రియా దేయమ్.. శక్తి మేరకు, సమృద్ధిగా ఇవ్వాలి.. హ్రియా దేయమ్.. వినయంతో ఇవ్వాలి, భియా దేయమ్.. బాధ్యతతో ఇవ్వాలి, సంవిదా దేయమ్, వివేకంతో, అర్హత చూసి ఇవ్వాలి.. శ్రద్ధ, వినయం, వివేకం కలగలిపిన భావనతో హృదయపూర్వకంగా ఇచ్చేదానమే ఉత్తమమైనది. హృదయం అనేది అంతఃకరణానికి సంబంధించినది. అంతఃకరణ శుద్ధిగా దానం చేయాలి. హృదయాన్ని ప్రతీకాత్మకంగా చెపితే 'హృ' అంటే తీసుకోవడం, 'ద' అంటే ఇవ్వడం, 'యం' అంటే యానం, నడక.. ఉదాత్తమైన భావనలను నలు మూలల నుంచి గ్రహించి, సమున్నత సమాజ నిర్మాణంలో సాధించిన విజ్ఞానాన్ని భిత్తికలుగా అందిస్తూ.. జ్ఞాన మార్గాన్ని అర్హులకు అందించే జ్ఞానధనులందరూ దాతలే.

నిజానికి, అడగడం, ఇవ్వడం రెండూ అద్భుత సన్నివేశాలు. ఆ సందర్భంలో యాచించే వాడు ఎంత గొప్పవాడయినా చేయి చాస్తాడు, ఎదుటి వాని ఆధిక్యతను అంగీకరిస్తాడు. వాని చేయి కింద ఉంటుంది. ఇచ్చే వాడూ చేయి చాస్తాడు. తీసుకునే వాని గొప్పదనాన్ని గుర్తిస్తాడు. వాని చేయి పైన ఉంటుంది. ఈ ప్రక్రియలో ఇచ్చేవాడు, 'నేను', 'ఇస్తున్నాను' అనే అహంభావాన్ని తెలిసిగాని, తెలియకగాని ప్రదర్శిస్తాడు. ఆ అహంకారం తామస, రాజస, సాత్విక అహంకారాలుగా ప్రదర్శితమవుతుంది. తీసుకునే వానిపై ఆధిక్యతా భావన చూపితే అది తామస అహంకారం అవుతుంది. ఉన్నది పంచుకుంటున్నాననే భావనతో ఇస్తే అది రాజస అహంకారం. ఇవ్వడం వల్ల నా సంపద చరితార్థమవుతుందనే భావనతో ఇవ్వడం సాత్విక అహంకారం అవుతుంది. ఏ భావనా లేకుండా ఇవ్వడం దివ్యత్వమవుతుంది.



ఈ సన్నివేశాన్ని మరొక విధంగా చూస్తే.... అడగడం– అమాయకత, అభిలాష – ఇస్తాడా లేదా తెలియదు. ఇస్తే ఎంత ఇస్తాడనే అంచనా లేదు. ఇందులో ఆశ ఉంది, ఆశ్చర్యం ఉంది. ఇది బాల్యావస్థకు సంకేతం. తీసుకోవడం– విలువలకు ప్రాతిపదిక, అవసరానికి మించి ఆశించడం సమంజసం కాదు. ఇది యౌవనావస్థకు ప్రతీక. ఉన్నదానిని ఇతరులతో పంచుకుంటే... ఆప్యాయత, ఆదరణ, ఇతరుల ప్రేమను పొందగల అవకాశం ఉంది. ఇది ప్రౌఢత్వానికి చిహ్నం. తనవద్ద ఉన్నది ఉదారంగా ఇవ్వడం.. వివేకం, సమైక్యత, వివేచనను పొందుతాం. ఇది వార్ధక్యాన్ని సూచిస్తుంది.
ఈ భావనలను యాజమాన్య నిర్వహణకు ప్రతీకగా చెప్పుకొంటే.. ఇవ్వడం తీసుకోవడం సమానమైన అవసరమైన ప్రక్రియలు, ప్రతీ యాజమాన్య విధానం ఇవ్వడం–తీసుకోవడం సమతుల్యతపై ఆధారపడి ఉంటుంది. ఇవ్వడమనేది అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించటం/ పంచుకోవడంగా చెప్పుకోవచ్చు. యాజమాన్యంలో ఇది నిర్వహణ, బృందంలో సమతుల్యతను సాధించడం, బృందాన్ని బలోపేతం చేయడంగా చెప్పవచ్చు. ఉద్యోగులకు అవసరమైన వనరులు, సమాజానికి సేవ, కృషి ఫలాలను పంచడం ఇవ్వడంగా భావిస్తాం.

తీసుకోవడం అంటే బాధ్యతాయుతంగా స్వీకరించడం. దాని విలువలను అవగాహన చేసుకోవడం, సమర్థంగా, వ్యర్థపరచకుండా వినియోగించడం. ఇవ్వడం, తీసుకోవడం.. అవగాహన పెంచుకోవడం, విశ్లేషణ చేసుకోవడం.. తిరిగి సమాజానికి ఇవ్వడం.. ఈ ప్రక్రియ పునరావృతం కావడం జరుగుతుంది.

...✍ పాలకుర్తి రామమూర్తి

ఉపనిషత్ వాక్యం



పరిశుభ్రత ఛాందసం

అసంగోఽహ్యయం పురుషః

'ఆత్మకు ఏదీ అంటదు. శుచి అశుచి మన శరీరాలకే' అంటుంది బృదారణ్యక ఉపనిషత్తు (6–3–16).
ఆంజనేయుడు ద్రోణాద్రిపై తపస్సు చేసుకొంటూ రోజూ ఉదయాన్నే వచ్చి శ్రీ రాముడికి తైలం మర్దించి తల స్నానం చేయించి వెళ్లేవాడట. దారిలో ఒక పట్టణంలో శ్రీమంతుడైన వైశ్రవణుడు అనే వైశ్యుడు ఉండేవాడు. 'రాముడే ప్రత్యక్ష దైవం. అయోధ్యకు వెళ్లావా' అని ఎవరైనా అడిగితే 'నాక్కెడిది తీరిక' అనేవాడు. ఒక జ్ఞాని ఎప్పుడైనా రామ నామం స్మరించు అన్నాడు. వైశ్యుడు మల విసర్జన వేళలోనూ స్మరించవచ్చా! అని అడిగితే... 'పరిశుభ్రత శరీరానికే! మనసుకు కాదు. స్మరణ మనసుతో కదా! ..' అన్నాడు. ధనం మీది ధ్యాసతో మల విసర్జన బాధాకరమైనప్పుడల్లా వైశ్రవణుడు 'రామ నామ స్మరణ' చేయసాగాడు. ఒకసారి హనుమ అయోధ్యకు వెడుతూ ఇది చూశాడు. 'ఛీ!ఛీ!' అనుకొని తక్కువ ఎత్తులో ఎగురుతూ ఆ వైశ్యుని వీపున ఒక్క చరుపు చరిచాడు.
తరువాత అయోధ్య చేరి శ్రీ రాముడికి నూనె రాస్తున్నాడు హనుమ. రాముడు బాధతో మూలుగుతున్నాడు. అడిగితే వీపు మీద ఒక భక్తుడు అరచేత్తో బాదాడన్నాడు రాముడు. 'ఎవడు? వాడిని ఇప్పుడే శిక్షిస్తాను' అన్నాడు హనుమ. 'మన భక్తుడే పోనీలే' అన్నాడు రాముడు. 'వాడు ఎక్కడున్నాడ'ని అడిగాడు హనుమ. 'ఇక్కడే ఉన్నాడు. నాకు తైల మర్దన చేస్తున్నాడు..' అన్నాడు రాముడు. 'స్వామీ! నేను కొట్టానా!' అంటూ విలపించాడు హనుమ. 'నువ్వు ప్రత్యక్షంగా కొట్టలేదు. నా నామం జపించే భక్తుడిని కొట్టావు. నాకు తగిలింది.. ఆ దెబ్బే అతనికి తగిలితే కాలం చేసేవాడు. నీకు అపవాదు వచ్చేది. నువ్వా భక్తుడివేగా! అతను మరణిస్తే రామ నామం అచ్చి రాదనీ ప్రచారం జరిగేది. అందుకే నేనే ఆ దెబ్బ భరించాను' అన్నాడు రామచంద్రుడు.
హనుమ వెంటనే శ్రీరాముడి పాదాలపై పడిపోయాడు. 'స్వామీ! ఇహపర సాధకమైన రామ నామాన్ని జపించే వారిని సర్వదా సర్వధా రక్షిస్తాను. ఎవరు, ఏ కాలం, ఏ ప్రదేశం, ఏ నియమం.. చూడను' అని ప్రతిజ్ఞ చేసి వైశ్యుని ఇంటికి వెళ్లి క్షమాపణ కోరాడు హనుమ.

...✍ డా|| వెలుదండ సత్యనారాయణ

వేగని వడియం

ఒక పెద్ద కల్యాణ మంటపంలో పెళ్లి జరుగుతున్నది. అది సంపన్నుల పెండ్లి. ఖరీదైన ఆహ్వాన పత్రిక అందుకున్న ఒక పండితుడు ఆ పెళ్లి విందుకు వెళ్లాడు. జనం దండిగా ఉన్నారు. నోరూరించే వంటకాలతో చక్కటి విందును ఏర్పాటు చేసి ఉన్నారు. ఒక్కో ప్లేటు భోజనం ఖర్చు వెయ్యి రూపాయలకు పైగా ఉంటుందని తెలుసుకుని ఆశ్చర్యపోయాడు పండితుడు. పల్లెలకు వెళ్లి ప్రవచనాలు చెప్పే ఆ పండితుడిని గుర్తించిన చాలామంది పలకరించారు. వచ్చిన వారిలో చాలామంది భోజనం చాలా రుచిగా ఉందని నిర్వాహకులను అభినందించారు.
ఇంతలో ఒక యువకుడు పండితుడి దగ్గరకు వచ్చి నమస్కరించాడు. తాను హరికథలు చెప్పే భాగవతార్‌ను అని పరిచయం చేసుకున్నాడు. మీ ప్రవచనాలు నన్నెంతగానో ఆకర్షిస్తాయని అన్నాడు. అయితే తనను ఓ సమస్య



కథాసుధ


ఎంతో ఇబ్బంది పెడుతోందని వాపోయాడు. అదేమిటంటే, పల్లెల్లో హరికథలను ఎంత బాగా చెప్పినా ఎవరో ఒకరు విమర్శ చేస్తున్నారని బాధపడ్డాడు. దాన్ని ఎలా ఎదుర్కోవాలో సలహా ఇవ్వమని అడిగాడు.

ఇద్దరిదీ భోజనం పూర్తయ్యింది. చక్కటి భోజనం తిన్నామని ఇద్దరూ సంతోషించారు. చేతులు కడిగే కుళాయి దగ్గర ఒకతను చేయి కడుక్కుంటూ పక్క వ్యక్తితో ఇలా చెబుతున్నాడు. అంగరంగ వైభవంగా పెళ్లి చేస్తున్నారు. అయితే నా అరటి ఆకులో వేసిన వడియం సరిగ్గా కాలలేదు. అది కూడా చూసుకోకపోతే ఎలా? ఇన్ని లక్షలు ఖర్చుపెట్టి ఏమి ప్రయోజనం? అని అరుస్తూ ఉన్నాడు. అప్పుడు ఆ పండితుడు పక్కనే ఉన్న భాగవతార్ తో 'చూశావా... ఇంత మంచి భోజనాలు ఏర్పాటు చేసినా, వేగని వడియం తనకు వచ్చిందని మొత్తం భోజనాలని, పెళ్లి నిర్వాహకులను తిట్టి పోస్తున్నాడు. నూటికి నూరు శాతం కచ్చితత్వం చాలా సందర్భాల్లో కుదరదు. విమర్శలనే భూతద్దంలో చూస్తూ కూర్చుంటే అక్కడే ఆగిపోతాం. ముందుకు పోలేం. కాబట్టి వాటిని పట్టించుకోవద్దు. నీ పని నువ్వు చేసుకుపో' అని ధైర్యం చెప్పాడు. మంచి సమాధానం దొరికిందని సంతోష పడ్డాడు భాగవతార్. ఇద్దరూ తాంబూల సేవనం చేసి అక్కడి నుంచి బయటికి వచ్చారు.

...✍ ఆర్సీ కృష్ణస్వామి రాజు
93936 62821

అల్లాహ్ పిలుపు.. హజ్ సంకల్పం!

ఇస్లాం బోధ



ఇస్లాం ఐదు మూలస్తంభాలలో హజ్ యాత్ర అత్యంత విశిష్టమైనది. ఇది కేవలం భౌతిక ప్రయాణం కాదు, అంతరంగ శోధన. శక్తి సామర్థ్యాలు ఉన్న ప్రతి ముస్లిం తన జీవితకాలంలో ఒక్కసారైనా కాబా గృహాన్ని దర్శించాలని ఖురాన్ బోధిస్తుంది. 'ఎవరైతే అక్కడి వరకు చేరుకోగలరో, వారు అల్లాహ్ కోసం ఆ గృహాన్ని సందర్శించడం విధి' అన్న దైవవాణిని అనుసరిస్తూ ఏటా లక్షలాది మంది సౌదీ అరేబియా వైపు అడుగులు వేస్తారు. ప్రవక్త ముహమ్మద్ (స) సెలవిచ్చినట్లు, చిత్తశుద్ధితో చేసే హజ్ యాత్ర మనిషిని పాపాల నుంచి విముక్తుడిని చేస్తుంది. ఆ యాత్ర ముగించుకుని వచ్చే భక్తుడు, ఇప్పుడే తల్లి గర్భం నుంచి పుట్టిన పసిపాప అంత పవిత్రంగా మారుతాడన్న నమ్మకం ప్రతి గుండెలోనూ నూతన ఉత్తేజాన్ని నింపుతుంది.

హజ్ యాత్రికులు బయలుదేరే సమయంలో కనిపించే దృశ్యాలు హృదయాన్ని కదిలిస్తాయి. కొడుకుని హత్తుకుని దీవిస్తున్న తల్లి, తండ్రి తలపై చేయి వేసి కన్నీళ్లతో వీడ్కోలు పలుకుతున్న కుమార్తె, తన భర్తను దైవ రక్షణకు అప్పగిస్తూ మౌనంగా ప్రార్థిస్తున్న భార్య.. ఈ దృశ్యాలలో భక్తి ఉంది, తపన ఉంది. ప్రియమైన వారు దైవం పిలుపు అందుకొని వెళ్తున్నందుకు గర్వపడుతూనే, ఆ వియోగం కలిగించే బాధతో రాలే కన్నీళ్లు అక్కడి వాతావరణాన్ని పవిత్రంగా మారుస్తాయి.

హజ్ యాత్ర కేవలం ఆర్థిక వనరులపై ఆధారపడి ఉండదు. అది దైవ నిర్ణయం, ఒక 'బులావా' (పిలుపు). ఎంతో మంది ధనవంతులు హజ్‌కు వెళ్లలేకపోతుంటారు. మరికొందరికి ఊహించని విధంగా దారులు వాటంతట అవే తెరుచుకుంటాయి. యాత్రా బృందంలో చేరలేకపోయిన వారి మనసులో ఒకటే ఆవేదన.. 'ఓ నా ప్రభువా! మాకు ఆ అదృష్టం ఎప్పుడు కలుగుతుంది?' అన్న నిశ్శబ్ద రోదన ప్రతి విశ్వాసి గుండెలో వినిపిస్తుంది.

హజ్ అంటే కేవలం బాహ్య ప్రయాణం కాదు.

- హృదయపూర్వకమైన తపన ఉండాలి.
- తోటి మనుషుల హక్కులను (హుకూకుల్ ఇబాద్) నెరవేర్చాలి.
- ప్రవక్త చూపిన మార్గంలో నడవటం వంటి అంతర్గత మార్పులే ఈ యాత్రకు అసలైన సంసిద్ధత.

ఈ ఏడాది వెళ్లలేకపోయిన వారు నిరాశ చెందాల్సిన పని లేదు. హృదయంలో ఆ ఆకాంక్షను సజీవంగా ఉంచుకోవడమే విశ్వాసానికి (ఈమాన్) గుర్తు. నేడు వెనుకబడిన వారు రేపటి బృందంలో చేరవచ్చు. ఆ కరుణామయుడు మనందరికీ తన గృహాన్ని దర్శించే భాగ్యాన్ని, నిష్కల్మషమైన ప్రేమతో ఆయన దర్బారులో హాజరయ్యే అదృష్టాన్ని ప్రసాదించాలని కోరుకుందాం.

..✍ ముహమ్మద్ ముజాహిద్, 96406 22076




సులభంగా 'నీట్'

- కెమిస్ట్రీ, బయాలజీ కాస్త ఈజీ
- కొంచెం ఇబ్బంది పెట్టిన ఫిజిక్స్
- ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు
- ఈ నెలాఖరులో ప్రాథమిక కీ.. జూన్‌లో ఫలితాల వెల్లడి

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : వైద్య విద్యాకోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్(యూజీ) పరీక్ష విద్యార్థుల టెన్షన్‌ను దూరం చేసింది. ప్రశ్నలు సులభంగా రావడంతో విద్యార్థులు ఊపిరిపీల్చుకున్నారు. నీట్ యూజీ పరీక్ష ఆదివారం నిర్వహించగా, ఈసారి ప్రశ్నలు సులభంగా రావడంతో 720కి 720 మార్కులొచ్చే అవకాశాలున్నాయని శ్రీచైతన్య విద్యాసంస్థల నీట్ శిక్షకుడు శంకర్‌రావు విశ్లేషించారు. బయాలజీ సబ్జెక్ట్ చాలా సులభంగా ఉన్నట్టు చెప్పారు. అన్ని ప్రశ్నలను ఎన్సీఈఆర్టీ సిలబస్ నుంచే ఇచ్చారని తెలిపారు. కాన్సెప్ట్స్ బాగా చదివిన విద్యార్థులు సులభంగా రాయగలరని అభిప్రాయపడ్డారు.

కాస్త కఠినంగా ఫిజిక్స్..

ఈ సారి ఫిజిక్స్ ప్రశ్నపత్రం కాస్త కఠినంగా ఉన్నట్టు విద్యార్థులు చెప్పారు. నిరుటి పోల్చితే ఈసారి కాస్త సులభంగానే ఉందని కొంతమంది తెలిపారు. 45 ప్రశ్నల్లో 30-35 ప్రశ్నలు సాధారణ విద్యార్థులు ఆన్సర్లు చేసేవిగా, మిగతావి చేసేందుకు కాస్త సమయం పట్టినట్టు చెప్పారు. కెమిస్ట్రీ విభాగం ప్రశ్నలు సులభంగా రాగా, మూడు, నాలుగు ప్రశ్నలు



మాత్రం కొంచెం ఇబ్బంది పెట్టినట్టు వెల్లడించారు. 2025తో పోల్చితే ఈ సారి కొంత ఈజీగా ఉన్నందున విద్యార్థులు ఉపశమనం పొందారు. పరీక్ష కోసం రాష్ట్రంలో 199 సెంటర్లు ఏర్పాటు చేయగా 71,500(97శాతం) మంది విద్యార్థులు పరీక్ష రాసినట్టు అధికారులు ప్రకటించారు.

470 మార్కులకు సీటు..

ప్రశ్నపత్రం సులభంగా ఉండటంతో కటాఫ్ మార్కులు 70 వరకు పెరుగనున్నాయి. నిరుడు తెలంగాణలో కన్వీనర్ కోటా సీటు 405 మార్కులకు వచ్చింది. ఈ ఏడాది 470- 480 మార్కులకు వచ్చే అవకాశాలున్నాయి. నీట్ క్వాలిఫైయింగ్ మార్కులు 150-155 మార్కుల మధ్య ఉండే చాన్స్ ఉన్నది. ఈనెల చివరి వారంలో ప్రాథమిక కీ విడుదల, జూన్ రెండో వారంలో ఫలితాలు విడుదలకానున్నాయి.

సంవత్సరం	జనరల్	ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ
2026	155	132
2025	144	113
2024	162	127
2023	137	107
2022	177	93

'నీట్'గా సర్కార్ ఉల్లంఘన

- నీట్ కొనసాగుతున్న సమయంలో రైతుమేళా పనులు
- వరంగల్‌లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో అనుమతిపై నిషేధం ఉన్నప్పటికీ బేఖాతరు
- విమర్శలపాలవుతున్న అధికార యంత్రాంగం



హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రైతు మేళాకు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం

హనుమకొండ, మే 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ అమలు చేయకపోవడానికి నిరసనగా వరంగల్‌లో బీఆర్‌ఎస్ చేపడుతున్న రైతు సంగ్రామ సదస్సుకు పోటీగా ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు మేళా ఏర్పాట్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ స్థాయిలో వైద్యవిద్య ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న నీట్ కేంద్రం వద్ద నిబంధనలను పట్టించుకోకపోవడం, అధికారులే దగ్గరుండి రైతు మేళా పనులు చేయించడం చర్చనీయాశంగా మారింది. ప్రవేశ, ఉద్యోగ పరీక్షల సెంటర్ సమీపంలో నిబంధనల ప్రకారం ప్రభుత్వం నిషేధాజ్ఞలు అమలు చేస్తుంది. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఆదివారం నీట్ సెంటర్ ఉన్నది. వరంగల్ పోలీస్ కమిషనర్, జిల్లా అధికార యంత్రాంగం రెండు రోజుల ముందే నీట్ సెంటర్ల వద్ద బీఎన్ఎస్ 163 సెక్షన్ (144 సెక్షన్) విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. హనుమకొండ కలెక్టరేట్‌కు ఆనుకుని ఉన్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లోకి ఆదివారం ఉదయం వాకర్స్‌ను సైతం అనుమతించలేదు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు పరీక్ష జరిగింది. ఆ సమయంలోనే నిబంధనలను ఉల్లంఘించిన పరిస్థితి నెలకొన్నది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5, 6, 7 తేదీల్లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించనున్న రైతు మేళా ఏర్పాట్లను హడావుడిగా చేపట్టారు. పరీక్ష సమయంలోనూ ఇనుప రాడ్లను పెద్ద శబ్దాలతో కొట్టడం, లారీల నుంచి టెంట్ సామగ్రి, కుర్చీలను దించడం చేశారు. వందల మంది లేబర్, వాహనాల రాకపోకలతో పరీక్ష సమయంలో విద్యార్థులకు ఇబ్బందికర పరిస్థితి నెలకొన్నది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రైతు మేళా ఏర్పాట్లను కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. అన్ని శాఖల అధికారులకు మేళా నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. జిల్లాలోని అధికార యంత్రాంగం పరీక్ష విషయాన్ని పట్టించుకోకుండా గ్రౌండ్‌లో ఏర్పాట్లలో నిమగ్నం కావడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. పరీక్ష కేంద్రం సమీపంలో నిషేధాజ్ఞలను అమలు చేసే పోలీసు శాఖ సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని నీట్ అభ్యర్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు.

28 నెలలు.. 28 స్కామ్‌లు

- కమీషన్లకు కేరాఫ్ కాంగ్రెస్ సర్కార్
- హ్యామ్, అక్రమ మైనింగ్ పేరిట దోపిడీ
- సీఎం అండతో రెచ్చిపోతున్న మంత్రులు
- బట్టబయలు చేసినందుకు నిందలు
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మండిపాటు



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్. చిత్రంలో గోసుల, రాఘవేంద్ర యాదవ్, కిశోర్‌గౌడ్, తుంగ బాలు,

హైదరాబాద్, మే 3 (నమస్తేతెలంగాణ): కాంగ్రెస్ 28 నెలల పాలనలో ముఖ్యమంత్రి, మంత్రులు కలిసి 28 స్కామ్‌లకు పాల్పడ్డారని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ సంచలన ఆరోపణలు చేశారు. ఆరు గ్యారంటీలను గాలికొదిలి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని విరుచుకుపడ్డారు. ప్రతిపక్షంపై నిందలు వేస్తూ తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ పెద్దలపై అవినీతి ఆరోపణలు రాగానే బ్యాచ్ బయటకు వచ్చి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును దూషిస్తూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో పార్టీ రాష్ట్ర నేతలు గోసుల శ్రీనివాస్, అభిలాష్ రంగినేని, రాఘవేంద్ర యాదవ్, కిశోర్‌గౌడ్, తుంగ బాలు, ఏ హరిబాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే స్కామ్‌లు, కమీషన్లు, అక్రమ దందాలకు కేరాఫ్ అని ఫైర్ అయ్యారు. మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల పేరిట సర్కార్ సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. హ్యామ్ రోడ్ల కాంట్రాక్ట్‌ను 25 శాతం ఎక్సెస్‌తో కట్టబెట్టారని, కొత్వాల్‌గూడలో మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్ చేస్తున్నదని హరీశ్‌రావు ఆధారాలతో బట్టబయలు చేశారని గుర్తుచేశారు. కానీ సమాధానం చెప్పాల్సిన అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ హరీశ్‌రావుపై అడ్డంపొడుగూ మాట్లాడడం శోచనీయమని పేర్కొన్నారు. దమ్ముంటే ధైర్యముంటే హ్యామ్ మోడల్ రోడ్లలో బిడ్ ఓపెన్ అయిందా? లేదా? చెప్పాలని సవాల్ విసిరారు. కొత్తగా ఎమ్మెల్సీలు కాగానే కొమ్ములొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కాదు.. అడ్డంకి దయాకర్. నోటికి వచ్చినట్లు మాట్లాడడమే ఆయన నైజం. అక్రమాలకు పాల్పడిన అధికార పార్టీ నేతలను వెనుకేసు కురావడమే ఆయన విధానం.'అంటూ తనదైన శైలిలో చురకలంటించారు. 14 ఏండ్ల ఉద్యమ ప్రస్థానం, 10 ఏండ్ల పాలనలో బీఆర్‌ఎస్ ఏం చేసిందో తెలంగాణ ప్రజలకు తెలుసని స్పష్టంచేశారు.

రాష్ట్రంలో రేవంత్, భట్టి ట్యాక్స్

ప్రజాపాలన అందిస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నేతలు అక్రమాల పాలనను తెరపైకి తెచ్చారని ఎర్రోళ్ల దుయ్యబట్టారు. అన్ని శాఖల్లో విచ్చలవిడిగా అవినీతి రాజ్యమేలుతున్నదన్నారు. బర్త్ సర్టిఫికెట్‌కు కూడా లంచం ముట్టజెప్పాల్సిన దుస్థితి నెలకొన్నదని విమర్శించారు. తెలంగాణలో రేవంత్ ట్యాక్స్‌తోపాటు, భట్టి, పొన్నం, పొంగులేటి, ఉత్తమ్, కోమటిరెడ్డి, సీతక్క ట్యాక్స్‌లు నడుస్తున్నాయని తూర్పారబట్టారు. పాలనను పక్కనపెట్టి అక్రమాలు మాత్రం దండిగా చేస్తున్నారని మండిపడ్డారు. చిత్తశుద్ధి ఉంటే తాము చేసిన ఆరోపణలపై సిట్, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బల్మూరి, అద్దంకి మరోసారి అడ్డగోలుగా మాట్లాడితే బీఆర్‌ఎస్ చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు.



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి. చిత్రంలో అభిలాష్ రంగినేని

జూపల్లి.. ఝూటా మాటలు ఆపు

- 1,600 ఎకరాలు కాపాడినట్లు పచ్చి అబద్ధాలు
- 'దొంగే.. దొంగ' అన్నట్టు జూపల్లి కృష్ణారావు వ్యవహారం
- బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): మంత్రి జూపల్లి కృష్ణారావు అబద్ధపు మాటలు ఆపి, నిజాలు మాట్లాడాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కొల్లాపూర్ సంస్థానాధీశులకు చెందిన 1,600 ఎకరాల భూమిని కాపాడానని ప్రెస్‌మీట్‌లో పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఆలయ, ప్రభుత్వ భూములను కబ్జా చేసిన ఆయన, దొంగే.. దొంగా అన్న చందంగా వ్యవహరించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ నేత అభిలాష్ రంగినేనితో కలిసి ఆయన మాట్లాడారు. కొల్లాపూర్ సంస్థానాధీశులకు చెందిన 1,600 ఎకరాల భూమిని రక్షించింది బీఆర్‌ఎస్సేనని స్పష్టం చేశారు. 2021లో ఎమ్మెల్యేగా ఉన్న తాను కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్టు గుర్తుచేశారు. కానీ జూపల్లి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పాస్‌బుక్‌లు జారీ చేసింది వాస్తవంకాదా? బీఆర్‌ఎస్ వచ్చిన తర్వాత ధరణి పోర్టల్ ద్వారా పాస్ బుక్కులను రద్దు చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. జూపల్లి రాజకీయ లబ్ధికోసం దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. 'కొల్లాపూర్ వద్ద ఎల్లాపురంలో 44 ఎకరాల సీలింగ్ అటవీ భూములను రికార్డులు మార్చి విక్రయించారు. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో చెట్లను కొట్టి ప్లాట్లు పెట్టి అమ్ముకున్నారు. దేవాలయ భూములను కూడా తెగనమ్ముకున్నారు'అని సంచలన ఆరోపణలు చేశారు. స్థానికులు ఆయనపై సుప్రీంకోర్టులో ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. దమ్ముంటే కొల్లాపూర్‌లో భూ ఆక్రమణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మరోసారి తమపై అభాండాలు వేస్తే ఊరుకోబోమని, కోర్టుకు లాగుతామని హెచ్చరించారు.

బాక్సులు బద్దలయ్యే ఇంట్రడక్షన్?



దర్శకుడు కేఎస్ రవీంద్ర(బాబీ) మెగా ఎంట్రీకి రంగం సిద్ధం చేస్తున్నారు. ఆయన దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఓ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ, లోహిత్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే ప్రీప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. త్వరలోనే దర్శకుడు బాబీ షూట్‌ని మొదలుపెట్టనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు మెగాస్టార్ ఇంట్రడక్షన్ సీన్‌ని తీసేందుకు ఆయన రంగం సిద్ధం చేస్తున్నారట. ఈ ఎంట్రీ సీక్వెన్స్ కోసం ప్రస్తుతం భారీ సెట్స్‌ని నిర్మిస్తున్నారు. ఈ సీక్వెన్స్‌లో మెగాస్టార్‌ని కొత్తగా చూపించేందుకు బాబీ ప్రణాళికలు రచిస్తున్నారు. చిరంజీవితోపాటు మొత్తం నలభై మంది ఫైటర్స్ కూడా ఈ సీక్వెన్స్‌లో కనిపిస్తారట. కుటుంబ భావోద్వేగాలే ప్రధానంగా సాగే ఈ కథలో చిరంజీవి పాత్ర చిత్రణ అభిమానులు పండుగ చేసుకునేలా ఉంటుందని సమాచారం. గతంలో చిరు, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఈ సినిమా అంతకు మించి ఉంటుందని డైరెక్టర్ టీమ్ చెబుతున్నది. సంక్రాంతికి సినిమాను విడుదల చేయాలనే ఉద్దేశంతో నిర్మాతలు ఉన్నారు.

ఆగమనానికి సిద్ధమవుతూ..



ప్రముఖ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో కె.అచ్చిరెడ్డి సమర్పణలో.. కొమ్మూరి ప్రతాపరెడ్డి నిర్మిస్తున్న సందేశాత్మక యాక్షన్ చిత్రం 'వేదవ్యాస్'. పిడుగు విశ్వనాథ్ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమాను నిర్మిస్తున్న 'సాయి ప్రగతి ఫిల్మ్స్' బ్యానర్ విజువల్ లోగో ఆవిష్కరణ హైదరాబాద్ ఘట్‌కేసర్‌లోని కేపీఆర్ఐటీ విద్యా సంస్థల వార్షికోత్సవ వేడుకలో ఘనంగా జరిగింది. షిర్డీ సాయిబాబా విగ్రహానికి దర్శకనిర్మాతలు, సమర్పకుడు కలిసి పూజ చేస్తున్న దృశ్యాన్ని లోగోలో చిత్రీకరించారు. నిర్మాత కొమ్మూరి ప్రతాపరెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, కె.అచ్చిరెడ్డి, హీరో పిడుగు విశ్వనాథ్, నటుడు రఘుబాబు, తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్, కేపీఆర్ఐటీ విద్యా సంస్థల వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, కార్యదర్శి రాకేశ్‌రెడ్డి ఇంకా అనేకమంది అతిథులతోపాటు నాలుగు వేలకు పైగా విద్యార్థినీ, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిత్రం

ఆ వ్యసనం నుంచి బయటపడ్డా..



'స్వీయ లోపంబులెరుగుట పెద్ద విద్య' అనేది ఆర్యోక్తి. ఈ నీతిని తూ.చ తప్పక పాటిస్తున్నది శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్. తనలోని లోపాలను సరిచేసుకునే క్రమంలో తాను పడిన కష్టాన్ని ఆమె స్వయంగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. 'మానసిక వేదన, శారీరక శ్రమ నుంచి బయట పడేందుకు ఒకానొక సందర్భంలో నేనూ మద్యాన్ని ఆశ్రయించాను. నిదానంగా అది వ్యసనంలా మారింది. చివరికి మద్యం సేవించకపోతే ఉండలేని స్థితికి వచ్చేశాను. ఇలాంటి పరిస్థితుల్లో.. మెడిటేషన్ నా జీవితాన్ని మార్చింది. నిద్రలేవగానే శారీరకంగా, మానసికంగా విపరీతమైన అలసట. బలహీనపడుతున్న మానసిక దృఢత్వం.. ఇవన్నీ నాకు అర్థమవుతున్నాయి. చివరకు నా శరీరక స్పందనలు నాకే నచ్చడంలేదు. నాలో వస్తున్న మార్పులన్నీ నన్ను పునఃసమీక్షించుకునేలా చేశాయి. దాంతో ఇక తాగకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాను. ఇప్పుడు నా ఆరోగ్యం క్రమంగా కుదురుకున్నది. మానసిక ఉల్లాసానికి మద్యమే మందు కాదు. ఈ విషయం ప్రతిఒక్కరూ గ్రహించాలి' అన్నారు జాన్వీకపూర్.

గోపీచంద్ యాక్షన్ షురూ



హీరో టి.గోపీచంద్ కథానాయకుడిగా 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫైట్ మాస్టర్ వి.వెంకట్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. మలయాళ నటి అనార్కలి నాజర్ కథానాయిక. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి యాక్షన్ కొరియోగ్రాఫర్లు రామ్-లక్ష్మణ్ కెమెరా స్విచాన్ చేయగా, అగ్ర నిర్మాత శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి క్లాప్ కొట్టారు. మరో అగ్ర నిర్మాత దిల్‌రాజు గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు శివ నిర్వాణ, నిర్మాతలు కేఎల్ దామోదర ప్రసాద్, మైత్రీ రవిశంకర్ స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందించారు. అతిథులంతా చిత్రం బాగా రావాలంటూ ఆకాంక్షించారు. గోపీచంద్ కెరీర్‌లో ఇది 34వ చిత్రమని, అత్యున్నత నిర్మాణ విలువలతో, సాంకేతిక నైపుణ్యంతో కూడిన సరికొత్త కథను ప్రేక్షకులకు అందించనున్నామని, దర్శకుడు వి.వెంకట్ బలమైన స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారని, గోపీచంద్ పూర్తి యాక్షన్ అవతారంలో కనిపిస్తారని, ఇంటెన్స్ డ్రామా, ఎమోషన్స్‌తో ఆయన పాత్ర సాగుతుందని, రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే మొదలుకానున్నదని మేకర్స్ తెలిపారు. ఈచిత్రానికి కెమెరా: షామ్‌దత్, సంగీతం: సామ్ సీఎస్, ఎడిటింగ్: శ్రీకర ప్రసాద్.

రాకాలో అక్షయ్‌కుమార్?



దేశంలో తెరకెక్కుతున్న మోస్ట్ ఎవైటెడ్ పానిండియా చిత్రాల్లో అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' ఒకటి. అట్లీ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ ఈ పానిండియా చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. మాఫియా నేపథ్యంలో సాగే ఈ సైంటిఫిక్ థ్రిల్లర్‌లో దీపికా పదుకోన్ కథానాయిక. రష్మిక మందన్నా, జాన్వీకపూర్, మృణాళ్ ఠాకూర్ కీలకపాత్రధారులు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం బాలీవుడ్ సూపర్‌స్టార్ అక్షయ్‌కుమార్ ఈ సినిమాలో ఓ ప్రత్యేకపాత్ర చేసేందుకు అంగీకారం తెలిపినట్టు తెలిసింది. వచ్చే షెడ్యూల్ నుంచి ఆయన ఈ సినిమా సెట్స్‌లోకి ఎంట్రీ ఇస్తారట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సివుంది.

కిరణ్ అబ్బవరం మెచ్చుకున్నారు



'రాయలసీమ నగిరిలోని వ్యవసాయ అధారిత నిరుపేద కుటుంబం నుంచి వచ్చాన్నేను. బెంగళూరులో కొన్నాళ్లు ఉద్యోగం చేశా. 2017లో హైదరాబాద్ వచ్చాను. అప్పట్నుంచీ సినిమా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాను. డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశాను. షార్ట్‌ఫిల్మ్ డైరెక్ట్ చేసి నటించాను. బీ స్టూడియో వారు నా దగ్గర రూపాయి తీసుకోకుండా యాక్టింగ్ శిక్షణ ఇచ్చారు. పలు స్టేజ్ షోలు కూడా చేశా. 'తిమ్మరాజుపల్లి టీవీ' అసోసియేట్ డైరెక్టర్స్ నా స్టేజ్ షో చూసి, ఆడిషన్స్ తీసుకున్నారు. అలా 'తిమ్మరాజుపల్లి' ఛాన్స్ దక్కింది' అని చెప్పారు నటుడు లతీష్. హీరో కిరణ్ అబ్బవరం నిర్మించిన 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రం ద్వారా పరిచయమైన 50మందిలో లతీష్ ఒకరు. అందులో ఆయన సిద్ధయ్యగా విలన్ పాత్ర పోషించారు. ఆ పాత్ర తనకు గుర్తింపునిచ్చిందని లతీష్ ఆనందం వెలిబుచ్చారు. ' 'తిమ్మరాజుపల్లి టీవీ'లో హీరో పాత్రకు సమానంగా విలన్ పాత్ర ఉంటుంది. అందుకే ఆ పాత్ర కోసం 30 కేజీలు బరువు పెరిగాను. సినిమా చూసిన వారంతా 'నువ్వేనా' అంటుంటే సంతోషంగా, సంతృప్తిగా ఉంది. సినిమా చూసి కిరణ్ అబ్బవరంతోపాటు యూనిట్ సభ్యులంతా మెచ్చుకున్నారు' అని లతీష్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కథలు వింటున్నానని, భవిష్యత్‌లో చేసే సినిమాల గురించి త్వరలో చెబుతానని లతీష్ పేర్కొన్నారు.

ఆ బ్యాగ్‌లో ఏముంది?



ఓ బ్యాగ్ చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ది రెడ్ బ్యాగ్'. కబీర్‌సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక ప్రధాన పాత్రధారులు. రవికుమార్ సీరపు దర్శకుడు. హరికృష్ణ సోమిశెట్టి నిర్మాత. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్నది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయి. తాజాగా థాయ్‌లాండ్‌లో కీలక సన్నివేశాలను, పాటను షూట్ చేశారు. థాయిలాండ్‌లో చిత్రీకరించిన సీన్స్ సినిమాకే హైలెట్‌గా నిలుస్తాయి. కబీర్‌సింగ్ ఇందులో డిఫరెంట్ పాత్రలో కనిపిస్తారు. అతి త్వరలో ఈ సినిమా టీజర్‌ని, త్వరలోనే సినిమాను విడుదల చేయనున్నారు. స్నేహసింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బదల్, భార్గవి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి రచన: విక్రమ్ రాజా, కెమెరా: ప్రియేష్ గురుసామి, సంగీతం: శేఖర్ మోపరి

నిద్ర పోనివ్వని థ్రిల్లర్



ఇంద్రరామ్ కథానాయకుడిగా రూపొందుతున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'డోంట్ స్లీప్'. సినిమాటోగ్రాఫర్ షామ్‌దత్ ఈ చిత్రానికి దర్శకుడు. వి.డ్రీమ్ ఫిల్మ్స్ పతాకంపై వి.చూడామణి నిర్మిస్తున్న ఈచిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న రవీంద్ర విజయ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలోని ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. స్టైలిష్ లుక్‌లో కనిపిస్తున్న రవీంద్ర విజయ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఆయన పాత్రలోని సస్పెన్స్, థ్రిల్ ఎలిమెంట్స్‌ని ఆవిష్కరించేలా ఈ ఫస్ట్‌లుక్ ఉన్నది. తబా రీమా, జ్యోతి బెనర్జీ, సునీల్ థాపా, అడుకాలం నరేన్, వెన్నెల కిశోర్, రఘుబాబు తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కథ, కథనం, మాటలు: సజీర్ బాబా, లూనా జబిన్, సంగీతం: గోకుల హర్షన్.



మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్

త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ , అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని దర్శకుడు. అరవింద్ మాండ్యం నిర్మాత. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈనెల 15న విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం మేకర్స్ ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీవెంకట సాయి ఫిల్మ్స్ పతాకంపై ముత్యాల రామదాస్ ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. భవిష్యత్తులో వర్క్ ఫ్రమ్ హోమ్ ఎలా ఉండబోతోందో తెలిపే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందుతున్నదని, ఇందులో ప్రేమకథ కూడా ఉంటుందని, నిజాయితీ గల అబ్బాయి, అమ్మాయి ప్రేమించుకుంటే, ఆ ప్రయాణం ఎంత వినోదాత్మకంగా ఉంటుందో ఈ సినిమాలో చూస్తారని, సమ్మర్‌లో సంపూర్ణంగా వినోదాన్ని పంచే సినిమా ఇదని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: రవికుమార్.వి, సంగీతం: ప్రకాశ్ చెరుకూరి, అరుణ్ చిలువేరు, సమర్పణ: సీహెచ్‌వీఎస్ఎన్ బాబ్జీ, నిర్మాణం: లోటస్ క్రియేషన్స్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నేటి మ్యాచ్ ముంబై X లక్నో రా: 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

రైజర్స్‌కు ఝలక్

7 వికెట్ల తేడాతో గెలిచిన కేకేఆర్ • దెబ్బకొట్టిన చక్రవర్తి, నరైన్

ఐదు వరుస విజయాల తర్వాత ఓడిన హైదరాబాద్


చక్రవర్తి (3/36)

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వరుసగా ఐదు విజయాలతో దూసుకెళ్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జైత్రయాత్రకు బ్రేక్ పడింది. భారీ స్కోర్లతో చెలరేగుతూ.. ప్లేఆఫ్స్ దిశగా ముందుకెళ్తున్న సన్‌రైజర్స్ సొంతగడ్డపై కోల్‌కతా నైట్ రైడర్స్ మిస్టరీ స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి (3/36), సునీల్ నరైన్ (2/31) మ్యాజిక్‌ను ఎదుర్కోలేక చతికిల పడింది. ఉప్పల్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 7 వికెట్ల తేడాతో కేకేఆర్ చేతిలో ఓడిపోయింది. తొలుత సన్‌రైజర్స్ 19 ఓవర్లలో165 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (28 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 61), ఇషాన్ కిషన్ (29 బంతుల్లో 4ఫోర్లు, 2 సిక్సర్లతో42)రాణించినా..మిగతా బ్యాటర్లు నిరాశపరిచారు. కార్తీక్ త్యాగి (2/30) రెండు వికెట్లు పడగొట్టాడు. తర్వాత కోల్‌కతా 18.2 ఓవర్లలోనే 169/3 స్కోరు చేసి గెలిచింది. యువ బ్యాటర్ అంగ్‌క్రిష్ రఘువంశీ (47 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 59), కెప్టెన్ అజింక్యా రహానే (36 బంతుల్లో 4ఫోర్లు, 1 సిక్స్‌తో 43) సత్తాచాటారు. కోల్‌కతాకు ఇది మూడో విజయం. వరుణ్ చక్రవర్తికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. బుధవారం ఉప్పల్‌లోనే జరిగే తర్వాతి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో సన్‌రైజర్స్ తలపడనుంది.

దెబ్బకొట్టిన మిస్టరీ స్పిన్నర్లు

టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ తొలి పది ఓవర్లలో దూకుడుగానే ఆడినా.. రెండో భాగంలో వరుస వికెట్లు కోల్పోయి తక్కువ స్కోరుకే పరిమితమైంది. మొదట ఓపెనర్లు అభిషేక్ శర్మ (15), ట్రావిస్ హెడ్ తొలి వికెట్‌కు 44 రన్స్ జోడించి మంచి ఆరంభం ఇచ్చారు. తొలి ఓవర్లోనే స్పిన్నర్ నరైన్‌కు అభి సిక్స్‌తో స్వాగతం పలకగా.. రెండో ఓవర్లో నాలుగు ఫోర్లు కొట్టిన హెడ్.. నరైన్ బౌలింగ్‌లో 6,4 రాబట్టాడు. కార్తీక్ త్యాగి వేసిన నాలుగో ఓవర్లో గ్రీన్‌కు సింపుల్ క్యాచ్ ఇచ్చి అభి ఔటైనా.. వన్‌డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌తో కలిసి హెడ్ దూకుడు కొనసాగించాడు. గ్రీన్ బౌలింగ్‌లో హెడ్ హ్యాట్రిక్ ఫోర్లు కొడితే.. కార్తీక్ ఓవర్లో ఇషాన్ 6,4 బాదడంతో పవర్ ప్లేలోనే సన్‌రైజర్స్ 77/1తో నిలిచింది. 22 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్న హెడ్ చక్రవర్తి వేసిన తొమ్మిదో ఓవర్లో 4,4,6తో మరింత వేగం పెంచాడు. కానీ, తెలివైన బంతితో అతడిని ఔట్ చేసిన చక్రవర్తి రెండో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యాన్ని ముగించాడు. ఇక్కడి నుంచి కేకేఆర్ బౌలర్లు జోరు పెంచి వరుస వికెట్లతో రైజర్స్ స్పీడుకు బ్రేకులు వేశారు. సూపర్ ఫామ్‌లో ఉన్న క్లాసెన్(11) గ్రీన్ బౌలింగ్‌లో పావెల్ పట్టిన అద్భుత క్యాచ్‌కు పెవిలియన్ చేరాడు. తన వరుస ఓవర్లలో రవిచంద్రన్ స్మరణ్ (4),అనికేత్ వర్మ (6)ను చక్రవర్తి పెవిలియన్ చేర్చడంతో రైజర్స్ 135/5తో డీలా పడింది. ఈ దశలో మళ్లీ బౌలింగ్‌కు వచ్చిన నరైన్ 16వ


హెడ్ (61)

ఓవర్లో సాలిల్ అరోరా (2), ఇషాన్ ఇద్దరినీ బౌల్డ్ చేసి ఆతిథ్య జట్టును మరింత దెబ్బకొట్టాడు. కెప్టెన్ కమిన్స్ (10), శివంగ్‌కుమార్ (1)నిరాశపరచగా.. హర్షల్ పటేల్ (6)ను త్యాగి ఆఖరి వికెట్‌గా ఔట్ చేయడంతో సన్ రైజర్స్ ఆలౌటైంది.

గెలిపించిన రఘు,రహానె

సాధారణ లక్ష్యాన్ని కేకేఆర్ పెద్దగా కష్టపడకుండానే ఛేదించింది. కెప్టెన్ రహానె ఇన్నింగ్స్ తొలి బంతినే బౌండరీకి చేర్చి వేగంగా ఆడాడు.. మరో ఓపెనర్ ఫిన్ అలెన్ (29 ఉన్నది కొద్దిసేపే అయినా తన మార్కు హిట్టింగ్‌తో అలరించాడు. కమిన్స్ వేసిన నాలుగో ఓవర్లో ఖతర్నాక్ షాట్లతో 6, 6,4,4 కొట్టిన అతను ఆఖరి బాల్‌కు క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చాడు. వన్‌డౌన్‌లో వచ్చిన అంగ్‌క్రిష్ రఘువంశీ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. ఈషాన్ మలింగ వేసిన ఆరో ఓవర్లో రెండు సిక్సర్లు కొట్టి పవర్‌ప్లేను 71/1తో ముగించాడు. ఫీల్డింగ్ విస్తరించిన తర్వాత సన్‌రైజర్స్ బౌలర్లు క్రమశిక్షణతో బౌలింగ్ చేసినా..రహానే, రఘు క్రమం తప్పకుండా బౌండరీలు కొడుతూ లక్ష్యాన్ని కరిగించారు. ఈ క్రమంలో రఘువంశీ 39 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. మరో ఎండ్‌లో హాఫ్ సెంచరీకి చేరువైన రహానేను 15వ ఓవర్లో సాకిబ్ హుస్సేన్ ఔట్ చేయడంతో రెండో వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్య ముగిసింది. విజయం ముంగిట రఘు కూడా పెవిలియన్ చేరినా.. మలింగ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన రింకూ సింగ్ (22 నాటౌట్) మ్యాచ్ ముగించాడు.

200 కేకేఆర్ స్పిన్నర్ సునీల్ నరైన్ ఐపీఎల్‌లో 200 వికెట్ల మైలురాయిని అధిగమించాడు. ఈ ఘనత సాధించిన మూడో బౌలర్‌గా భువనేశ్వర్, యుజ్వేంద్ర చహల్ సరసన చేరాడు.

1 ఈ సీజన్‌లో 10 మ్యాచ్‌లు ఆడిన సన్‌రైజర్స్ ఆలౌట్ అవ్వడం ఇదే తొలిసారి.

సంక్షిప్త స్కోర్లు

హైదరాబాద్: 19 ఓవర్లలో 165 ఆలౌట్ (హెడ్ 61, ఇషాన్ 42, చక్రవర్తి 3/36, నరైన్ 2/31); కోల్‌కతా: 18.2 ఓవర్లలో 169/3 (రఘువంశీ 59, రహానే 43, సాకిబ్ 1/17)



శ్రీనిధి ఎఫ్‌సీ మరో విజయం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఇండియన్ ఫుట్‌బాల్ లీగ్ చాంపియన్‌షిప్ స్టేజ్–1లో శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ మరో విజయాన్ని సొంతం చేసుకుంది. కోల్‌కతాలోని కల్యాణి స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి 2–1 తేడాతోడైమండ్ హార్బర్ ఎఫ్‌సీని ఓడించి లీగ్‌లో నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. తొలి అర్ధ భాగం చివర్లో వెంటవెంటనే రెండు గోల్స్ సాధించిన శ్రీనిధి ప్రత్యర్థికి చెక్ పెట్టింది. 43వ నిమిషంలో బ్రాండన్ జట్టుకు తొలి గోల్ అందించగా.. కాసేపటికే డేవిడ్ మునోజ్ (45+4వ ని) మరో గోల్‌తో 2–0తోఆధిక్యంలో నిలిపాడు. 61వ నిమిషంలో హ్యూగో డియాజ్ గోల్ చేసి హార్బర్‌ను రేసులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. కానీ పటిష్టమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వని శ్రీనిధి విజయం అందుకుంది.



జాతీయ రికార్డు బ్రేక్ చేసిన నిత్య జట్టు

న్యూఢిల్లీ: ప్రపంచ అథ్లెటిక్స్ రిలేస్ టోర్నమెంట్‌లో తెలంగాణ అమ్మాయి గంధె నిత్యతో కూడిన భారత జట్టు 4x100 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో కొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది. నిత్య, రాహుల్ కుమార్, అనిమేష్ కుజుర్, స్నేహ ఎస్.ఎస్.తో కూడిన భారత్ ఆదివారం జరిగిన ఈ రేసును 41.35 సెకన్లలో పూర్తి చేసింది. దాంతో మార్చిలో నమోదైన 42.30 సెకన్ల పాత రికార్డును బద్దలు కొట్టింది. అయితే, ఈ సమయం ఫైనల్స్‌కు చేరుకోవడానికి సరిపోకపోవడంతో భారత జట్టు తమ హీట్‌లో ఆరో స్థానంలో, ఓవరాల్‌గా పదో స్థానంలో నిలిచి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

మిట్టల్ కుటుంబం చేతికి రాజస్థాన్ రాయల్స్

అదర్ పూనావాలాతో కలిసి రూ.15,600 కోట్లకు ఫ్రాంచైజీ కొనుగోలు

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ యాజమాన్య హక్కులు మరోసారి చేతులు మారనున్నాయి. భారత్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త లక్ష్మి ఎన్.మిట్టల్ కుటుంబం రాయల్స్ జట్టును కొనుగోలు చేసింది. మరో ప్రముఖ వ్యాపారవేత్త అదర్ పూనావాలాతో కలిసి ఈ ఫ్రాంచైజీని సొంతం చేసుకుంది. మొత్తంగా రూ. 15,600 (1.65 బిలియన్ డాలర్లు) రికార్డు బిడ్‌తో ఈ ఒప్పందం ఖరారైంది. ఇది వరకు రాజస్థాన్ రాయల్స్ జట్టు కోసం అమెరికాకు చెందిన కాల్ సోమాని, రాబ్ వాల్టన్‌తో కూడిన కన్సార్టియం వేసిన 1.63 బిలియన్ డాలర్ల బిడ్ సాంకేతిక, ఇతర కారణాల వల్ల విఫలమైంది. దాంతో మిట్టల్ కుటుంబం రేసులోకి వచ్చి ఆర్‌ఆర్ ఫ్రాంచైజీని దక్కించుకుంది. ఈ లావాదేవీలో ఐపీఎల్‌లో రాజస్థాన్ పురుషుల జట్టుతోపాటు దక్షిణాఫ్రికాలోని పార్ల్ రాయల్స్, కరేబియన్ ప్రీమియర్ లీగ్ జట్టు బార్బడోస్ రాయల్స్ కూడా ఉన్నాయి. తాజా ఒప్పందం ప్రకారం మిట్టల్ కుటుంబం 75 శాతం.. అదర్ పూనావాలా 18 శాతం వాటాను సొంతం చేసుకోగా, మిగిలిన 7 శాతం మనోజ్ బడాలెతో పాటు ప్రస్తుత వాటాదారుల వద్ద ఉంటుంది. కొత్తగా ఏర్పాటు చేసే రాజస్థాన్ రాయల్స్ బోర్డులో లక్ష్మి మిట్టల్, ఆయన కుమారుడు ఆదిత్యతో పాటు పూనావాలా, మనోజ్ బడాలె తదితరులు సభ్యులుగా కొనసాగుతారు. ఈ లావాదేవీలు పూర్తి చేసేందుకు బీసీసీఐ, సీసీఐ, ఐపీఎల్ పాలక మండలి అమోదం తప్పనిసరి. ఈ ఆర్థిక సంవత్సరం మూడోత్రైమాసికంలోగా జట్టు యాజమాన్య హక్కుల బదిలీ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్వాహకులు భావిస్తున్నారు.

టైటాన్స్ హ్యాట్రిక్

4 వికెటతో పంజాబ్‌పై గెలుపు • రాణించిన హోల్డర్, సుదర్శన్, సుందర్


హోల్డర్ (4/24)

అహ్మదాబాద్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెప్పించి టేబుల్ టాపర్ పంజాబ్ కింగ్స్‌కు చెక్ పెట్టిన గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్–19లో మరో హ్యాట్రిక్ సాధించింది. శనివారం రాత్రి సొంతగడ్డపై జరిగిన మ్యాచ్‌లో జీటీ 4వికెట్ల తేడాతో పంజాబ్‌పై గెలిచి ఓవరాల్‌గా ఆరో విజయం సొంతం చేసుకుంది. తొలుత కింగ్స్ 20 ఓవర్లలో 163/9 స్కోరు చేసింది. టాప్–5 బ్యాటర్లు విఫలమవడంతో ఓ దశలో 47/5తో నిలిచిన జట్టును సూర్యాంశ్ షెడ్గే (39 బంతుల్లో 3ఫోర్లు, 5 సిక్సర్లతో 57), మార్కస్ స్టోయినిస్ (31 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో40) ఆదుకున్నారు. జేసన్ హోల్డర్ (4/24), కగిసో రబాడ (2/22) మహ్మద్ సిరాజ్ (2/28) సత్తా చాటారు. అనంతరం ఓపెనర్ సాయి సుదర్శన్ (41 బంతుల్లో 5 ఫోర్లు, 1సిక్స్‌తో 57), వాషింగ్టన్ సుందర్ (23 బంతుల్లో 5ఫోర్లు, 1సిక్స్‌తో 40 నాటౌట్) మెరుపులతో జీటీ 19.5 ఓవర్లలో 167/6 స్కోరు చేసి గెలిచింది.

ఆదుకున్న షెడ్గే, స్టోయినిస్

భారీ టార్గెట్లను అలవోకగా ఛేదిస్తున్న పంజాబ్‌ను ఈ మ్యాచ్‌లో టైటాన్స్ బౌలర్లు వణికించారు. సిరాజ్ తొలి ఓవర్లోనే ఓపెనర్ ప్రియాంశ్ (2), కనోలి (0)ని పెవిలియన్ చేర్చి షాకిచ్చాడు. రబాడ కూడా పదునైన బంతులు వేయడంతో పవర్‌ప్లేలో పంజాబ్ ఇబ్బంది పడింది. ఆరో ఓవర్లో 152 కి.మీ బంతితో ప్రభ్‌సిమ్రన్ (15)ను ఔట్ చేసిన రబడా పవర్ ప్లేలో ప్రత్యర్థిని 35/3తో నిలిపింది. ఫీల్డింగ్ మారిన తర్వాత హోల్డర్ హవా మొదలైంది. వరుస ఓవర్లలో వాధేరా (0), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (19) పని పట్టడంతో 50 పరుగులు చేరేలోపే పంజాబ్ సగం వికెట్లు కోల్పోయింది. ఈ దశలో సూర్యాంశ్, స్టోయినిస్ ఆరో వికెట్‌కు 79 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. క్రమం తప్పకుండా బౌండరీలు కొడుతూ స్కోరుబోర్డును ముందుకు తీసుకెళ్లారు. అర్షద్ ఖాన్ వేసిన 13వ ఓవర్లో మార్కస్ తొలి సిక్స్ రాబట్టగా..మానవ్ సుతార్ వేసిన తర్వాతి ఓవర్లో సూర్యాంశ్ 6,6,4,4,6తో స్టేడియాన్ని హోరెత్తించాడు. అదే జోరుతో తను లీగ్‌లో తొలి అర్ధ శతకం పూర్తి చేసుకొని రబాడ బౌలింగ్‌లో ఔటయ్యాడు. మరోఎండ్‌లో భారీ షాట్లు కొడుతున్న మార్కస్‌ను హోల్డర్ పెవిలియన్ చేర్చగా.. చివరి ఓవర్లో మార్కో యాన్సెన్ (20) 6,4 కొట్టి పంజాబ్ స్కోరు 160 మార్కు దాటించాడు.

సుదర్శన్ జోరు

లక్ష్య ఛేదనలో రెండో ఓవర్లోనే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (5)ను అర్షదీప్ ఔట్ చేసినా మరో ఓపెనర్ సాయి సుదర్శన్ జట్టును ముందుకు తీసుకెళ్లాడు. పవర్‌ప్లేలో అతనికి బట్లర్ (26) మంచి సహకారం అందించాడు. ఈ ఇద్దరూ ధాటిగా ఆడటంతో పవర్‌ప్లేలో జీటీ 58/1 స్కోరు చేసింది. ఆ తర్వాత బట్లర్‌ను ఔట్ చేసిన వైశాక్, నిశాంత్ సంధు (15)ను పెవిలియన్ చేర్చిన స్టోయినిస్‌తో పాటు యాన్సెన్, అర్షదీప్ పొదుపుగా బౌలింగ్ చేయడంతో టైటాన్స్ రన్‌రేట్ మందగించింది. ఓదశలో 28 బంతుల్లో ఒక్క బౌండరీ కూడా రాలేదు. కానీ, సుందర్‌తో కలిసి సుదర్శన్ స్ట్రయిక్ రొటేట్ చేశాడు. చహల్ వేసిన 14వ ఓవర్లో రెండు ఫోర్లతో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. అయితే, సుదర్శన్‌తో పాటు తెవాటియా (2), హోల్డర్ (5) ఔటవడంతో చివర్లో ఉత్కంఠ రేగింది. ప్రశాంతంగా ఆడిన సుందర్ ఆఖరి ఓవర్లో సిక్స్‌తో మ్యాచ్ ముగించాడు.

సంక్షిప్త స్కోర్లు


పంజాబ్: 20 ఓవర్లలో 163/9 (సూర్యాంశ్ షెడ్గే 57 స్టోయినిస్ 40, హోల్డర్ 4/24,సిరాజ్ 2/28); గుజరాత్: 19.5 ఓవర్లలో 167/6 (సుదర్శన్ 57, సుందర్ 40* , అర్షదీప్ 2/24)

ఐపీఎల్ - 2026

జట్లు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
పంజాబ్	9	6	2	1	13	0.85
బెంగళూరు	9	6	3	0	12	1.42
హైదరాబాద్	10	6	4	0	12	0.64
రాజస్థాన్	10	6	4	0	12	0.51
గుజరాత్	10	6	4	0	10	-0.14
చెన్నై	9	4	5	0	8	0.05
ఢిల్లీ	9	4	5	0	8	-0.89
కోల్‌కతా	9	3	5	1	7	-0.53
ముంబై	9	2	7	0	4	-0.80
లక్నో	8	2	6	0	4	-1.10

నోట్: ఆ:ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, పా: పాయింట్లు, ర.రే: రన్‌రేట్, ఫ.తే:ఫలితం తేలనివి

రాబడి



పడుతూ.. లేస్తూ పయనం!

హోర్ముజ్‌లో రవాణాపై ట్రెండ్ ఆధారం


మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లలో ఈ వారం కూడా ఆటుపోట్లకు అవకాశాలున్నాయి. అమెరికా–ఇరాన్‌ల వైఖరి పశ్చిమాసియాలో సంక్షోభంపై మదుపర్లలో స్పష్టమైన అవగాహనను ఏర్పర్చుకోనివ్వడం లేదు మరి. ఒకవైపు కాల్పుల విరమణ ఒప్పందాలు మాటలకే పరిమితమవుతుండటం, మరోవైపు హోర్ముజ్ జలసంధిలో అగ్రరాజ్యం కయ్యానికి కాలు దువ్వుతుండటం.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది. ఈ నేపథ్యంలోనే గత వారం సెన్సెక్స్ 249.29 పాయింట్లు పెరిగి 76,913.50 వద్ద ఆగింది. నిఫ్టీ 99.60 పాయింట్లు అందుకొని 23,997.55 దగ్గర నిలిచింది. లాభనష్టాల మధ్య ఊగిసలాడిన సూచీలు.. చివరకు స్వల్ప లాభాలకే పరిమితమయ్యాయి. మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు.. గ్లోబల్ క్రూడాయిల్ మార్కెట్లను షేక్ చేస్తున్నాయి. బ్యారెల్ ముడి చమురు ధర 110–125 డాలర్ల మధ్య కదలాడుతున్నది. ఈ పరిణామం సహజంగానే భారతీయ మార్కెట్లను ప్రభావితం చేస్తున్నది. ఈ క్రమంలోనే ఈ వారం మదుపర్లు అమ్మకాలు, పెట్టుబడుల నడుమ కొట్టుమిట్టాడవచ్చన్న అంచనాలు మెజారిటీ నిపుణుల నుంచి వస్తున్నాయి. ఇక జనవరి–మార్చికిగాను కార్పొరేట్ సంస్థలు ప్రకటించే ఆర్థిక ఫలితాల ప్రభావం సైతం మార్కెట్ ట్రేడింగ్‌పై గట్టిగానే ఉండనున్నది. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, రూపాయి విలువ, విదేశీ మదుపర్ల పెట్టుబడులూ ప్రధానమే. కాగా, అమ్మకాల ఒత్తిడి నెలకొంటే నిఫ్టీకి 23,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,200–24,500 పాయింట్ల స్థాయికి వెళ్లవచ్చనీ చెప్తున్నారు.



గమనిక..: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

టీడీఎస్, టీసీఎస్‌లో మారిన రూల్స్



ఎన్నారైలు, విద్యార్థులు, పర్యాటకులు
మదుపర్లు తెలుసుకోవాల్సింది ఇవే..

ఈ ఆర్థిక సంవత్సరం (2026–27) మొదలు (ఈ ఏడాది ఏప్రిల్ 1) ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్ (టీడీఎస్), ట్యాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్ (టీసీఎస్) నిబంధనల్లో కొత్త మార్పులు వచ్చాయి. పన్ను ప్రక్రియల క్రమబద్ధీకరణ, తప్పులు–లోపాలను సరిదిద్దడమే లక్ష్యంగా ఈ సవరణల్ని చేశారు. టీసీఎస్ రేట్ల తగ్గింపు, ఎన్నారైల కోసం సరళతర ఆస్తి లావాదేవీలు, ట్యాక్స్‌పేయర్స్ పేపర్ వర్క్‌ను కుదించడానికి యూనిఫైడ్ టీడీఎస్ డిక్లరేషన్ ఫారం పరిచయమయ్యాయి. విదేశీ రెమిటెన్స్‌లు, ఆస్తి లావాదేవీలు, పెట్టుబడి ఆదాయం సహా అనేక రకాల ఆర్థిక లావాదేవీలను ఈ సంస్కరణలు ప్రభావితం చేయనున్నాయి. మరి పన్ను చెల్లింపుదారులు, ముఖ్యంగా ఎన్నారైలు, మదుపర్లు, విదేశాల్లో చదువుకొనే భారతీయ విద్యార్థులు, విదేశీ పర్యటనలకు వెళ్లేవారు తెలుసుకోవాల్సిందే ఏమిటో చూద్దాం..

రెమిటెన్స్‌లు, ప్రయాణ ఖర్చులపై..

ఏప్రిల్ 1 నుంచి విదేశీ పర్యటన ప్యాకేజీలపై టీసీఎస్ 2 శాతంగానే ఉంటుంది. ఇంతకుముందు రూ.10 లక్షల వరకున్న ప్యాకేజీలపై 5 శాతం, ఆపై 20 శాతంగా పన్ను నిర్మాణం ఉండేది. అలాగే విద్య, వైద్య విదేశీ రెమిటెన్స్‌లపై టీసీఎస్ రేటు 5 శాతం నుంచి 2 శాతానికి దిగింది. మునుపు రూ.10 లక్షలకుపైగా ఉంటే 5 శాతం టీసీఎస్ వర్తించేది. ఈ మార్పుల్ని ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు.

సులువుగా ఎన్నారైలతో లావాదేవీలు

ప్రవాస భారతీయుల (ఎన్నారైలు) నుంచి ఆస్తి కొనుగోలు చేసే భారతీయులకూ ఊరట దక్కనున్నది. ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి కొనుగోలుదారులకు ట్యాక్స్ డిడక్షన్ అకౌంట్ నెంబర్ (ట్యాన్)తో అవసరం లేదు. టీడీఎస్‌కు కొనుగోలుదారుల పర్మనెంట్ అకౌంట్ నెంబర్ (పాన్) చాలు. దీంతో ఎన్నారైలకు చెందిన ఆస్తుల కొనుగోలు లావాదేవీలు మరింత సులువుగా, వేగంగా జరుగడానికి మార్గం సుగమం కానున్నది.

చిన్న మదుపర్ల కోసం..

రిటైల్ ఇన్వెస్టర్ల కోసం సింగిల్ టీడీఎస్ నాన్-డిడక్షన్ డిక్లరేషన్ ఫారం పరిచయమైంది. దీంతో ఇక పేపర్ వర్క్ బాగా తగ్గడమేగాక, సమయం ఆదా అవుతుందన్న అంచనాలున్నాయి. 15జీ, 15హెచ్ ఫారాల స్థానంలో ఒకే ఒక యూనిఫైడ్ ఫారం 121ను తెచ్చారు. పన్నుసహిత ఆదాయం తక్కువగా ఉన్న వ్యక్తులు, వృద్ధులు.. అనవసరమైన టీడీఎస్ డిడక్షన్ల నుంచి తప్పించుకోవడానికి ఈ 15జీ, 15హెచ్ ఫారాలను వినియోగించేవారు. ఇప్పుడు ఫారం 121తో ఆ రెండింటి పనీ తీరిపోతుంది.

గృహ రుణం కావాలా?

వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో వడ్డీరేట్లు ఇలా..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గత నెల ద్వైమాసిక ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం దేశంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో గృహ రుణాలపై వడ్డీరేట్లు వార్షిక ప్రాతిపదికన ఇలా ఉన్నాయి.

హోమ్ లోన్లపై వార్షిక వడ్డీరేట్లు ఇలా..

ప్రభుత్వ బ్యాంకుల్లో		ప్రైవేట్ బ్యాంకుల్లో	
బ్యాంక్	వడ్డీరేటు (శాతాల్లో)	బ్యాంక్	వడ్డీరేటు (శాతాల్లో)
బీవోఐ	7.10-10.00	సౌత్ ఇండియన్	7.20 మొదలు
బీవోఎం	7.10-9.90	ఫెడరల్	7.30-9.75
ఇండియన్ ఓవర్‌సీస్	7.10 మొదలు	కర్ణాటక	7.31-11.69
సెంట్రల్ బ్యాంక్	7.10-9.15	ఐసీఐసీఐ	7.45 మొదలు
యూనియన్	7.15-9.50	హెచ్‌ఎస్‌బీసీ	7.45 మొదలు
యూకో	7.15-9.25	కొటక్ మహీంద్రా	7.70 మొదలు
ఇండియన్ బ్యాంక్	7.15-9.55	హెచ్‌డీఎఫ్‌సీ	7.75 మొదలు
బీవోబీ	7.20-9.00	యాక్సిస్	8.00-9.10
కెనరా	7.20-10.00	ఆర్బీఎల్	8.20 మొదలు
ఎస్బీఐ	7.25-8.95	బంధన్	8.41-12.58
పంజాబ్ నేషనల్	7.25-9.20	కరూర్ వైశ్యా	8.45-10.65
పంజాబ్ & సింధ్	7.30-10.70	సిటీ యూనియన్	8.75-10.50

ఫిక్స్‌డ్ రేట్/ ఫ్లోటింగ్ రేట్

ఫిక్స్‌డ్ ఇంట్రెస్ట్ రేట్ విధానంలో తీసుకొనే గృహ రుణాలపై వడ్డీరేట్లు రుణ కాలపరిమితి అంతటా ఒకేలా ఉంటాయి. మొదట్నుంచి, చివరిదాకా ఎటువంటి మార్పుల్లేకుండా ఒకేలా ఉంటాయి. అయితే ఫ్లోటింగ్ ఇంట్రెస్ట్ రేట్ పద్ధతిలో వడ్డీరేట్లు పెరుగుతూ.. తగ్గుతూ ఉంటాయి. ఇది ఆర్బీఐ రెపోరేటు తదితర బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ రెపోరేటు తగ్గితే రుణాలపై వడ్డీరేట్లు తగ్గుతాయి. పెరిగితే వడ్డీరేట్లు కూడా పెరుగుతాయి.



వడ్డీరేటు లెక్క ఇదీ..

గృహ రుణాలపై సాధారణంగా వడ్డీని నెలవారీగా లేదా ఏడాది చొప్పున లేదా రోజువారీగా తగ్గింపు ఆధారంగా లెక్కిస్తారు. బ్యాంక్‌లో తీసుకున్న రుణంలో మీరు చెల్లించాల్సిన అసలుపై ఇది ఆధారపడి ఉంటుంది.

బహుమతిగా మ్యూచువల్ ఫండ్స్..

పిల్లలకు బదిలీ ముందు తల్లిదండ్రులు తెలుసుకోవాల్సిందేంటి?

మీ పిల్లలకు మ్యూచువల్ ఫండ్స్‌ను బహుమతిగా ఇవ్వాలనుకుంటున్నారా? అయితే ఈ కొత్త నిబంధనలను తెలుసుకోవాల్సిందే. నిజానికి పిల్లల దీర్ఘకాల సంపద నిర్మాణానికి మ్యూచువల్ ఫండ్స్ బహుమతి అనేది ఎప్పట్నుంచో ఉన్న చక్కని మార్గం. కానీ ఇటీవల వచ్చిన రూల్స్.. ఈ ప్రక్రియను చాలా సంక్లిష్టం చేశాయి. కాబట్టి డీమ్యాట్ అవసరాల నుంచి పన్ను సమస్యల వరకున్న నూతన విధివిధానాలను తల్లిదండ్రులు తప్పక తెలుసుకోవాలి. అప్పుడే పొరపాట్లను అధిగమించి అనుకున్నది సజావుగా సాగగలదు.

- నగదు, బంగారంలా కాకుండా.. మ్యూచువల్ ఫండ్ యూనిట్లను పన్ను చట్టం కింద మూలధన ఆస్తులుగా పరిగణిస్తారు. అందుకే బదిలీ, పన్నుల విషయంలో కొన్ని నిబంధనలు వర్తిస్తాయి.
- మ్యూచువల్ ఫండ్ యూనిట్లను డీమ్యాట్ రూపంలోనే బహుమతిగా ఇవ్వవచ్చు. కనుక తల్లిదండ్రులు తమ హోల్డింగ్స్‌ను ముందే డీమ్యాట్‌లోకి మార్చాలి. గిఫ్ట్ డీడ్‌ను సృష్టించాలి.
- డీమ్యాట్ రూపంలోకి మారిన తర్వాత మీ బహుమతిని ఆఫ్–మార్కెట్ మార్గదర్శకాల ఆధారంగా బదిలీ చేసుకోవచ్చు. ఇందుకు రూ.25 లేదా బదిలీ విలువలో 0.03 శాతాన్ని (ఏది ఎక్కువైతే అది) ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. దీనికి జీఎస్టీ, స్టాంప్ సుంకం అదనం.
- పన్ను చట్టాల కింద బహుమతులకు మినహాయింపు ఉన్నందున మీ మ్యూచువల్ ఫండ్స్ బహుమతిపై మూలధన లాభాల పన్ను ఉండదు.
- తల్లిదండ్రుల నుంచి మ్యూచువల్ ఫండ్స్‌ను బహుమతిగా తీసుకొనే పిల్లలూ పన్నుల్ని చెల్లించనక్కర్లేదు. అయితే కొంత కాలం తర్వాత వాటిని అమ్ముకున్నప్పుడు మాత్రం మూలధన లాభాల పన్నును చెల్లించాల్సి ఉంటుంది.
- పిల్లలు మైనర్లుగా ఉంటే.. బహుమతిగా ఇచ్చిన మీ మ్యూచువల్ ఫండ్స్ నుంచి వచ్చే ఆదాయం మీ (తల్లిదండ్రులు) ఆదాయం కిందకే వస్తాయి. అయినప్పటికీ ఏటా రూ.1,500 వరకు ఆదాయంపై పన్ను మినహాయింపు ఉంటుంది. ఈ పరిమితి దాటితే మీ ఐటీ శ్లాబుల ప్రకారం పన్నులు తప్పవు. పిల్లల వయసు 18 ఏండ్లు నిండేదాకా ఇంతే.

